



# చైతన్యరథం




సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




రాష్ట్ర పండుగగా
## మొల్ల జయంతి
- వివరాలు 9 లో..





# సాగుకు సాయం

ఐటీ, క్వాంటం, ఏఐవంటి రంగాల్లో కొత్త టెక్నాలజీలు, ల్యాబులు ఏర్పాటు చేస్తున్న తరహాలోనే.. వ్యవసాయానికి మరింత ఊతమిచ్చేలా అలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈక్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేద్దామని సీఎం ప్రకటించారు.

- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేద్దాం
- ప్రజల ప్రాణాలపట్ల అలక్ష్యం సరికాదు
- అధికారుల ఫీల్డ్ విజిట్లపై ప్రత్యేక పోర్టల్
- ప్రభుత్వం పని చేసేది పేదల కోసం... సంపన్నుల కోసం కాదు
- విద్యుత్ వినియోగదారులే విక్రేతలయ్యేలా ప్రణాళిక
- 6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2



అమూల్ తరహాలో
## స్వయం బ్రాండ్
3

మీ ప్రయోగాత్మక విధానాలు
## భవిష్యత్ మార్గదర్శకాలు
4

# మనమిత్రకు.. ప్రజాకాంక్షే ప్రేరణ!

- యువగళం పాదయాత్రలోనే వాట్సాప్ గవర్నెన్స్ ఆలోచన
- రియల్ టైం గవర్నెన్స్ విభాగ సాయంతో సులువుగా అమలు
- మెటా నిర్వహించిన సమావేశంలో మంత్రి నారా లోకేష్

5



యువగళం పాదయాత్ర సమయంలో రాష్ట్ర ప్రజలు వ్యక్తంచేసిన ఆకాంక్షే 'మనమిత్ర' వాట్సాప్ సేవలకు ప్రేరణగా నిలిచింది. పౌరసమాజ విశ్వాసానికి కేంద్రంగా 'మనమిత్ర' సేవలు ఉండాలన్న లక్ష్యమే.. అధికార యంత్రాంగం ఆలోచనా విధానాన్నీ మార్చింది.



పర్యాటకానికి
## కల్చరల్ ఏఐ

- ఏరోస్ ఇన్నోవేషన్‌తో భాగస్వామ్యం
- ఐఏపీఏ ఎక్స్‌పోలో రెండోరోజు చర్చలు
- వారసత్వ సంపదకు డిజిటల్ సొబగు
- 'క్రియేటర్ ఎకానమీ'లో యువతకు గ్లోబల్ ప్లాట్‌ఫామ్
- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

11



# రాష్ట్రానికి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్

- ప్రపంచంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్‌కు నేడు శంకుస్థాపన
- సిస్టమ్స్ సెంటర్‌నూ అభివృద్ధి చేయనున్న సాగర్ డిఫెన్స్ పరిశ్రమ
- జువ్వలదిన్నెలో ప్రాజెక్టుకు నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేష్
- మొదటి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి.. 750మందికిపైగా ఉపాధి

6

## రైతుల పేరుతో జగన్ అబద్ధాల రాజకీయం

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- వివరాలు 9 లో..

## అసత్యాల విషజీవి జగన్

కార్మిక శాఖ మంత్రి సుభాష్
- వివరాలు 13 లో..

## స్త్రీ శక్తిపై జగన్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- వివరాలు 9 లో..



6

## మనసారా..!

ఢిల్లీ పర్యటనలో ఉన్న విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ కూటమి ఎంపీల ఆత్మీయ సమావేశంలో సందడి చేశారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు నివాసంలో బుధవారం మధ్యాహ్నం ఇచ్చిన విందుకు కూటమి ఎంపీలు, మంత్రి నారా లోకేష్ హాజరై ఆత్మీయ సమయాన్ని వెచ్చించారు.




## తెలుగు వారికి కొండంత అండ: పల్లా

8

# సాగుకు మరింత సాయం

- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేద్దాం
- ప్రజల ప్రాణాలపట్ల అలక్ష్యం సరికాదు
- అధికారుల ఫీల్డ్ విజిట్లపై ప్రత్యేక పోర్టల్
- ప్రభుత్వం పని చేసేది పేదల కోసం... సంపన్నుల కోసం కాదు
- విద్యుత్ వినియోగదారులే విక్రేతలయ్యేలా ప్రణాళిక
- పథకాలపై ప్రచారంతో ప్రజల్లో అవగాహన పెంచాలి
- పంట కాల్వల పూడికతీత, చెరువుల లింకేజీకి 90 రోజుల యాక్షన్ ప్లాన్
- జల్ జీవన్ మిషన్ గడువు పెంపు శుభపరిణామం
- 6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): ఐటీ, క్వాంటం, ఏఐవంటి రంగాల్లో కొత్త టెక్నాలజీలు, ల్యాబులు ఏర్పాటు చేస్తున్న తరహాలోనే.. వ్యవసాయానికి మరింత ఊతమిచ్చేలా అలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈక్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేద్దామని సీఎం ప్రకటించారు. రెండురోజుల జిల్లా కలెక్టర్ల సమావేశం బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగానికి ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలు, చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజల్లో ప్రచారం కల్పించాలని.. అలాగే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ఇదే సందర్భంగా ఇటీవల జరిగిన వివిధ ఘటనలపై సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వేట్లపాలెం బాణాసంచా పేలుళ్ళ, శ్రీకాకుళంలో డయేరియా, రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనల్లో అధికార యంత్రాంగం అలక్ష్యంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిలియనీర్ల కోసం పని చేయడం లేదని.. పేదల కోసం పనిచేస్తోందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 6వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ప్రతీ మూడు నెలలకూ పాలనా అంశాలపై సమీక్ష చేసుకుని ముందుకెళ్తున్నాం. ఉన్న పరిమిత వనరులతోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్సు చేస్తున్నాం. గతంలో కార్యాలయాల్లో కూర్చుని ఫైల్స్‌రాసే పరిస్థితినుంచి వర్చువల్ పని విధానాన్ని తీసుకువచ్చాం. గడచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చాం. ప్రభుత్వం తెచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి. వీటి అమలులో ఉదాసీనత వద్దు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా తెచ్చిన 10 సూత్రాలు అమలు చేస్తే సుపరిపాలన అందించేందుకు వీలవుతుంది. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలి. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి. ఎక్కడా చిన్న పొరపాటు కూడా దొర్లకుండా పారదర్శకంగా అమలు చేయాలి. 13న అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులు విడుదల చేస్తున్నాం. కేంద్రం ఇచ్చే వాటితోపాటు రాష్ట్రం కూడా రైతుల ఖాతాల్లో మిగతా సొమ్ము జమ చేస్తుంది. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా వేర్వేరు ప్రతినిధులు 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని సమర్థంగా తీసుకెళ్దాం. ప్రజల్లోకి వెళ్లి... ఈ పథకం గురించి చెప్పాలి. డబ్బులు విడుదల చేస్తున్నామని వివరించాలి. ఖరీఫ్ సాగుకోసం మే 15న నీటిని విడుదల చేస్తున్నాం. సీజన్‌లో ముందుగానే నీరిస్తాం. మే 15నుంచే సాగుకు సిద్ధమవుదాం. ఏఐ అగ్రానమిస్ట్ సేవలు కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ వ్యవసాయదారుడికి ఏఐ అగ్రానమిస్ట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలి" అని ముఖ్యమంత్రి సూచించారు.

## భూ వివాదాలు లేకుంటే 70 శాతం సమస్యలు తీరినట్టే...

"ఉగాది కానుకగా 2.5 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తాం. జూన్ నెలలో మరికొన్ని ఇళ్లను లబ్ధిదారులకు ఇస్తాం. ఇల్లు, ఇంటి జాగా కూడా మూడేళ్లలో ఇవ్వాల్సి ఉంది. ఇంద్రధనస్సు పేరిట దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతోపాటు మరికొన్ని కార్యక్రమాలు అమలు చేయబోతున్నాం. గత పాలనలో ట్రూ అప్ పేరిట విద్యుత్ చార్జీల భారం వేశారు. తొలిసారి ట్రూ డౌన్ చేశాం. రూ.4,600 కోట్ల భారాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తోంది. ఈ ఏడాది 39 పైసలమేర విద్యుత్ కొనుగోలు ధర తగ్గిస్తాం. కుసుమ్ కింద 3 లక్షల పంప్ సెట్లు ఇస్తున్నాం. సబ్ స్టేషన్ యూనిట్‌గా మైక్రో గ్రిడ్ ఏర్పాటుతోపాటు ప్రోజ్యూమర్ కాన్సెప్టును సమర్థంగా అమలు చేయాలి. విద్యుత్ ఉత్పాదన ఓ సంపాదనా మార్గంగా మారాలి. విద్యుత్ వినియోగదారులను విక్రేతలుగా మార్చేలా రూపొందించిన ప్రణాళికను సక్సెస్ చేయాలి. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ కింద 1.12 లక్షలమంది మహిళా మైక్రో ఎంట్రప్రెన్యూర్లను తయారు చేశాం. వచ్చే ఏడాదికి 5 లక్షలమంది మహిళలను పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేలా లక్ష్యంగా పెట్టుకున్నాం. 2047 నాటికి ప్రతీ వెయ్యి మందికి ఒక స్టార్టప్ ఏర్పాటు చేసుకునేలా లక్ష్యంగా పెట్టుకుందాం. సమర్థ నీటి నిర్వహణ చాలా కీలకమైన అంశం. నీటి భద్రత కోసం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలిచ్చాయి. గడచిన రెండు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.82 మీటర్లమేర భూగర్భజలాలు పెరిగాయి. మార్చి 1నాటికి 8.10 మీటర్లలో భూగర్భ జలాలున్నాయి. ఏప్రిల్ 1నుంచి జూన్ నెలాఖరు వరకూ 90 రోజులపాటు నీటి సంరక్షణా చర్యలు చేపట్టాలి. నో సబ్ మెర్జెన్స్ విధానంలో కాలువల పూడికలు, చెరువుల లింకేజీలాంటి కార్యాచరణ చేపట్టాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 614 టీఎంసీ నీళ్లు రిజర్వాయర్లలో ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో సాగు సీజన్‌ను ముందుకు తీసుకొచ్చేలా ప్రణాళిక చేస్తున్నాం. భూగర్భ జలాలు పెరిగితే ప్రభుత్వం ఇస్తున్న రూ.14 వేల కోట్ల విద్యుత్ సబ్సిడీలు భారం తగ్గుతుంది. వెలిగొండను జూలైనాటికి పూర్తిచేసి నీటిని ఇస్తాం. 30 ఏళ్ల క్రితం నేనే శంకుస్థాపన చేశాను. పోలవరం ప్రాజెక్టును 2027లో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఉత్తరాంధ్ర, రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం. 2027 మార్చినాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తాం. ఎక్కడా భూ వివాదాలు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేయాలి. పిటిషన్ కల్చర్‌ను తగ్గించేలా చర్యలు చేపట్టాలి. వాస్తవాలన్నీ పోర్టల్‌లో పెడితే వివాదాలు తగ్గుతాయి. పీజీఆర్ఎస్ ద్వారా ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కారం కావాలి. అకౌంటబిలిటీ ఫిక్స్ చేయాలి. భూవివాదాలు లేకపోతే 70 శాతం సమస్యలు తగ్గుతాయి" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ప్రజల ప్రాణాలపట్ల ఉదాసీనత ఉంటే సహించం

"శ్రీకాకుళం డయేరియా, రాజమహేంద్రవరం కల్తీ పాలు, వేట్లపాలెం బాణసంచాలాంటి ఘటనలు బాధాకరం. ప్రజల ప్రాణాలు లెక్కచేయకుండా ఎవరు వ్యవహరించినా కఠినంగా ఉంటాం. స్వార్థపరుల చేతుల్లోకి పరిస్థితులు వెళ్లడానికి వీల్లేదు. నీరు కలుషితం, పాలు కల్తీ అవుతుంటే ఆయా విభాగాలు ఏం చేస్తున్నాయి...? బాణాసంచా నిబంధనలకు విరుద్ధంగా తయారు చేస్తుంటే ఏం చేస్తున్నారు..? కలెక్టర్లు కనీసం 8 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. సీనియర్ సెక్రటరీలు 4 రోజులపాటు క్షేత్రస్థాయికి వెళ్లాలి. దీనిపై పోర్టల్ తయారుచేసి ఆన్ లైన్‌లో పెట్టేలా సీఎస్ బాధ్యత తీసుకోవాలి. క్షేత్రస్థాయి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సింది కలెక్టర్లే. ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదు. ఏది వాస్తవమో అధ్యయనం చేసుకుని తగిన నిర్ణయం తీసుకునే బాధ్యత కలెక్టర్లదే. ప్రభుత్వం పని చేసేది బిలియనీర్లు, ట్రిలియనీర్ల కోసం కాదనే విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలి. సంజీవని ప్రాజెక్టును సమర్థంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి. 72 లక్షలమందికి వివిధ ఆరోగ్య సమస్యలున్నట్టు స్క్రీనింగ్‌లో తేలింది. ప్రతీ ఇంటికీ సురక్షితమైన మంచినీరు అందించాలి. గత పాలకులు చేసిన తప్పువల్ల జేజేఎం కింద నిధులు కోల్పోయాం. శాశ్వత పరిష్కారంగా ప్రాజెక్టులు పూర్తిచేసి ఉండాల్సింది. జేజేఎం కింద కేవలం రూ.2వేల కోట్ల నిధులను మాత్రమే గత ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఈ ప్రాజెక్టును కొనసాగించాలని కేంద్రాన్ని కోరాం. పాత స్కీంను రూ.28 వేల కోట్లను ఖర్చు చేసేలా 2028 వరకూ పొడిగించారు. ఇది చాలా సంతోషించదగ్గ విషయం. ప్రతీ ఇంటికీ సురక్షితమైన తాగునీరు ఇచ్చేలా కనెక్టు చేయాలి. స్థానిక నీటి వనరుల నుంచి నీటిని అందించేలా చూడాలి. 2 ఏళ్లలో జేజేఎం పథకాన్ని పూర్తి చేసుకుని ప్రతీ ఇంటికీ కుళాయి ఇవ్వండి. పైప్‌లైను వేయడం కోసం రోడ్లను తవ్వేసి మళ్లీ సరిచేయకుండా వదిలేస్తున్నారు. ఈ విషయంలో ఖచ్చితంగా ఉండాల్సిందే. మేజిక్ డ్రెయిన్లను కూడా వేగంగా చేయండి. ఫైబర్ గ్రిడ్ ద్వారా ఇంటర్నెట్ ఇవ్వాలని ఆలోచన చేస్తున్నాం. వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు కూడా అమల్లోకి వస్తున్నాయి. ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టాలి. స్వచ్ఛ సర్వేక్షణ్ మార్చి 15కు ప్రారంభమవుతుంది. కనీసం 50 మున్సిపాలిటీలకు అవార్డులు రావాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు.. పరిసరాలను అందంగా తీర్చిదిద్దాలి. అమరావతి ప్రాంతంలో ఇరువైపులా చెట్లు, పూలతో రోడ్లు అత్యంత రమణీయంగా ఉన్నాయి. ఇతర ప్రాంతాలు కూడా అందంగా మార్చేలా చర్యలు తీసుకోవాలి" అని సీఎం చంద్రబాబు సూచించారు.

## 23న ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన

"పాలనలో సాంకేతికతను మరింత తీసుకువచ్చేలా కార్యాచరణ, డేటా డ్రివెన్ గవర్నెన్సు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం కూడా గణనీయంగా పెరగాలి. డిజిటల్ లిటరసీని పెంచేలా ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకుందాం. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్సును కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోండి. సెప్టెంబరులో ప్రాజెక్టులు పూర్తి చేసి యాక్షన్ టేకెన్ రిపోర్టు అందరి ముందు పెడతామని చెప్పాం. దానికి అనుగుణంగా కలెక్టర్లు పెట్టుబడుల ప్రతిపాదనలకు సంబంధించిన ప్రాజెక్టులపై వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. ప్రాజెక్టులన్నీ గ్రౌండ్ అయ్యే బాధ్యతను జిల్లా కలెక్టర్లు తీసుకోవాలి. మార్చి 23న అర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టును శంకుస్థాపన చేయబోతున్నాం. రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయి. 2028 మార్చిలోగా పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశించాం. కొప్పర్తి, ఓర్వకల్లులాంటి ప్రాంతాలు పారిశ్రామిక క్లస్టర్లుగా తయారు కావాలి. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజల్లోకి ప్రభుత్వ విధానాలు సమర్థంగా వెళ్లాలి. పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీపై చర్చ జరగాలి. పీ-4 కూడా ఓ గేమ్‌చేంజర్. ఇది టేకాఫ్ కావడానికి కొంత సమయం పడుతుంది కానీ మంచి ప్రయోజనాలు వస్తాయి. కలెక్టర్లు పీ-4ను మానిటర్ చేయాలి. 2047కి రూ.55 లక్షల తలసరి ఆదాయం వచ్చేలా చూడాలి. మహిళ సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు స్వయం బ్రాండ్‌తో మార్కెటింగ్ చేసేలా దృష్టి పెట్టాలి. ఇరాన్ సహా ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధ ప్రభావాలు మనపై కూడా పరోక్షంగా పడుతోంది. ప్రవాసాంధ్రులు వేర్వేరు దేశాల్లో విస్తరించి ఉన్నారు. గుడ్లు, అరటిలాంటి ఉత్పత్తుల ధరలు ఈ కారణంగా పడిపోతున్నాయి. ప్రత్యామ్నాయ మార్కెట్లకు మన ఉత్పత్తులు చేరుకోవాలి. శాంతిభద్రతల విషయంలో రాజీ పడేదే లేదు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నాం. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగంలో కేపీఐలు మెరుగుపడాలి. రూ.20 లక్షల కోట్లకు స్థూల ఉత్పత్తి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 15.1 శాతం మేర వృద్ధిరేటు లక్ష్యాన్ని కూడా సాధించేలా చర్యలు చేపడుతున్నాం. మన యువతకు నైపుణ్యాభివృద్ధి విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. ఏఐ, క్వాంటంలాంటి సాంకేతికతలోనూ మన యువతకు నైపుణ్యాలు పెరగాలి. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఇంఛార్జి మంత్రులు, కార్యదర్శులు ఈ లక్ష్యాలపై దృష్టి సారించాలి" అని సీఎం చంద్రబాబు దిశనిర్దేశం చేశారు. సమావేశంలో మంత్రులు, సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమూల్ తరహాలో స్వయం బ్రాండ్

- కౌలు రైతుల రుణాలకు నిబంధనలు అడ్డుకాకూడదు
- అవసరాలకు అనుగుణంగా స్వర్ణ గ్రామ -వార్డుల్లో సిబ్బంది సర్దుబాటు
- 6వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు




అమరావతి (చైతన్య రథం): అమూల్ బ్రాండ్ తరహాలోనే డ్వాక్రా ఉత్పత్తుల కోసం రూపొందించిన 'స్వయం' బ్రాండ్‌ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రెండు రోజులపాటు జరగనున్న 6వ జిల్లాల కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. తొలిరోజు చర్చలో భాగంగా వివిధ అంశాల్లో జరిగిన ప్రగతిని ఆయా శాఖలకు చెందిన అధికారులు ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ అంశాల్లో కొన్ని కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... "డ్వాక్రా, మెప్మాలోని స్వయం సహాయ సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను 'స్వయం' పేరిట బ్రాండింగ్ చేస్తున్నాం. దీని కోసం మహిళా దినోత్సవాన లోగోను కూడా ఆవిష్కరించాం. మల్టీ బిలియన్ డాలర్ల కంపెనీ ఉత్పత్తులకు ఎలాంటి బ్రాండింగ్ లభిస్తుందో... డ్వాక్రా ఉత్పత్తులకూ అదేస్థాయిలో బ్రాండింగ్ తెచ్చేలా కృషి చేస్తున్నాం. అమూల్ తరహాలోనే సహకార విధానంలో ఈ ఉత్పత్తుల మార్కెటింగ్ జరగాలి. అమూల్ పాడి రైతుల భాగస్వామ్యంతో నడుస్తోంది. స్వయంలో డ్వాక్రా మహిళల భాగస్వామ్యముంది. బిలియన్ డాలర్ల కంపెనీకి ఉన్నంత క్రెడిబులిటీ డ్వాక్రా మహిళలకుంది. డ్వాక్రా మహిళలు తీసుకునే రుణాలను తప్పకుండా తిరిగి చెల్లిస్తారు. డ్వాక్రా మహిళలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకొస్తాయి. ఇంతటి క్రెడిబులిటీ ఉన్న డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేయగలిగితే అద్భుతంగా ఉంటుంది. బ్రాండ్ లేకపోతే ఉత్పత్తి విలువ సగానికి తగ్గిపోతుంది. గ్లోబల్ మార్కెట్టుకు చేరేలా డ్వాక్రా ఉత్పత్తుల ప్రమాణాలు పెరగాలి. ఈ ఉత్పత్తులకు ట్రేసబిలిటి, సర్టిఫికేషన్ కూడా ఉండేలా చూడాలి. 28 జిల్లాలు... 28 బ్రాండ్లను రూపొందించి పోటీని పెంచాలి. 'స్వయం' బ్రాండ్ ఎస్టాబ్లిష్ కావాలంటే నాణ్యతా ప్రమాణాలే అత్యంత కీలకం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## జిల్లాస్థాయిలో ఆర్టీజీఎస్ కేంద్రాలు

"జిల్లాస్థాయిలో ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని ఉద్యోగుల పనితీరును విశ్లేషించుకోవాలి. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగానికీ కంప్యూటర్ అవగాహన తప్పనిసరి అర్హతగా చేర్చేలా సాధారణ పరిపాలన శాఖ చర్యలు తీసుకోవాలి. ప్రతి జిల్లాల్లో హెచ్ఆర్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా సిబ్బంది ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చు. ప్రణాళికా విభాగం ఆన్ లైన్ కోర్సులు తీసుకువచ్చినా ప్రాక్టికల్ నాలెడ్జి వచ్చేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. కౌలు రైతులకు రుణాలివ్వడానికి అడ్డంకిగా ఎలాంటి నిబంధనలు ఉండకూడదు. ఏమైనా నిబంధనలుంటే వాటిపై చర్చించి తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయాన్ని రీఓరియంట్ చేయాలి. వ్యవసాయంతోపాటు... ఉద్యాన, పశుసంవర్ధక రంగాలవైపు రైతులు మళ్లాలి. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డుల్లో మహిళా పోలీసుల సేవలను ఎవరూ వినియోగించుకోవటం లేదు. వారి సేవలను అవసరమున్న శాఖలు వినియోగించుకోవాలి. ఆర్ అండ్ బి, హెల్త్, మున్సిపల్ శాఖలకు ఎక్కువగా అవసరం ఉన్నట్టుగా చెబుతున్నారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లోని సిబ్బంది సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా.. ఆమేరకు సర్దుబాటు చేసుకునేలా కలెక్టర్లకు అధికారాలిస్తున్నాం. స్వర్ణవార్డు, గ్రామ సిబ్బంది బదిలీలు సిఫార్సుల ఆధారంగా కాదు. అవసరానికి అనుగుణంగానే జరగాలి. రేషనలైజేషన్ ప్రకారమే ఈ బదిలీలు జరగాలి" అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధిపై ఫోకస్ పెట్టాలి

"రైల్వే ప్రాజెక్టులపరంగా నిధులకు సమస్య లేదు. ఇచ్ఛాపురంనుంచి చెన్నై వరకూ 4 లేన్ల మార్గం చేస్తున్నారు. అన్ని రైల్వే స్టేషన్లనూ ఆధునీకరించే ప్రక్రియను రైల్వే శాఖ చేపట్టింది. దీనిని అందిపుచ్చుకోవాలి. రైల్వే క్రాసింగ్స్ 1137కు పైగా ఉన్నాయి. ఇక్కడ ఆర్‌వోబీ, ఆర్‌యూబీలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. లాజిస్టిక్స్ పార్కులను రైల్వేలైన్లకు అనుసంధానించండి. తక్కువ వ్యయంతో రవాణాకు ఆస్కారముంది. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. విద్యుత్ కొనుగోలు వ్యయంపై ప్రత్యేంగా ఫోకస్ పెట్టాలి. దేశంలో ఎక్కడా విద్యుత్ ఛార్జీలు తగ్గించిన పరిస్థితి లేదు. కానీ మనం ఆ దిశగా ఇప్పటికే అడుగులు వేశాం. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి. నైపుణ్య శిక్షణ ద్వారా యువతకు ఉద్యోగాల కల్పించడంతోపాటు.. మిగతావారికి స్ఫూర్తినిచ్చేలా ఆ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా బాధ్యత తీసుకుని విస్తృతంగా ప్రచారం చేపట్టాలి. నైపుణ్యం, కౌశలం పోర్టల్ ద్వారా ఉద్యోగాలు, నైపుణ్య కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి. యువతకు ఉద్యోగాలు, నైపుణ్యం కల్పించే విషయంలో ఒకే తరహా విధానాన్ని అనుసరించాలి. ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్‌వంటి అంశాలను కూడా ప్రాధాన్యతగా చేపట్టాలి. లాజిస్టిక్స్ డెవలప్మెంట్‌పై ప్రధానంగా దృష్టి సారించాలి. లాజిస్టిక్స్ ప్రాజెక్టుల్లో భాగంగా పోర్టులు, ఎయిర్ పోర్టులవద్ద పారిశ్రామిక టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలి. ఎంఎస్ఎంఈ విధానం కింద లాజిస్టిక్స్ పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. ఒక్కో జిల్లాలో 5 ఎకరాల్లో హెలీపోర్టులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. కేంద్రం దీనికి నిధులిస్తుంది. ఆయా జిల్లాల్లో ముఖ్యమైన పట్టణాలు, ప్రాంతాల్లో హెలీపోర్టులు ఏర్పాటు చేస్తే ప్రయోజనం కలుగుతుంది" అని సీఎం సూచించారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల సాధనలో పోటీపడాలి

"కాకినాడ, సామర్లకోటలో పర్యటించినప్పుడు రోడ్లపక్కన చెత్త కనిపించింది. మున్సిపల్ కమిషనర్లు పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను సాధించటంలో రాష్ట్రంలోని పట్టణాలు, నగరాలు ఒకదానికి ఒకటి పోటీ పడాలి. శానిటేషన్ నిర్వహణపై ప్రజల్లో కూడా విస్తృత అవగాహన కల్పించాలి. ప్రమాణాలకు అనుగుణంగా పట్టణ, నగర ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా ప్రయత్నం చేయాలి. గ్రామాల్లోనూ పరిశుభ్రతపై అంతా దృష్టి సారించాలి. పరిశుభ్రత మన సంస్కృతిలో భాగం. ఆరోగ్యపరంగానూ శుభ్రత అనేది కీలకమైన అంశం. స్మార్ట్ హెల్త్ కేర్, వ్యవసాయంలో సాంకేతికత, విద్య, డిజిటల్ గవర్నెన్సు రంగాల్లో డీప్ టెక్ వినియోగం పెరగాలి. ఏఐ, బ్లాక్ చైన్, ఐఓటీ, రోబోటిక్స్‌లాంటి టెక్నాలజీల వినియోగాన్ని పెంచితే వేగంగా, తక్కువ వ్యయంతోనే ఫలితాలు అందుకునే అవకాశం ఉంటుంది. వ్యవసాయంలో సాంకేతికత వినియోగం పెరగాలి. అగ్రిటెక్ సహా ఏఐ అగ్రానమిస్ట్ అంశాన్ని 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ప్రతీ ఇంటింటికీ తీసుకెళ్లాలి. రైతన్నా మీకోసం కార్యక్రమం ప్రతీనెలలో 16, 17, 18, 23, 24, 25 తేదీల్లో చేపట్టాలి. పంటల్లో యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు ప్రోత్సాహకంగా రైతులకు ఉచితంగా నానో యూరియా ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలి. రైతులకు నానో యూరియా ఉచిత సరఫరాపై కేంద్రంతో సంప్రదింపులు జరపాలి"అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సమావేశానికి మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు హాజరయ్యారు.

# అనకాపల్లిలో జీరో వేస్ట్ రెసిడెన్షియల్ స్కూళ్లు

- చెత్త ద్వారా సర్క్యులర్ ఎకానమీ
- కలెక్టరుకు సీఎం అభినందనలు
- రాష్ట్రమంతటా ఈ పద్ధతి అమలు చేయాలని ఆదేశం



అమరావతి (చైతన్య రథం): అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లను జీరో వేస్ట్ స్కూళ్లుగా మార్చుతూ ఆ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా అధికారులు చేసిన వినూత్న ప్రయత్నం జిల్లా కలెక్టర్ల సదస్సు దృష్టిని ఆకర్షించింది. జిల్లాలో 114 సంస్థల్లో చెత్త, వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడంలో జిల్లా కలెక్టర్ వినూత్నంగా వ్యవహరించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేస్తూ అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఆ దిశగా ఈ విద్యా సంస్థల్లో ఉన్న చదువుతున్న విద్యార్థులు ఈ చెత్తను పొడి చెత్త, తడి చెత్త వేరు చేసి పారేసేలా వారిలో చైతన్యం కల్పించారు. తడి చెత్తను కంపోస్టుగా తయారు చేయడానికి ఆయా స్కూళ్ల పరిధిలో ప్రత్యేకంగా గుంతతవ్వి అందులో వేశారు. ఈ చెత్తను కంపోస్టుగా తయారు చేయడానికి ప్రత్యేకంగా గుంతలుతవ్వి వాటిని రైతులకు ఉపయోగపడే ఎరువుగా తయారు చేస్తున్నారు. హాస్టళ్లనుంచి వృధాగా వెళ్లే నీరులో హానికరంకాని నీరు, హానికర నీరు అని రెండుగా విడదీసి, అవి బయటకు వెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పొడిచెత్తను రీసైక్లింగ్ కోసం ఆయా పరిధిలోని స్వర్ణ సచివాలయానికి అందజేశారు. మురికి నీరును మున్సిపల్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటుకు పంపేలా ఏర్పాటు చేశారు. 114 స్కూళ్లలో 24,775 మంది విద్యార్థులకు ఇది లబ్ధి కలిగింది. ఈ సంస్థలనుంచి ప్రతి నెలా 57.1 టన్నుల తడి చెత్త, 24.5 టన్నుల పొడి చెత్త పోగవుతోంది. ఈ చెత్తద్వారా హాస్టళ్లకు ప్రతి నెలా రూ.2.17 లక్షల ఆదాయం సమకూరుతోందని అనకాపల్లి జిల్లా కలెక్టరు వివరించారు.

## సీఎం అభినందనలు

జీరో వేస్ట్ సంస్థలుగా జిల్లాలో రెసిడెన్షియల్ స్కూళ్లను మార్చుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ చేసిన ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ మోడల్‌ను అన్ని జిల్లాల కలెక్టర్లు అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఒక మంచి పేరు సూచించాలన్నారు. కేవలం ఇంతటితో ఆగకుండా అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో వారి అవసరాలకు సరిపడేలా కూరగాయలు పండించేలా తోటలు సాగు కూడా చేపట్టాలని, తద్వారా కూరగాయల అవసరాల్లో సమృద్ధి సాధించవచ్చన్నారు. ఈ దిశగా కూడా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

చైతన్యరథం





## మీ ప్రయోగాత్మక విధానాలు

# భవిష్యత్ మార్గదర్శకాలు

**కలెక్టర్ల సక్సెస్ ప్రజెంటేషన్లపై సీఎం ప్రశంస - ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏడు జిల్లా కలెక్టర్ల ప్రజెంటేషన్లు**

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరో కలెక్టర్ల సదస్సులో భాగంగా మొదటి రోజున ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ఏడు జిల్లాల్లో విజయవంతంగా అమలవుతున్న వినూత్న ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లలో ఆయా జిల్లాల కలెక్టర్లు తమ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధించిన వినూత్న ప్రాజెక్టుల గురించి వివరించారు. ఏఐ టెక్నాలజీతో మారుమూల గ్రామాల్లో సైతం ముందస్తుగానే జబ్బులను గుర్తించి ఉచిత వైద్యం అందిస్తున్న టెక్నాలజీ విధానాన్ని చిత్తూరు కలెక్టర్ వివరించారు.

### చిత్తూరు జిల్లా:

## సంజీవని ప్రాజెక్ట్

గ్రామీణ ప్రజల ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చే 'సంజీవని ప్రాజెక్ట్' గురించి చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తన ప్రజెంటేషన్‌లో వివరించారు. టాటా సహకారంతో ఏర్పాటు చేసిన 'డిజిటల్ నెర్వ్ సెంటర్' అనే ఏకీకృత ప్లాట్‌ఫామ్ ద్వారా జిల్లాలోని 119 ఆరోగ్య కేంద్రాలను అనుసంధానించి.. ఇప్పటికే 3 లక్షల 10 వేలమందికి డిజిటల్ హెల్త్ రికార్డులు సృష్టించినట్టు వివరించారు. డాక్టర్లు అందుబాటులో లేని మారుమూల గ్రామాల్లో సైతం టెలీ కన్సల్టేషన్ ద్వారా రోగులకు సేవలు అందిస్తున్నామని, ఇందుకోసం వైద్యుల కోసం ఏఐ ఆధారిత యాంబియంట్ లిజనింగ్ టెక్నాలజీని కూడా వాడుతున్నామని వివరించారు. పౌరుల కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్ తీసుకువచ్చామని, 'ట్రూ వెల్నెస్ మీటర్', 'కేర్ ప్లానోగ్రామ్' ద్వారా 12 రకాల ప్రాథమిక ఆరోగ్య సేవలను అందిస్తూ, సుమారు 63 వేలమందికిపైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ప్రాణాపాయం రాకముందే వ్యాధులను పసిగట్టే వ్యవస్థను జిల్లాలో ఎలా అమలు చేస్తున్నారో వివరించారు.

### అంబేద్కర్ కోనసీమ జిల్లా:

## కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్

విదేశాలకు వలస వెళ్లే కార్మికుల రక్షణకు తీసుకువచ్చిన 'కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్' ఆవశ్యకతను కోనసీమ కలెక్టర్ ఆర్ మహేశ్‌కుమార్ వివరించారు. తమ జిల్లానుంచి సుమారు 15 వేలమంది గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నారని, అయితే నకిలీ ఏజెంట్ల చేతిలో యువత మోసపోతూ పడుతున్న ఇబ్బందులను గమనించే జిల్లా రెవెన్యూ అధికారి నోడల్ అధికారిగా ఐదుగురు సిబ్బందితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా 24 గంటలు పనిచేసే హెల్ప్‌లైన్ ప్రారంభించి.. ఇప్పటికే 199 దరఖాస్తులు పరిష్కరించామని, ఇబ్బందుల్లోవున్న 40 మంది వలస కార్మికులను సురక్షితంగా స్వదేశానికి రప్పించామని కలెక్టర్ తెలిపారు. గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లేవారిలో చాలామందికి అక్కడ ఉండే ఉపాధి పనులు, ఆహార అలవాట్లు, ఏయే రంగాల్లో పనులు ఉంటాయనే వివరాలేమీ ముందుగా తెలియక.. అక్కడికి వెళ్లాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రయాణానికి ముందే యువతకు కౌన్సెలింగ్ ఇస్తూ, వారి పాస్‌పోర్ట్, వీసా, వెళ్లే కంపెనీ వివరాలను పోలీసుల సమన్వయంతో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వారిని విదేశాలకు పంపుతూ, హైదరాబాద్ పాస్‌పోర్ట్ అధికారుల శిక్షణతో ఈ కేంద్రాన్ని ఎలా నడిపిస్తున్నారో ఆయన స్పష్టంగా వివరించారు. ఈ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి థియేటర్లలో ప్రదర్శిస్తున్న 2 నిమిషాల వీడియో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనిపై సీఎం చంద్రబాబు స్పందించి కలక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ విధానాన్ని అన్ని జిల్లాలు అడాప్ట్ చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. అంతేక రాష్ట్రస్థాయిలో జిఏడి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక మైగ్రేషన్ పోర్టల్‌ను ఏర్పాటు చేసి రాష్ట్రమంతటా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

### ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా:

## భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

దశాబ్దాలుగా రైతులను పీడిస్తున్న భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తాము రూపొందించిన పకడ్బందీ విధానాన్ని నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రెజెంట్ చేశారు. పాత రికార్డులు, సరిహద్దు తగాదాలవల్ల భూసమస్యల పరిష్కారం ఎందుకు కష్టమవుతుందో విశ్లేషిస్తూ, దానికి విరుగుడుగా అధికారులే నేరుగా ఒక గ్రామాన్ని నెల రోజుల వ్యవధిలో నాలుగు దఫాలుగా ఎలా సందర్శిస్తారో ఆయన వివరించారు. మొదటి విడతలో గ్రామస్తుల సమస్యలు వినడం, రెండో విడతలో రికార్డుల పరిశీలన, మూడో విడతలో డిజిటల్ సర్వే ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన, నాలుగో విడతలో పారదర్శకంగా తీర్పు చెప్పి అక్కడికక్కడే పట్టాలు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ అద్భుతమైన ప్రణాళిక ద్వారా కేవలం మూడు నెలల వ్యవధిలోనే 110 గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించగా, అందులో 26 గ్రామాలు పూర్తిగా భూవివాదరహిత (జీరో పెండెన్సీ) గ్రామాలుగా ఎలా మారాయో కలెక్టర్ గణాంకాలతో సహా ప్రదర్శించారు.

### విశాఖపట్నం జిల్లా:

## వైజాగ్ వన్

నగరవాసులకు పాలనను మరింత సులభతరం చేసే 'వైజాగ్ వన్' అప్లికేషన్ పనితీరును విశాఖపట్నం కలెక్టర్ హరీంద్ర ప్రసాద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పౌరులు తమ ఫిర్యాదులు, పన్నుల చెల్లింపుల కోసం వేర్వేరు యాప్స్ వాడకుండా అన్ని పౌర సేవలను ఒకే గొడుగు కిందికి ఎలా తెచ్చామో తెలిపారు. ఆస్తి పన్ను, నీటి బిల్లులు చెల్లించడంతోపాటు పీజీఆర్ఎస్ అనుసంధానంతో సమస్యలను మొబైల్‌లోనే నమోదు చేసి వాటి పరిష్కార స్థితిని సులభంగా ట్రాక్ చేయవచ్చన్నారు. అంతేకాకుండా ఏఐ చాట్‌బాట్ సాయంతో ప్రజల సందేహాలను 24 గంటలూ పరిష్కరిస్తున్నామని, గాలి నాణ్యతను ఎప్పటికప్పుడు తెలుసుకునే సదుపాయం, ఆసుపత్రులు, అత్యవసర సేవలను ఒకే క్లిక్‌తో తెలుసుకునేలా యాప్‌ను పౌర కేంద్రంగా ఎలా తీర్చిదిద్దారో కలెక్టర్ వివరించారు. నగర ప్రజలకు పౌరసేవలు, ఫిర్యాదుల నమోదు, పన్నుల చెల్లింపులువంటి వాటన్నింటినీ ఒకే వేదికపై ఎలాంటి ఆటంకాలు లేకుండా అందించే 'సింగిల్ టచ్ పాయింట్'గా ఈ ఏకీకృత మొబైల్ యాప్‌ను ఎలా తీర్చిదిద్దామో ప్రదర్శించారు. పౌరులకు సౌలభ్యం, పారదర్శకత, మెరుగైన పనితీరు అనే మూడు మూలస్తంభాల ఆధారంగా ఈ అద్భుతమైన డిజిటల్ వ్యవస్థను నిర్మించినట్టు కలెక్టర్ సదస్సుకు తెలిపారు.

కేవలం బిల్లులు కట్టడానికే కాకుండా, రియల్ టైమ్‌లో నగరంలోని గాలి నాణ్యత వివరాలను, ఇతర ముఖ్యమైన పౌర సమాచారాన్ని ప్రజలు తమ మొబైల్‌లోనే సులభంగా చూసుకునేలా దీన్ని రూపొందించామన్నారు. అలాగే, అత్యవసర సమయాల్లో ఉపయోగపడే కీలకమైన ఆసుపత్రులు, అధికారుల కాంటాక్ట్ నంబర్లను సులభంగా యాక్సెస్ చేసుకునేలా ఇందులో పొందుపరిచామని, ఎప్పటికప్పుడు నగరవాసులను సమాచారంతో అప్రమత్తం చేసేందుకు వీలుగా 'పుష్ నోటిఫికేషన్స్ మరియు అలర్ట్స్' సదుపాయాన్ని కూడా ఈ యాప్‌లో ఎలా అనుసంధానం చేశామో కలెక్టర్ తమ ప్రజెంటేషన్‌లో తెలిపారు.

### విజయనగరం జిల్లా:

## మిషన్ హోర్టి-విజ్-ఇయాన్

వ్యవసాయరంగంలో రైతుల ఆదాయం పెంచాలనే లక్ష్యంతో చేపట్టిన 'మిషన్ హోప్' గురించి విజయనగరం కలెక్టర్ రామ సుందర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. కేవలం వరి, మొక్కజొన్న పండించి నష్టపోతున్న సన్న, చిన్నకారు రైతులను అధిక లాభాలిచ్చే ఉద్యానవన పంటలవైపు మళ్లించేందుకు ఏకంగా 10 వేల ఎకరాల లక్ష్యంతో ప్రాజెక్టును ఎలా మొదలుపెట్టామో ఆయన వివరించారు. దీనికోసం విద్యుత్ లైన్ల పరిధిలో 180 మీటర్ల లోపున్న పొలాలను మ్యాపింగ్ చేసి ఉచిత కనెక్షన్లు ఇస్తున్నామని, డీఆర్‌డీఏ ద్వారా బోరు బావులకు రుణాలు మంజూరు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్‌లాంటి దీర్ఘకాలిక పంటలు వేసే రైతులకు ఆదాయం ఆగిపోకుండా అరటి, పత్తివంటి అంతరపంటలు వేయించి నిరంతర ఆదాయం వచ్చేలా చేస్తున్నామని వివరించారు. రిలయన్స్ ఫ్రెష్, బిగ్‌బాస్కెట్‌వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని మార్కెటింగ్ కష్టాలు లేకుండా చేయడంతో మొదటి దశలోనే లక్ష్యానికి మించి 4,822 ఎకరాల్లో ఈ మిషన్ ఎలా విజయవంతమైందో తన ప్రజెంటేషన్ లో తెలిపారు. ఈ ఏడు జిల్లాల కలెక్టర్లు ప్రదర్శించిన వినూత్న ప్రాజెక్టులు కేవలం ఆయా ప్రాంతాలకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుల జీవితాల్లో పెను మార్పులు తీసుకురావడానికి మార్గదర్శకంగా నిలుస్తాయని సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులు ప్రశంసించారు.

# 'మనమిత్ర'కు..
# ప్రజాకాంక్షే ప్రేరణ!

- యువగళం పాదయాత్రలోనే వాట్సాప్ గవర్నెన్స్ ఆలోచన
- రియల్ టైం గవర్నెన్స్ విభాగ సాయంతో సులువుగా అమలు
- అరచేతికి పౌరసేవలను అందించడమే ప్రాజెక్టు ధ్యేయం
- లోపాలను సరిదిద్దడానికి ఇంటారాక్టివ్ విధానం అమలు
- మెటా నిర్వహించిన సమావేశంలో మంత్రి నారా లోకేష్




న్యూఢిల్లీ (చైతన్య రథం): యువగళం పాదయాత్ర సమయంలో రాష్ట్ర ప్రజలు వ్యక్తంచేసిన ఆకాంక్షే 'మనమిత్ర' వాట్సాప్ సేవలకు ప్రేరణగా రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ అభివర్ణించారు. మెటా ఆధ్వర్యాన వాట్సాప్ సిటిజన్ ఎంగేజ్మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫోరమ్ ఆధ్వర్యాన న్యూఢిల్లీలో జరిగిన సమావేశానికి మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కార్యక్రమానికి మెటా భారత వైస్ ప్రెసిడెంట్, సౌత్ ఈస్ట్ ఆసియా హెడ్ సంధ్యా దేవనాథన్ సంధానకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... పౌరసమాజ విశ్వాసానికి కేంద్రంగా 'మనమిత్ర' సేవలు ఉండాలన్న లక్ష్యం.. అధికార యంత్రాంగం ఆలోచనా విధానాన్ని మార్చిందన్నారు. ఫైర్ సైడ్ చాట్‌లో సంధ్యా దేవనాథన్ అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానమిచ్చారు.

**సంధ్యా దేవనాథన్:** ***బహుశా మీకు పౌర సేవల లభ్యత గురించి తెలిసి ఉండొచ్చు. అసలు ఈ ఆలోచన మీకు మొదట ఎలా వచ్చిందో చెప్పగలరా? ఎందుకంటే ఇది చాలా పరివర్తనాత్మకమైనది. మేము కొన్ని పైలట్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నాం. వాటితో పోలిస్తే ఇది విభిన్నం?***

**నారా లోకేష్:** యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న సమయంలో నాకు వాట్సాప్ గవర్నెన్స్ ఆలోచన వచ్చింది. ఒక బటన్ నొక్కితే కిరాణా సరుకులు వస్తున్నాయి. టాక్సీ వస్తోంది. సినిమా చూడగలుగుతున్నాం. మరి పౌరసేవలను అందించడంలో ప్రభుత్వం ఎందుకు చురుకుగా వ్యవహరించడం లేదు? అని పాదయాత్ర సమయంలో ప్రజలు నన్ను అడిగారు. పౌరసేవలను సులభతరం చేసి 'ఈజ్ ఆఫ్ లివింగ్' కల్పిస్తామని అప్పట్లో వాగ్దానం చేశాను. పౌర సేవలన్నింటినీ ఒకే ప్లాట్‌ఫారమ్, ఒకే ఫోన్ నంబర్‌పైకి తీసుకువస్తామని ఎన్నికల సమయంలోనూ చెప్పాను. భారతదేశంలో ప్రతి ఒక్కరూ వాట్సాప్‌పై ఆసక్తిగా ఉన్నారని నేను గ్రహించాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మేం మెటా సంస్థను సంప్రదించాం. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షే "మనమిత్ర" ప్లాట్‌ఫాంకు ప్రేరణ.

**సంధ్యాదేవనాథన్:** ***ఈ ప్రాజెక్ట్‌ను ఏపీలో మేం 60 రోజుల్లో పూర్తి చేయడానికి అంగీకరించాము. కానీ ప్రారంభించడానికి 90 రోజులు పట్టింది. ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. గత ఏడాది ఫిబ్రవరిలో 160 సేవలతో ప్రారంభించాము. ఇప్పుడు వివిధ విభాగాలలో దాదాపు 900 పౌర సేవలు అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయ సేవా విధానం నుంచి డిజిటల్ విధానానికి మారడానికి ఎలాంటి ఆలోచనా విధాన మార్పులు అవసరమయ్యాయి?***

**నారా లోకేష్:** ఇక్కడ అతిపెద్ద సవాలు అంతర్గత రాజకీయాలు. ప్రతి శాఖ వారి అనుభవాన్ని తమ నియంత్రణలోనే ఉంచుకోవాలని కోరుకుంటుంది. ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టే విషయం ఏమిటంటే, మాకు 'రియల్-టైమ్ గవర్నెన్స్' అనే వ్యవస్థ ఉంది. వాస్తవానికి ఇది ఒక మంత్రిత్వ శాఖ. అందరినీ కూర్చోబెట్టి చర్చించి, వారి ఏపీఐలను (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేజ్)లను తెరిచేలా చేయడమే అతిపెద్ద సవాలు. సాంకేతికత అనేది కేవలం సాధనం మాత్రమే. కానీ నిజమైన మార్పు సాంస్కృతికంగా జరగాలి. మంత్రులు, కార్యదర్శులతో నేను దీనిగురించి చాలా ఓపెన్‌గా చర్చలు జరపాల్సి వచ్చింది. ఇది ముఖ్యమంత్రి ఆదేశమని స్పష్టం చేశాను. మేము ఎక్కువ ట్రాఫిక్ ఉన్న (ఎక్కువగా ఉపయోగించే) సేవలతో ప్రారంభించి, తర్వాత తక్కువగా ఉపయోగించే సేవలవైపు వెళ్లాము. ప్రతి క్యాబినెట్ సమావేశంలో మా చర్చల్లో ఇది భాగంగా ఉండేది. అక్కడ ముఖ్యమంత్రి "ముందుగా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకురండి" అని చెప్పేవారు. మేము మెనూ- ఆధారిత విధానం నుండి సంభాషణాత్మక ఏఐని ఉపయోగించి మరింత ఏఐ-ఆధారిత విధానానికి వెళ్లాలనుకుంటున్నాము. దీనికి రాజకీయ సంకల్పం చాలా ముఖ్యం. నేను నా బృందానికి పౌర సమాజ విశ్వానికి కేంద్రంగా ఈ సేవలు అందుబాటులో ఉంచుదామని చెప్పాను. అది మా మొత్తం ఆలోచనా విధానాన్నే మార్చేసింది.

**సంధ్యాదేవనాథన్:** ***మీకు ఎలాంటి ఫీడ్‌బ్యాక్ వచ్చింది? పౌరుల జీవితంలో గణనీయమైన మార్పులు వచ్చిన ఉదాహరణలు ఏమైనా ఉన్నాయా?***

**నారా లోకేష్:** గతంలో హాల్ టిక్కెట్లు పొందడం చాలా ఇబ్బందిగా ఉండేది. మేం మొదటిరోజు నుండే వాటిని వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకురావడం వల్ల పిల్లలు వాటిని సులభంగా పొందే వీలు కలిగింది. ఇప్పుడు హాల్‌టిక్కెట్ల కోసం వారు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. దీనివల్ల సమయం, శ్రమ ఆదా అయ్యాయి. విద్యుత్, ఇతర బిల్లులు చెల్లించడం కూడా ఒక గొప్ప మార్పు. మేము ఫీడ్‌బ్యాక్ సేకరించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేశాము. దాని ఆధారంగా వివిధ విభాగాలకు ర్యాంకులు ఇస్తాము. ముఖ్యమంత్రి దీనిని వారం వారం సమీక్షిస్తుంటారు. మంత్రులు, కార్యదర్శులకు ఫీడ్‌బ్యాక్ ఇస్తారు. 1నుంచి 10 స్కేల్‌లో పౌరులు మాకు 8.5 లేదా 9 రేటింగ్ ఇస్తున్నారు. కానీ నేను మాత్రం 3 మాత్రమే ఇస్తాను. మేము ఏఐ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాల్సి ఉంది.

**సంధ్యా దేవనాథన్:** ***రాష్ట్ర బడ్జెట్‌లో వాట్సాప్ గవర్నెన్స్‌ను అధికారికంగా చేర్చిన మొదటి రాష్ట్రం మీదే. ఏఐ పర్సనల్ అసిస్టెంట్లు లేదా ప్రిడిక్టివ్ అలర్ట్స్‌వంటి అధునాతన ఫీచర్లను ఏకీకృతం చేయడంలో మీ విజన్ ఏమిటి?***

**నారా లోకేష్:** భారతదేశం ఏఐని స్వీకరించడం ప్రస్తుతం అత్యవసరం. మా డేటా లేక్ ప్రాజెక్ట్.. పౌరుడిని కేంద్రంగా చేసుకొని డేటా పటిష్టంగా ఏకీకృతమయ్యేలా చేస్తుంది. ఉదాహరణకు మేము ఒకసారి జనన ధృవీకరణ పత్రాన్ని జారీ చేసిన తర్వాత, ప్రాథమిక రూల్ ఇంజిన్‌లను ఉపయోగించి అనేక ఇతర విషయాలను స్వయంచాలకంగా ఏకీకృతం చేయవచ్చు. వెర్షన్ 1 అని పిలిచే మెనూభాగాన్ని మేము పూర్తి చేసాము. ఇప్పుడు మేము రాబోయే 90 రోజుల్లో వెర్షన్ 2.0 పూర్తిచేయాలి. విద్యుత్ బిల్లులు, ఆస్తిపన్నులవంటి ఆర్థిక లావాదేవీలపట్ల మేము ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాల్సిన అవసరం ఉంది.

**సంధ్యా దేవనాథన్:** ***వాట్సాప్ సేవలను ఉపయోగిస్తున్న కుటుంబాలు సుమారు 30శాతం వరకూ ఉన్నాయి. గ్రామీణ కుటుంబాలు, రైతులకు ఇది ఎలా పని చేస్తోంది?***

**నారా లోకేష్:** గ్రామీణ వినియోగదారులు కూడా ఇప్పుడు వాట్సాప్ సేవలకు అలవాటుపడుతున్నారు. రైతులు ఏయే ప్రభుత్వ సేవలకు అర్హులో అర్థం చేసుకోవడానికి ఇది చాలా కీలకమైనది. పథకాల పంపిణీ సమయంలో, వారు సంతృప్తి చెందారో లేదోనని అడగడానికి దీనిద్వారా మేము వారిని స్వయంగా సంప్రదించవచ్చు. వారికి ఏదైనా లబ్ధి చేకూరకపోతే, ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే తమ మొబైల్ ఫోన్‌నుండే వారు ఫిర్యాదు చేయవచ్చు. ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఎన్ని పరిష్కారమయ్యాయి? అని చూసేందుకు మాకు ఇది తోడ్పడింది. మేము దీన్ని ఆన్‌లైన్‌లోనే చేయాలని పట్టుబట్టాము. ఎందుకంటే అక్కడ తగినంత భద్రత, రక్షణ ఉంటుంది.

**సంధ్యా దేవనాథన్:** ***వాట్సాప్ గవర్నెన్స్‌లో ఏ సేవలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు? మీరు గమనించిన మెరుగుదల ఏమిటి?***

**నారా లోకేష్:** యుటిలిటీ చెల్లింపులు, హాల్ టిక్కెట్లు, పరీక్షా ఫలితాలు విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. మా పౌరసేవల సంతృప్తి స్కోర్‌లు మెరుగుపడుతున్నాయి. మాకు తక్కువ రేటింగ్ వచ్చినప్పుడు లోపాలను సరిదిద్దడానికి మేము ఇంటరాక్టివ్ విధానాన్ని ఉపయోగిస్తున్నాము. అయితే, ఇందులో పటిష్టమైన డేటా లేక్ చాలా కీలకం. డేటా సెట్‌లు వేర్వేరుగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్ట్ మొదటి 150 సేవలకుమించి విస్తరించలేదు. ప్రతి ప్రక్రియను ప్రశ్నించే అవకాశాన్ని కూడా ఇది అందిస్తుంది. మేము ప్రాసెస్ రీ-ఇంజనీరింగ్ చేస్తున్నాము. వ్యవస్థను ప్రతిస్పందించే విధంగా కాకుండా చురుకుగా ఉంచడానికి ఏ దశలను తొలగించవచ్చని ప్రశ్నిస్తున్నాము. ఉదాహరణకు కుల ధృవీకరణ పత్రంకోసం, మీరు మళ్లీమళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండకూడదు. ఇది ఒకసారి వివరాలు ఇస్తే తర్వాత దానంతట అదే అందించే ఒక ఫ్రేమ్‌వర్క్ ఉండాలి. బ్లాక్‌చెయిన్ ద్వారా ట్రాక్-అండ్-ట్రేస్‌తో ఒక క్యూఆర్ కోడ్‌పై ఉంచాలి. ఒక పౌరుడి దైనందిన జీవితంలో సాధారణ పౌరసేవల కోసం రాజకీయ నాయకులు, అధికారులవద్దకు వెళ్లకుండా చేస్తామో.. ఆ రోజు మనం విజయం సాధించినట్టని నేను నా ఐటీ సెక్రటరీకి చెబుతుంటాను.

**సంధ్యా దేవనాథన్:** ***ఇతర రాష్ట్రాలకు మీరు ఎటువంటి సలహాలిస్తారు?***

**నారా లోకేష్:** ఒకటి, బలమైన డేటా లేక్. రెండవది ఇది వ్యూహాత్మకంగా దీనిని కీలకమైన ప్రాజెక్ట్ అని విశ్వసించే రాజకీయ సంకల్పం. ఇది మేం ప్రజలకు ఇచ్చిన ఒక ఎన్నికల హామీ. దానిని విజయవంతం చేసేందుకు ఎంతో శ్రద్ధ వహించాం. విభాగాల్లో అలసత్వం రాకుండా చూసేందుకు, ఇది ఎల్లప్పుడూ అత్యున్నత ప్రాధాన్యతగా ఉండేలా మీరు చూసుకోవాలి. ఒక ఏడాది తరువాత, మనం పరిపూర్ణతకు దగ్గరగా ఉండే ఒక నమూనాను కలిగి ఉంటామని నేను నమ్ముతున్నాను.






చైతన్యరథం

# రాష్ట్రానికి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్

- ప్రపంచంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్‌కు నేడు శంకుస్థాపన
- సిస్టమ్స్ సెంటర్‌నూ అభివృద్ధి చేయనున్న సాగర్ డిఫెన్స్ పరిశ్రమ
- జువ్వలదిన్నెలో ప్రాజెక్టుకు నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేష్
- మొదటి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి.. 750మందికిపైగా ఉపాధి



అమరావతి (చైతన్యరథం): భారతదేశ స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడంతోపాటు.. దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో కీలకమైన ముందడుగు పడింది. నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వెలదిన్నె ఫిషింగ్ హార్బర్‌వద్ద ప్రపంచంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటుకు నేడు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. భారతదేశ సముద్ర, రక్షణతయారీ పర్యావరణ వ్యవస్థలో ఈ ప్రాజెక్ట్ మైలురాయిగా నిలవనుంది. అధునాతన సముద్ర సాంకేతికతను ప్రోత్సహించడంతోపాటు మత్స్యరంగాన్ని బలోపేతం చేయనున్నారు. స్వయం ప్రతిపత్తిగల మారిటైం షిప్ యార్డ్‌గా దీనిని అభివృద్ధి చేయనున్నారు. ఏపీ తీరప్రాంతంలో ఇండస్ట్రియల్ అండ్ స్కిల్స్ ఎకోసిస్టమ్‌ను ఈ ప్రాజెక్ట్ బలోపేతం చేయనుంది. మెరుగైన తీరప్రాంత నిఘాతోపాటు తీర ప్రాంత భద్రత, రక్షణ సంసిద్ధతకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దనున్నారు. దేశీయంగా రక్షణరంగ సాంకేతికత అభివృద్ధికి ఈ కేంద్రం మద్దతుగా నిలవనుంది.

### మొదటి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి, 750 మందికిపైగా ఉద్యోగాల కల్పన


అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటుకు సాగర్ ఢిపెన్స్ సంస్థ మొదటి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 750 మందికిపైగా ఉద్యోగాలు కల్పించనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద మొదటి దశకింద 29.58 ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఇందులో 7.58 ఎకరాల వాటర్ ఫ్రండ్ ల్యాండ్ కూడా ఉంది. 2026 నవంబర్ నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ కేంద్రం ద్వారా షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో యువతకు 750కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. ముంబయి కేంద్రంగా పనిచేసే సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అన్‌మాన్డ్ మెరైన్ సర్ఫేస్ వెహికిల్స్ రంగంలో పేరుగాంచింది. ఈ సంస్థ భారత నౌకాదళం, ఐడెక్స్, ఇతర భద్రతా సంస్థలతో కలిసి పనిచేస్తోంది. అటానమస్ మారిటైం షిప్ యార్డ్ అత్యాధునిక పారిశ్రామిక సదుపాయం. ఇది మానవరహిత, స్వయంప్రతిపత్తి కలిగిన ఉపరితల, నీటి అడుగున నౌకల నిర్మాణం, ఏకీకరణ పరీక్ష, అలాగే వాటి లైఫ్ సైకిల్ సపోర్ట్ కోసం రూపొందుతుంది. ఇందులో ఇంటిలిజెంట్ మారిటైం సిస్టమ్స్, సెన్సార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ టెక్నాలజీలను అభివృద్ధి చేస్తారు. ఆధునిక నౌకాదళ కార్యకలాపాలకు షిప్ యార్డ్ కీలకం కానుంది. ఈ ప్రాజెక్ట్ బ్లూ ఎకానమీ, మారిటైం ఇన్నోవేషన్‌ను బలోపేతం చేయడంతోపాటు ఏపీని మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా నిలపనుంది.

### లోకేష్ నెల్లూరు పర్యటన వివరాలు:

కావలి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న ప్రపంచంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ సెంటర్ శంకుస్థాపనకు మంత్రి లోకేష్ హాజరవుతారు. తొలుత మధ్యాహ్నం 12.30కు తిరుపతి ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి రోడ్డు మార్గం ద్వారా 3.45కు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నెకు చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు సాగర్ డిఫెన్స్ పరిశ్రమ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు.

# ఢిల్లీలో కూటమి ఎంపీల ఆత్మీయ కలయిక

- సందడి చేసిన మంత్రి నారా లోకేష్
- కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు ఇంట్లో విందు





ఢిల్లీ (చైతన్యరథం): ఢిల్లీ పర్యటనలో ఉన్న విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ కూటమి ఎంపీల ఆత్మీయ సమావేశంలో సందడి చేశారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు తన నివాసంలో బుధవారం మధ్యాహ్నం ఇచ్చిన విందుకు కూటమి ఎంపీలు, మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. రామ్మోహననాయుడు మాతృమూర్తి లోకేష్‌ను ఆశీర్వదించారు. రామన్న పిల్లలను ఎత్తుకున్న లోకేష్.. వారితో సరదాగా ముచ్చటించారు. పెద్దమ్మ పురంధ్రీశ్వరి ఆశీస్సులు తీసు కున్నారు. ఎంపీలందరినీ పేరుపేరునా పలకరిస్తూ మంత్రి లోకేష్ ఉత్సాహంగా కొద్ది సమయం గడిపారు.









చైతన్యరథం

# కేంద్ర మాజీమంత్రి కావూరి మృతిపట్ల

### ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం

అమరావతి (చైతన్య రథం): సీనియర్ రాజకీయ నేత, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మృతి అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "మచిలీపట్నం, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాలనుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసిన కావూరి సాంబశివరావు మరణం తీరనిలోటు. రాజకీయ, వ్యాపారరంగంలో కావూరిది ప్రత్యేక ముద్ర. ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. సాంబశివరావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు.

## కావూరి సేవలు చిరస్మరణీయం

### మృతిపట్ల మంత్రి లోకేష్ ప్రగాఢ సంతాపం

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ప్రగతికి ఎనలేని కృషి చేసిన కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మృతి తీరని లోటని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "కేంద్ర మాజీమంత్రి, రాజకీయ కురువృద్ధుడు, బంధువు కావూరి సాంబశివరావు మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్ర మంత్రిగా పనిచేసి రాష్ట్ర ప్రగతికి ఎనలేని కృషి చేశారు. తన నియోజకవర్గ అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారు. కావూరి సేవలు చిరస్మరణీయం. వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు.

## స్వర్ణాంధ్ర లక్ష్యంగా

# చిత్తశుద్ధితో పనిచేద్దాం

### కలెక్టర్లకు సీఎస్ సాయిప్రసాద్ పిలుపు - సీఎం అధ్యక్షతన 6వ జిల్లా కలెక్టర్ల సదస్స



అమరావతి (చైతన్య రథం): ప్రభుత్వ విధానాలు, ప్రణాళికలను చిత్తశుద్ధితో అమలుచేసి.. స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంగా కలెక్టర్లు ముందుకు సాగాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అధ్యక్షతన రెండు రోజులపాటు నిర్వహించే 6వ కలెక్టర్ల సదస్సు బుధవారం ఉదయం.. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఆరంభమైంది. సమావేశానికి సిసిఎల్‌ఏ జయలక్ష్మి స్వాగతం పలికారు. సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్ ముందుగా మాట్లాడుతూ -ప్రభుత్వ విధానాలను మరింత మెరుగైన రీతిలో అమలు చేసేందుకు, అధికారుల పనితీరును మదింపు చేసేందుకు సమావేశం దోహద పడుతుందని పేర్కొన్నారు. 2047నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా రూ. 55 లక్షల రూ.తలసరి ఆదాయం సాధించే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని అందుకు అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్వర్ణాంధ్ర పది సూత్రాలు సాధనకు సమిష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ సేవలకై ఏ పౌరుడు స్వర్ణ గ్రామ వార్డులకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఉండేలా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పలు సేవలను అందుబాటులోకి తేవడం జరిగిందని చెప్పారు. ఈ విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. నేడు దేశంలో పీపీపీ విధానం వైపు కూడా అడుగులు పడుతున్నాయని, ప్రభుత్వంతోపాటు ప్రైవేటురంగంలో పథకాలు, కార్యక్రమాల అమలుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని సిఎస్ సాయిప్రసాద్ కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్రమంతటా 'జలధార'!

- అన్నమయ్య జిల్లాల్లో పుట్టిన ఆదర్శ జలసిరి
- కరవు నేలపై జలసిరులు కురిపించిన కలెక్టర్
- జిల్లాలో అంతర్గత కాల్వల అనుసంధానం
- వట్టిపోయిన చెరువులకు జలకళలు
- 5 నెలల్లో 8.59 మీటర్ల భూగర్భజల మట్టం పెరుగుదల
- కలెక్టర్ల సదస్సులో అన్నమయ్య భగీరథ యత్నం ఆదర్శం
- పులకించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్రమంతటా జలధార అమలుకు ఆదేశం
- కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు ప్రశంసల జల్లు



అమరావతి (చైతన్య రథం): అన్నమయ్య జిల్లా.. సీమ కరువు జిల్లాలో అత్యంత కరువు ప్రభావిత జిల్లాల్లో ఒక్కటి. వార్షిక వర్షపాతం 743 సెంటీమీటర్లే. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. అలాంటి కరవు నేలపై ఆ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు ప్రధానంగా పలుకరించిన సమస్య నీటి సమస్య. ఈ సమస్యకు ఎలాగైనా చరమగీతం పాడాలని కలెక్టర్ వినూత్నంగా ఆలోచించారు. ఇది కరవు ప్రాంతమే అయినప్పటికీ ఉన్న నీటి వనరులు ఎందుకు పనికిరాకుండాపోయాయి అని ఆలోచించారు. జిల్లాలోని చెరువులు, కుంటులకు నీటి ప్రవాహాన్ని తీసుకొచ్చే కాల్వలు కొన్నిచోట్ల పూడిపోవడం, కొన్నిచోట్ల పాడైపోవడంలాంటివి ఉన్నాయి. అంతేకాదు ఏ కాల్వకు ఆ కాల్వ విడిగా ఉండిపోయాయి. చెరువుకు చెరువుకు మధ్య కాలువలకు కాలువలకు మధ్య అనుసధానం లేకపోవడంతో వర్షం పడినా నీరు వృథాగా నేలపాలై, జిల్లాలో కరవు పరిస్థితులు నెలకొంటున్న విషయాన్ని గమనించారు. జిల్లాలోని అన్ని నీటి ప్రవాహ కాల్వలను అంతర్గతంగా అనుసంధాన కార్యక్రమానికి నడుంబిగించారు. యంత్రాంగాన్ని సమైఖ్యంగా ముందకు నడిపించారు. గ్రామాల్లో ప్రజలను కలిసి వారి భాగస్వామ్యం, వారికున్న స్థానిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, అధికారులు, ప్రజలు మమేకమై యుద్ధప్రాతిపదికన కాలువల అనుసంధానం చేపట్టారు. ఆయా ఊర్లో అక్కడి చెరువు ఎందుకు ఎండిపోయింది? గతంలో ఆ చెరువుకు ఎక్కడినుంచి నీళ్లు వచ్చేవి? ఇప్పుడు ఎందుకు రాలేదు? అనేది స్థానికుల నుంచే సమాచారం తెలుసుకున్నారు. స్థానికులు, అధికారుల సహకారంతో ఆ చెరువుకు గతంలోలాగా నీటి ప్రవాహం వచ్చి చేరేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి మండలానికీ ఒక అధికారిని బాధ్యులుగా నియమించి.. ఆ మండలంలో నీటి వనరుల సద్వినియోగం చేసుకునే బాధ్యతలను ఆ అధికారికి కట్టబెట్టారు. ప్రతి కుంటకు నీరువచ్చి చేరేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. ఫలితంగా చెరువులు, కుంటల్లో సమృద్ధిగా నీరుండేలా సాధించడంలో జిల్లా యంత్రాంగం విజయం సాధించింది. ఈ భగీరథ ప్రయత్నానికి జలధార అని పేరుపెట్టి యంత్రాంగం ముందుకు వెళ్లింది. అధికారులు, ప్రజలు అందరూ భాగస్వామ్యమై, శాఖలమధ్య అనుసంధానం సమన్వయంతో విజయవంతంగా చేపట్టారు. ప్రస్తుతం జిల్లాలో నీరులేని చెరువుకుంటలు లేని స్థితి సాధించారు. జిల్లా యంత్రాంగం చేసిన ప్రయత్నాలకు మొంథా తుపాను కూడా కలిసొచ్చింది. వీరు ముందుగానే ఈ పనులు చేసుకోవడంతో మొంథా తపానుతో వర్షపు నీరుతో కుంటలన్నీ నిండిపోయాయి.

### అట్టడుగునుంచి అగ్రస్థానానికి

నీటి నిర్వహణలో అట్టడుగున 25వ స్థానంలో ఉన్న అన్నమయ్య జిల్లా ఇప్పుడు జలధార కార్యక్రమంలో అగ్రస్థానాల్లోకి ఎగబాకింది. జలధార కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిరుపయోగంగా మారిన జల వనరులు, కాలువలు, కుంటలను బాగు చేయడంతో నీటి లభ్యత పెరిగింది. ఫలితంగా జిల్లాలో భూగర్భజల మట్టాలు కూడా గణనీయంగా పెరిగాయి. 2025 ఆగస్టులో 14.45 మీటర్ల మట్టంలో ఉన్న భూగర్భ జలాలు అదే ఏడాది డిసెంబరు నెలకు 5.86 మీటర్ల మట్టానికి చేరుకున్నాయి. భూగర్భ జలాల మట్టం పెరగడంతో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. పచ్చదనం పెరిగింది. ఫలితంగా జిల్లా స్థూల విలువ జోడింపు (జీవీఏ) కూడా పెరిగింది.

### రాష్ట్రమంతటా జలధార: సీఎం

అన్నమయ్య జిల్లా చేపట్టిన జలధార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో జలధార విజయగాథను జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా అధికారుల కృషి చూసి ముఖ్యమంత్రి పులకించిపోయారు. మంచి ప్రయత్నం చేశారు. ఎక్స్‌లెంట్, ఇదొక క్లియర్ కేస్ స్టడీ. దీన్ని అందరూ అందిపుచ్చుకోవాలని కలెక్టర్లకు సూచించారు. అన్నమయ్య జిల్లా అత్యంత కరవు ప్రాంతాల్లో ఒకటని, అలాంటిచోట జిల్లా కలెక్టర్, అధికారులు వినూత్నంగా ఆలోచించి చేసిన చిన్న ప్రయత్నం పెద్ద ఫలితం ఇస్తోందని అభినందించారు. జలధారను అదే పేరుతో అడాప్ట్ చేసుకుంటున్నామని, రాష్ట్రమంతటా ఈ జలధార కార్యక్రమానికి అమలు చేస్తున్నట్టు సభలో ముఖ్యమంత్రి ప్రకటించారు. 90 రోజులపాటు లేదా రాబోయే వర్షాకాలం వరకు అన్ని జిల్లాల్లో జలధార కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. తద్వారా నీటిని సమర్థంగా నిర్వహించుకోగలుగుతామన్నారు. తాను పట్టిసీమ ప్రాజెక్టుద్వారా 100 టీఎంసీ నీరు కృష్ణా డెల్టా ప్రాంతాలకు తీసుకొచ్చానని, తద్వారా శ్రీశైలంనుంచి నీరు రాయలసీమకు మళ్లించడం వీలైందని, దాంతో రాయలసీమంలో రూపురేఖలే మారిపోతున్నాయని చెప్పారు. ఇదే తరహాలో అన్నయ్య జిల్లాలో స్థానికంగా ఉన్న కాల్వల అనుసంధానం విజయవంతంగా, తక్కువ ఖర్చుతో చేయడం అభినందనీయమన్నారు.

# "వన్ మంత్.. వన్ విలేజ్.. ఫోర్ విజిట్స్"

- భూసమస్యల పరిష్కారానికి వినూత్న విధానం
- నెల్లూరు మోడల్‌కు సీఎం చంద్రబాబు ప్రశంసలు
- కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ప్రత్యేక అభినందనలు

అమరావతి (చైతన్య రథం): నెల్లూరు జిల్లాలో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా "వన్ మంత్.. వన్ విలేజ్.. ఫోర్ విజిట్స్" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడంపట్ల జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల రూపొందించిన వినూత్న విధానాన్ని సదస్సులో ప్రజెంటేషన్ ఇస్తూ.. గ్రామస్థాయిలోనే భూవివాదాలను గుర్తించి, దశలవారీగా పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. ఈ విధానంలో భాగంగా ఒక గ్రామాన్ని ఎంపికచేసి ఒక నెలలో నాలుగు విడతలుగా అధికారులు గ్రామానికివెళ్లి ప్రజల భూసమస్యలను పరిశీలించి పరిష్కారం చూపడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. భూ రికార్డులు, మ్యూటేషన్లు, సాదాబైనామా, డీకేటీ పట్టాలు, హౌస్ సైట్స్‌వంటి అంశాలపై వస్తున్న ఫిర్యాదులను సమగ్రంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోంది. ఇప్పటి వరకు భూ సమస్యల పరిష్కారంలో ప్రజలు పలుమార్లు కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి రావడం, సమస్యలు కోర్టులకు వెళ్లడంవంటి ఇబ్బందులను ఈ విధానం తగ్గిస్తుందని వివరించారు. గ్రామస్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కరించడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో జిల్లాలో మొత్తం 110 గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించగా, అందులో 26 గ్రామాల్లో భూసమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యాయి. మిగిలిన గ్రామాల్లోనూ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా భూవివాదాలు తగ్గడంతోపాటు ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతోందని కలెక్టర్ వివరించారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించే ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయదగిన మంచి మోడల్‌గా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా అమలు చేయవచ్చని సీఎం సూచించారు.



# తెలుగు వారికి కొండంత అండ

- గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారికి ముఖ్యమంత్రి ఆపన్నహస్తం
- బాధ్యతతో భద్రంగా స్వదేశానికి తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం): మాట ఇచ్చామంటే చేసి చూపిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో నడుస్తున్న కూటమి ప్రభుత్వం మరోసారి నిరూపించిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. హామీల అమలు విషయంలోనైనా, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడపడంలోనైనా మరెవరికి సాధ్యం కాని విధంగా ముఖ్యమంత్రి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అలుపెరుగని యోధుడిలా నిరంతరం శ్రమిస్తూ ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇస్తున్న నాయకుడు చంద్రబాబే అన్నారు.

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో బహ్రెయిన్ ప్రాంతంలో కూడా భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే సమయంలో అక్కడికి పర్యటనకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకుపోయారు. మొత్తం 63 మంది ఏపీ వాసులు ప్రాణభయంతో ప్రభుత్వాన్ని ఆశ్రయించగా, పరిస్థితి తీవ్రతను వెంటనే గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం చర్యలు ప్రారంభించాలని ఆదేశించినట్టు పల్లా తెలిపారు.

విమాన సర్వీసులు నిలిచిపోవడంతో అక్కడే చిక్కుకుపోయిన 59 మంది పర్యాటకులను సురక్షితంగా భారత్‌కు తీసుకురావడానికి ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టిందన్నారు. బహ్రెయిన్ నుంచి నేరుగా విమానాలు అందుబాటులో లేకపోవడంతో వారిని రోడ్డు మార్గంలో సౌదీ అరేబియాకు తరలించి, అక్కడి నుంచి భారత్‌కు తీసుకురావాలని ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. యుద్ధ వాతావరణంలోనూ వేగవంతమైన సమన్వయంతో ఈ కార్యాచరణ విజయవంతంగా అమలైందన్నారు.

ఈ చర్యల ఫలితంగా చిక్కుకుపోయిన పర్యాటకులు సురక్షితంగా సౌదీ చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక విమానాల ద్వారా భారత్‌కు తరలించబడ్డారని తెలిపారు. అనంతరం వారు స్వదేశానికి చేరుకుని తమ తమ ప్రాంతాలకు పయనమయ్యారన్నారు. ఇదే సమయంలో మరో 130 మంది బహ్రెయిన్ నుంచి రోడ్డు మార్గంలో సౌదీ చేరుకుని అక్కడి నుంచి ముంబయి విమానాశ్రయానికి వచ్చారని... వారిలో మహిళలు, చిన్నారులు అధికంగా ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. అమెరికా, యూరప్ నుంచి ప్రయాణిస్తూ ఖతార్, దుబాయ్‌ల్లో ట్రాన్సిట్‌లో చిక్కుకున్న పలువురు కూడా తిరిగి భారత్‌కు చేరుకునే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

### పరిస్థితులపై నిరంతర సమీక్ష

కొద్ది రోజులుగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ ఎన్ఆర్ఐ టీడీపీ సెల్ ద్వారా గల్ఫ్ దేశాల కో–ఆర్డినేటర్లతో ప్రతిరోజూ టెలికాన్ఫరెన్సులు నిర్వహిస్తున్నామన్నారు. విదేశాల్లో చిక్కుకుపోయిన తెలుగు ప్రజలకు సహాయం అందించేందుకు పార్టీ కేంద్ర కార్యాలయంలో 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని చెప్పారు. యుద్ధ వాతావరణంలో చిక్కుకున్న వారి కుటుంబ సభ్యులు కూడా ఈ హెల్ప్‌లైన్‌ను సంప్రదిస్తూ సహాయం కోరుతున్నారన్నారు.

అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ విదేశాల్లో చిక్కుకున్న ప్రజలకు అందుబాటులో ఉండి, సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకుంటూ వారి కుటుంబ సభ్యులకు నిరంతరం సమాచారం అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

### తెలుగు వారిపై బాధ్యతతో స్పందించిన ప్రభుత్వం

ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తెలుగు ప్రజలకు అండగా నిలబడే నాయకత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదేనని పల్లా అన్నారు. ఎలాంటి సంక్షోభ పరిస్థితుల్లోనైనా తమ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే నాయకత్వం ఆయనదేనని పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ కష్టకాలంలో కూడా అండగా నిలబడే పట్టుదలతో పనిచేస్తున్నారన్నారు. ఈ ఘటన కూటమి ప్రభుత్వ నిబద్ధతకు, ప్రజల పట్ల ఉన్న బాధ్యతకు నిదర్శనమని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రపంచంలో తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా వారికి కొండంత అండగా నిలబడే ప్రభుత్వం ఇదేనని, సంక్షోభ సమయంలో కూడా ప్రజల భద్రతే ముఖ్యమనే దృక్పథంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# గుడివాడలో బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

**- కొడాలి నాని అనుచరుడి అరెస్ట్**

విజయవాడ (చైతన్యరథం): గుడివాడలో భారీ బెట్టింగ్ రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. గుడివాడలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న కొడాలి నాని అనుచరులను అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా శిబిరాలపై మచిలీపట్నం క్రైమ్ బ్రాంచ్, గుడివాడ రూరల్ పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. గుడివాడ రూరల్ మండలం టిడ్కో కాలనీ ఫ్లాట్లలో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌పై ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను పట్టుకున్నారు. కొడాలి నాని అనుచరుడు మసాలా శివతో పాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మసాలా శివ, భానుప్రసాద్, కనక మహేష్, అజయ్ బాబు, వంశీ కిరణ్ ఉన్నారు. బెట్టింగ్ రాయుళ్ల వద్ద నుంచి రూ.1.05 లక్షల నగదు, 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకు న్నారు. మసాలా బండి నుంచి... బెట్టింగ్ ద్వారా శివ కోట్లాది రూపాయలు సంపాదించినట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో శివకు పోలీసులు రాచ మర్యాదలు చేసినట్లు ఆరోప ణలు ఉన్నాయి. శివ ఫోన్లలో పలువురు పోలీస్ అధికారులు, వైసీపీ నేతల వ్యక్తిగత నెంబర్లు ఉన్నట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో కొడాలి నానికి పెద్దఎత్తున నగదును శివ సమకూర్చినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వంలోనూ శివ బెట్టింగ్ దందా కొనసాగిస్తున్నాడని ఆరోప ణలు ఉన్నాయి. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రత్యేక దృష్టితో బెట్టింగ్ ముఠాలపై చర్యలు తీసుకుంటున్నారు. వైసీపీ హయాంలో మసాలా శివతో జట్టుకట్టి బెట్టింగ్ దందాలు నడిపినట్లు కొడాలి నాని రాజకీయ వ్యూహకర్త వినోద్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఇప్ప టికే వినోద్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. గుడివాడ రూరల్ పోలీసుస్టేషన్‌లో సీఐ కేసు వివరాలను వెల్లడించారు. బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించి వాట్సాప్ చాటింగ్, ఫోన్ స్క్రీన్‌షాట్లను గుర్తించామని తెలిపారు. బెట్టింగ్ నిర్వాహకుడు మసాలా శివ, అతనికి సహకరిస్తున్న భానుప్రసాద్, కనక మహేష్, అజయ్‌బా బు, వంశీ కిరణ్‌ను అరెస్ట్ చేశామన్నారు. మరో 17 మంది బుకీలు, బెట్టింగ్‌లో భాగస్వామ్యులైన 92 మందిని గుర్తించామ ని వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఫోన్లను ఫోరెన్సిక్ అనాలి సిస్ కోసం తరలించామని.. దీనిపై విచారణ కొనసాగుతోందని తెలిపారు.










అమరావతిలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సుదీర్ఘంగా సాగిన 6వ జిల్లా కలెక్టర్ల తొలిరోజు సమావేశం ముగిసింది. రెండో రోజు సదస్సులో భాగంగా సూపర్ సిక్స్, సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడులువంటి అంశాలపై చర్చ జరగనుంది. అలాగే, శాంతి భద్రతలపై జిల్లా ఎస్పీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించనున్నారు. తొలిరోజు సమావేశం ముగిసిన తరువాత విందుతో సేదతీరుతున్న జిల్లా కలెక్టర్లు

# రాష్ట్రాభివృద్ధిపై ఎందుకంత విద్వేషం?

**- జగన్‌ను సూటిగా ప్రశ్నించిన మంత్రి లోకేష్**



అమరావతి (చైతన్యరథం): అభివృద్ధి వ్యతిరేక రాజకీయాలకు జగన్ మరోసారి తెరలేపారని ఏపీ మంత్రి నారా లోకేశ్ ఘాటుగా విమర్శించారు. మొదట అమరావతిని వ్యతిరేకించారన్నారు. తర్వాత విద్యుత్ ఒప్పందాలను రద్దు చేశారని చెప్పారు. ఉద్యోగాలు సృష్టించే ఐటీ అభివృద్ధి కేంద్రాలపై పిటిషన్లు వేశారని మండిపడ్డారు. విశాఖ గూగుల్ ఏఐ హబ్‌పైనా కోర్టును ఆశ్రయించిందన్నారు. జగన్‌కు ఏపీ యువత, రాష్ట్రాభివృద్ధిపై విద్వేషం ఎందుకని ప్రశ్నించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. ఈమేరకు లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.



# రైతుల పేరుతో జగన్ అబద్ధాల రాజకీయం

- చేసిన మోసాన్ని అన్నదాతలు మరిచిపోలేదు
- గత పాలనలో పట్టించుకోకుండా ఇప్పుడు విమర్శలా?
- ఐదేళ్లూ గుర్తుకురాలేదా..కపట ప్రేమ నటిస్తున్నారు
- మీరు చేస్తున్న డ్రామాలు ఇక సాగవు
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజం



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో వ్యవసాయం, రైతుల సమస్యలపై ఎమ్మెల్యే వైఎస్ జగన్‌రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరితమైనవని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా మండిపడ్డారు. రైతుల పేరుతో అబద్ధా లు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించడం జగన్‌కు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో రైతు భరోసా పేరుతో పెద్ద పెద్ద మాటలు చెప్పిన జగన్, తన పాలనలోనే రైతులకు ఇవ్వాల్సిన అనేక చెల్లింపులను నిలిపివేసిన విషయం ప్రజలు మరిచిపోలేదు. ఇప్పుడు అదే విషయంపై నైతిక హక్కు ఉన్నట్లు మాట్లాడటం జగన్ రాజకీయ కపటత్వానికి నిదర్శనమన్నారు. రైతులకు న్యాయం చేయడంలో కూటమి ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందని చెప్పారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో రాష్ట్రం రూ.13,500 ఇస్తామని ప్రకటించినప్పటికీ రాష్ట్రం నుంచి కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చి, కేంద్రం ఇచ్చిన రూ.6, 000ను కలిపి మొత్తం రాష్ట్రం ఇచ్చినట్లుగా ప్రకటించారని విమ ర్శించారు. కూటమి ప్రభుత్వం సంవత్సరానికి రూ.20 వేలు మూడు విడతలుగా అందిస్తున్నామని తెలిపారు. పంట బీమా ప్రీమియం చెల్లింపుల విషయంలో జగన్ వాస్తవాలను పూర్తిగా వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ కాలంలో బీమా ప్రీమియంలు చెల్లించకపోవడంతో మూడు సీజన్లకు సంబంధిం చిన రూ.1,990.06 కోట్ల ఆర్థిక భారం ప్రస్తుత ప్రభుత్వంపై పడిందని వెల్లడించారు. ఇటీవల సంభవించిన తుఫాన్లకు సంబం ధించి ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటికే రూ.25 కోట్లు, రూ.34 కోట్లు, రూ.310 కోట్ల వరకు రైతులకు నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. ఇటీవల వచ్చిన మొందా తుఫాన్‌కు సంబంధించిన నష్టాల సర్వే పూర్తయిందని, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా నష్టపరిహా రం అందజేస్తుందని పేర్కొన్నారు.

**ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం**

2025-26 సంవత్సరానికి ప్రభుత్వం రూ.300 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే సుమారు రూ.588 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు మంత్రి వెల్లడించారు. 2019-24 మధ్య రూ.2,140 కోట్ల బడ్జెట్ కేటాయించి కేవలం రూ.1,475 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రూ.7,700 కోట్లు ఖర్చు చేసినట్లు తప్పుడు ప్రచారం చేశారని మంత్రి విమర్శించారు. మిర్చి, శనగ, మొక్కజొన్న, అరటి పంటల ధరల విషయంలో కూడా జగన్ రాజకీయ నాటకం ఆడు తున్నారని మండిపడ్డారు. రైతులకు కనీస మద్దతు ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, వాటిని ఉద్దేశపూర్వకంగా పట్టించుకోకుండా ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. రైతులకు మేలు చేశామని చెప్పుకునే జగన్ పాలనలోనే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నదని గుర్తు చేశారు. రైతుల పేరుతో అబద్ధాల ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టే రోజులు పోయాయి.. అసత్య ప్రచారాలకు రైతులు కూడా సమాధానం చెబుతారని స్పష్టం చేశారు. 2014 నుంచి 2019 మధ్యకాలంలో 6.58 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 5.92 లక్షల మంది రైతులకు బిందు, తుంపర్ సేద్యాన్ని రూ.2786 కోట్లతో అమలు చేయడం జరిగింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 2.94 లక్షల హెక్టార్ల విస్తీ ర్ణంలో రూ.1984 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేశారు. ఐదేళ్ల కాలంలో రెండేళ్లు 2020, 22 సంవత్సరాలలో ఈ పథకం అమలును పూర్తిగా నిలిపివేశారు. అంతేకాకుండా రూ.1166 కోట్లు బకాయిలను మిగిల్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటివరకు 2.33 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 2.10 లక్షల మంది రైతులకు, మైక్రో ఇరిగేషన్ పథకాన్ని రూ.1857 కోట్లు వెచ్చించి విస్తరించినట్టు చెప్పారు.

**గత ప్రభుత్వంలో ఆత్మహత్యలు..పరిహారం విడుదల**

వరి పంటకు ఇన్‌పుట్ సబ్సిడీని రూ.17 వేల నుంచి రూ.25 వేలకు కూటమి ప్రభుత్వం పెంచిందని చెప్పారు. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు సుమారు 2 లక్షల మంది రైతులకు రూ.310 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అందించామని వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో ఆత్మహత్యలు చేసుకున్న 81 మంది రైతుల కుటుంబాలకు చెల్లించకుండా మిగిలిపోయిన రూ.5.67 కోట్ల నష్టపరిహారాన్ని కూడా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అదేవిధంగా మరో 214 మంది రైతుల కుటుంబాలకు రూ. 14. 98 కోట్ల నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు కొనసాగుతు న్నాయని తెలిపారు. ఉద్యానవన పంటలు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు కూడా రూ.50 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అందించామని చెప్పారు. అదేవిధంగా గతంలో సాంకేతిక కారణా లతో మిగిలిపోయిన 1.21 లక్షల మంది రైతులకు రూ.147.34 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. అరకు ప్రాంతంలోని కాఫీ తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ వ్యాధి వల్ల నష్టపోయిన 81 మంది రైతులకు ఇన్ పుట్ సబ్సిడీగా రూ.7,23,825 ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు.

## స్త్రీ శక్తిపై జగన్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఖండన
- వైసీపీ హయాంలో ఒక్క బస్సు కొనలేదు
- టికెట్ చార్జీలను పెంచారని మండిపాటు



అమరావతి (చైతన్యరథం): స్త్రీ శక్తి పథకం అమలుపై పులివెందుల ఎమ్మెల్యే జగన్ చేసిన వ్యాఖ్యలను రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఖండించారు. రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందిన పొందిన సంక్షేమ పథకం స్త్రీ శక్తి. ప్రభుత్వం బాధ్యతతో ఈ పథకాన్ని అమలు చేస్తుంటే జగన్ కడుపు మండుతుంది. పథకం ద్వారా మహిళలకు ప్రతినెల రూ.2000 మేర లబ్ధి చేకూరుతోంది. ఇప్పటివరకు సుమారు 50 కోట్ల మంది ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. ఎక్కువ గా ప్రయాణం చేసే ఐదు రకాల బస్సులలో ఉచిత బస్సు ప్రయా ణం అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సేవలే విరివిగా అందు బాటులో ఉంటున్నాయని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఒక్క కొత్త బస్సు కూడా కొను గోలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సుమారు 1450 కొత్త బస్సులను కొనుగోలు చేసి ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలనలో బస్సు టికెట్ చార్జీలు మూడు సార్లు పెంచారని, వందల సంఖ్యలో బస్సు సర్వీసులను నిలిపివేశారని మంత్రి ఆరో పించారు. ఆ సమయంలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడంలో కూడా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ఆర్టీసీ ఎదుర్కొన్న అనేక సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరిస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మహిళల సాధికారత, ప్రజా రవాణా బలోపేతం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## రాష్ట్ర పండుగగా మొల్ల జయంతి

- ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణ
- విజయవాడలో రాష్ట్రస్థాయి జయంత్యోత్సవం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



అమరావతి(చైతన్యరథం): మొట్టమొదటి తెలుగు కవయిత్రి మొల్ల(మొల్లమాంబ) జయంతిని ఈ నెల 13న రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించనున్నట్లు బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని బుధవా రం ఒక ప్రకటనలో వెల్లడించారు. మొల్లమాంబ (మొల్ల) తెలుగుజాతి గర్వించదగ్గ రచయిత్రి..నన్నయ్య ఆదికవి అయితే ఆది కవయిత్రి మొల్ల అని కీర్తించారు. సంస్కృతంలోని వాల్మీకి రామాయణాన్ని తెలుగు భాషలోకి అనువదించారు. మొల్ల రచించిన ఆ రామా యణం మొల్ల రామాయణంగా ప్రఖ్యాతిగాం చిందని వివరించారు. మొల్ల స్వస్థలం కడప జిల్లా గోపవరం గ్రామవాసి అని తెలిపారు. 16వ శతాబ్దానికి చెందిన మొల్ల సామాన్యమైన కుమ్మరి కుటుంబంలో జన్మించారన్నారు. తెలుగు సాహిత్యానికి మొల్ల చేసిన సేవలు అభినందనీయమన్నారు. మొల్ల రాష్ట్రస్థాయి జయంతిని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోనూ మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వుల్లో కూటమి ప్రభుత్వం పేర్కొందన్నారు. మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించడంపై హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు కు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

**మంత్రి సవితకు ఆహ్వానం**

ఈ నెల 13న మొల్లమాంబ రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవాన్ని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయి మొల్ల జయంతి కార్యక్రమంలో హాజరుకావాలంటూ రాష్ట్రబీసీ, ఈడబ్ల్యూ ఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవితను రాష్ట్ర కుమ్మరి, శాలివాహన డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ ఆహ్వానించారు. ఈ మేరకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి ఆయన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయన వెంట కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 17న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు**

తిరుమల(చైతన్యరథం): తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మార్చి 19న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని మార్చి 17వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా మార్చి 17న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. 16వ తేది ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. అదేవిధంగా మార్చి 19న ఉగాది ఆస్థానం సందర్భంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడమైనది. ఈ కారణంగా మార్చి 18వన విఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు.

# శిశువు మృతిపై నివేదిక ఇవ్వండి

- మంత్రి పార్థసారథి ఆదేశం
- ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై సీరియస్
- మరోసారి పునరావృతం కారాదని హెచ్చరిక



అమరావతి(చైతన్యరథం): ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి శిశువు మృతిచెందిన ఘటనపై రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సీరియస్ అయ్యారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో బిజీబిజీగా ఉన్న మంత్రికి ఏలూరు జీజీహెచ్‌లో జరిగిన విషయం తెలిసిన వెంటనే ఘటనపై ఆరాతీశారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన సందర్భంలో జాగ్రత్తగా ఉండాలని, పేషెంట్లను జాగ్రత్తగా చూసుకోవాలని ఎన్నోసార్లు చెప్పాం. ఏలూరు జీజీహెచ్ సిబ్బంది తీరులో ఏ మాత్రం మార్పుకోవాలని ఆర్ఎంవోపై మండిపడ్డారు. తాజాగా నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం, గోపవరం గ్రామానికి చెందిన మహిళ నాగలక్ష్మి డెలివరీ నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌లో చేరారు. నాగలక్ష్మికి డెలివరీ చేయాల్సిన డాక్టర్ అథియా డెలివరీ డేట్ ఇంకా రాలేదనే కారణంతో డెలివరీ ఆలస్యం చేయగా శిశువు మృతిచెందిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై ఏలూరు జీజీహెచ్ ఆర్ఎంవోకు మంత్రి కొలుసు పార్థసారథి ఫోన్ చేసి ఘటనపై ఆరాతీశారు. శిశువు చనిపోయిన విషయాన్ని నాగలక్ష్మి కుటుంబసభ్యులకు చెప్ప కుండా దాచి బాధ్యత లేకుండా వెళ్లిపోవడం ఏమిటని నిలదీశారు? ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని, తనకు నివేదిక ఇచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్ఎంవోను మంత్రి ఆదేశించారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం అయితే ఎవర్నీ సహించేది లేదని తేల్చిచెప్పారు.

# 16న విజయవాడలో రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఇఫ్తార్


- పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- అన్ని జిల్లాల కేంద్రాలోనూ నిర్వహణకు ఏర్పాట్లు
- అందుకోసం రూ.1.50 కోట్ల నిధుల విడుదల



అమరావతి (చైతన్యరథం): పవిత్ర రంజాన్ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల స్థాయిలో ఇఫ్తార్ ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.1.50 కోట్లు నిధుల ను విడుదల చేసింది.ముస్లిం మైనారిటీలకు అత్యంత భక్తిశ్రద్ధలతో కూడిన రంజాన్ మాసంలో సాయంకాలం ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 16వ తేదీన రాష్ట్రస్థాయి ప్రభు త్వ ఇఫ్తార్ కార్యక్రమాన్ని విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్లో నిర్వ హించేందుకు నిర్ణయించారు. జిల్లాల కలెక్టర్లు రానున్న 4, 5 రోజులలో జిల్లాస్థాయి ఇఫ్తార్ కార్యక్రమాన్ని వారికి అనువైన రోజున నిర్వహిస్తారు. ఇఫ్తార్‌ను జిల్లా స్థాయిలో ఆయా జిల్లాల కలెక్టర్లు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికా రులు ప్రణాళికాబద్ధంగా, మనోరంజకంగా నిర్వహించాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏర్పాటు చేయబోయే రాష్ట్రస్థాయి ఇఫ్తార్ కార్యక్రమానికి రూ.75 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. ఇఫ్తార్ కోసం ప్రభుత్వం విడుదల చేసిన రూ.1.50 కోట్లలో రాష్ట్రస్థాయి ఇఫ్తార్ నిర్వహణకు పోను, మిగతా రూ.75 లక్షలు మొత్తాన్ని జిల్లాల వారీగా కేటాయించి ఆయా జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో జిల్లాస్థాయిలో ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇఫ్తార్ నిర్వహణకు నిధులు కేటాయిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లకు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులకు నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం అప్పజెప్పడం జరిగిందని పేర్కొన్నారు. వివిధ వర్గాల ప్రజలు ఇఫ్తార్ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా ప్రజలందరిలో మత సామరస్యం, సోదర భావం, ఐక్యతాభావం పెంపొంది, తద్వారా సమాజ పురోగతి మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

# టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

- రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- పరీక్షల సందర్భంగా ఆల్ ది బెస్ట్



అమరావతి (చైతన్యరథం): పదో తరగతి విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పరీక్షల ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష కేంద్రం వరకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ఉచిత ప్రయాణానికి అనుమ తించినట్టు తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో సౌకర్యం కల్పించినట్టు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6.42 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారు. మొత్తం 3,415 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగ నున్నాయి. హాల్ టికెట్ చూపించి బస్సులో ప్రయా ణించవచ్చని చెప్పారు.

# శృంగేరి పీఠాధిపతిని కలిసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



శ్రీకాళహస్తి (చైతన్యరథం): శృంగేరి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీ మహాస్వామీజీ బుధవారం శ్రీకాళహస్తి వచ్చారు. ప్రభుత్వం తరపున మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయి ఆశీస్సులు తీసుకున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శృంగేరి పీఠాధిపతులను కలిశారు. ఆయన వెంట శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీం రెడ్డి, దేవస్థానం చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఈవో దీఖ వెంకటేశులు, ఆర్డీవో భానుప్రకాష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

### కావూరి మృతికి సంతాపం

కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మృతిపై మంత్రి ఆనం సంతాపం ప్రకటించారు. ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన అనుభవజ్ఞుడైన నాయకుడిని కోల్పోవడం బాధగా ఉంది. పార్లమెంట్ సభ్యునిగా, కేంద్ర జౌళి శాఖ మంత్రిగా కావూరి సాంబ శివరావు దేశ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం రాజకీయ రంగానికి తీరని లోటని వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

# గల్ఫ్ ఉద్రిక్తతలపై ఆందోళన వద్దు

- రొయ్యల రైతులు పానిక్ హార్వెస్టింగ్ చేయొద్దు
- వదంతులు నమ్మొద్దు.. శాస్త్రీయంగా అక్వాకల్చర్
- షిప్పింగ్ కంటైనర్ల కొరతపై ప్రచారం అసత్యం
- ఎగుమతులపై ఎటువంటి ప్రభావం ఉండబోదు
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి(చైతన్యరథం): గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని రొయ్యల రైతులు ఆందో ళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ కో-వైస్ చైర్మన్, నాన్-ఆఫీషియల్ కమిటీ సభ్యులు, అక్వాకల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించి ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. మీడియాలో వచ్చి న వార్తలు, మధ్యప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, మన దేశ సముద్ర ఆహార ఎగుమతులపై చూపే ప్రభావంపై చర్చించారు. మీడియాలో వచ్చిన వార్తల వల్ల కొంతమంది ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొన్నట్లు తెలిపారు. సముద్ర ఆహార ఎగుమతులపై ప్రభావం ఉంటుందనే భయంతో ముందస్తు లేదా పానిక్ హార్వెస్టింగ్ చేయడం సరికాదని రైతుల కు సూచించారు. భారతదేశం నుంచి జరిగే మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లేది కేవలం 3,4 శాతం మాత్రమేనని, అది కూడా ప్రధానంగా హోర్ముజ్ జల సంధి ద్వారా జరుగుతుందని తెలిపారు. ఇతర దేశాలకు యూరోపియన్ యూనియన్, అమెరికా), జపాన్, చైనా వంటి దేశాలకు వెళ్లే సముద్ర ఆహార కంటైనర్లు రెడ్ సీ సూయెజ్ కాలువ మార్గం, కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గం, చైనా సముద్ర మార్గం ద్వారా నిర్బంధం లేకుండా కొనసాగు తున్నాయని చెప్పారు. అందువల్ల ప్రస్తుత పరిస్థితులు భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

### అమెరికా టారిఫ్‌లతో పోటీ సామర్థ్యంపై ప్రభావం లేదు

అమెరికా మార్కెట్‌లో డిమాండ్ 2026 మార్చి నెలాఖరుకు మెరుగుపడే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా సీ ఫుడ్ ఎక్స్‌పో నార్త్ అమెరికా (మార్చి 15-17, 2026, బోస్టన్, అమెరికా) అనంతరం డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అమెరికా మార్కెట్‌లో సాధారణంగా 50 మరియు 60 కౌంట్ రొయ్యలకు మంచి డిమాండ్ ఉంటుందని, ఇవి ఆంధ్రప్ర దేశ్ రైతులు సాధారణంగా ఉత్పత్తి చేసే సైజులు కావున ఆ కౌంట్ వచ్చే వరకు మధ్యస్థ పట్టుబడులు చేయనవసరం లేదన్నా రు. భారతీయ రొయ్యలపై అమెరికా విధించే సుమారు 20 శాతం టారిఫ్ (Basic Duty, Anti-Dumping Duty - ADD, Countervailing Duty - CVD సహా) ఇతర పోటీ దేశాలపై ఉన్న టారిఫ్‌లతో సమా నంగా ఉండటం వల్ల అంతర్జాతీయ సముద్ర ఆహార ఎగుమతి మార్కెట్‌లో భారతదేశ పోటీ సామర్థ్యం కొనసాగుతుందని మంత్రి తెలిపారు.

### షిప్పింగ్ కంటైనర్ల కొరతపై ప్రచారం అసత్యం

ప్రస్తుతం షిప్పింగ్ కంటైనర్ల కొరత ఉందని ప్రచారం జరు గుతున్న వార్తలు అసత్యమని మంత్రి స్పష్టం చేశారు. కంటైనర్ల కొరత కారణంగా ఎగుమతులు ప్రభావితం అవుతున్న పరిస్థితి ప్రస్తుతం లేదని, అలాగే ఏపీకి చెందిన కంటైనర్లు ఇప్పటివరకు వెనక్కి రాలేదని తెలిపారు. ఎగుమతుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు, రైతులకు సమయానుకూల సూచనలు అందించేందుకు ప్రతినెలా చివరి వారంలో ఏపీఎస్ఏడీఏ డైరెక్ట ర్లు, అక్వాకల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో సమీక్ష సమావే శాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారతదే శం, యూరోపియన్ యూనియన్ మధ్య కొనసాగుతున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చర్చలు పూర్తయితే భారత సముద్ర ఆహార ఎగుమ తులకు మరింత మార్కెట్ అవకాశాలు లభించి భవిష్యత్తులో ఎగుమతులు పెరగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఆక్వా రైతులు భయంతో లేదా ముందస్తు హార్వెస్టింగ్ చేయన వసరం లేదని, ఇలా చేయడం వల్ల మార్కెట్‌లో ఒకేసారి అధిక సరఫరా ఏర్పడి రొయ్యల ధరలు పడిపోవడం, రైతులకు ఆర్థిక నష్టం కలగడం జరిగే అవకాశం ఉందన్నారు. రైతులు, ఎగుమ తిదారులు, మత్స్యశాఖ అధికారుల సలహాలతో తమ ప్రణాళిక ప్రకారం కల్చర్ సైకిల్ పూర్తయ్యాక మాత్రమే సరైన సమయం లో హార్వెస్టింగ్ చేయాలని సూచించారు. ఏపీ ప్రభు త్వం మత్స్యశాఖ అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పర్య వేక్షిస్తూ ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర సంబం ధిత భాగస్వాములతో సమన్వయం చేస్తూ రాష్ట్రం నుంచి సముద్ర ఆహార ఎగుమతులు నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్రంలోని రొయ్యల రైతులు నిరాధారమైన వార్తలు, వదంతులను నమ్మకుండా ప్రశాం తంగా, శాస్త్రీయ విధానంలో అక్వాకల్చర్ కార్యకలాపాలను కొనసాగించాలని కోరారు.

# పర్యాటకానికి 'కల్చరల్ ఏఐ' భాగస్వామ్యం

- ఏరోస్ ఇన్నోవేషన్‌తో పనిచేయాలని నిర్ణయం
- ఏపీ పర్యాటక రంగంలో సరికొత్త శకం
- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- ఐఏఏపీఐ ఎక్స్‌పోలో రెండోరోజు చర్చలు
- ఏపీ వారసత్వ సంపదకు డిజిటల్ సొబగులు
- 'క్రియేటర్ ఎకానమీ'లో యువతకు గ్లోబల్ ప్లాట్‌ఫామ్



అమరావతి/ముంబయి(చైతన్యరథం): ముంబయి పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ రెండో రోజు బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతున్న 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోలో 'ఏరోస్ ఇన్నోవేషన్' ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందంతో ఫలప్రదమైన సమావేశాన్ని నిర్వహించారు. భారతీయ సంస్కృతి, పురాణాలు, భాషలు, కథా సంప్రదాయాలను లోతుగా అర్థం చేసుకు నేలా రూపొందించిన ఏరోస్ ఇన్నోవేషన్ యొక్క 'లార్జ్ కల్చరల్ మోడల్స్' ద్వారా ఏపీలో ప్రపంచంలోనే మొదటి 'కల్చరల్ ఏఐ' పర్యాటక వ్యవస్థను అభివృద్ధి చేసే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అత్యాధునిక సాంకేతికత ద్వారా మన రాష్ట్ర సంస్కృతిని ప్రపంచవ్యాప్తం చేయవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

### అద్భుతమైన డిజిటల్ పర్యాటక అనుభూతులు

మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్రం లోని పురాతన దేవాలయాలు, చారిత్రక వారసత్వ కట్టడాలు, గొప్ప సాంస్కృతిక గాథల చుట్టూ పర్యాటకులకు అద్భుతమైన 'ఇమ్మర్సివ్ డిజిటల్ జర్నీ' అనుభూతులను అందించడమే ఈ చొరవ ప్రధాన ఉద్దేశం. పర్యాటకులు కేవలం సందర్శించడమే కాకుండా మన చరిత్రను డిజిటల్ మాధ్యమంలో అనుభూతి చెందేలా ఈ ప్రాజెక్ట్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం కేవలం పర్యాటకానికే పరిమితం కాకుండా రాష్ట్రంలోని యువ కళాకారులు, కథకులు, డిజైనర్లు, సినీ నిర్మాతలు, డిజిటల్ క్రియేటర్లకు అంతర్జాతీయ వేదికను కల్పిస్తుందని స్పష్టం చేశారు. తద్వారా అభివృద్ధి చెందుతున్న 'క్రియేటర్ ఎకానమీ' (సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ), విస్తృత మైన 'ఆరెంజ్ ఎకానమీ'లో ఏపీ యువత కీలక పాత్ర పోషించి ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

### గ్లోబల్ లీడర్‌గా ప్రపంచ వేదికపై ఏపీ వారసత్వం

సాంకేతికత, సంస్కృతి, పర్యాటక రంగాలను అనుసంధానం చేస్తూ కొత్త ఆర్థిక అవకాశాలను సృష్టించే దిశగా ఏరోస్ ఇన్నో వేషన్, ఏపీ పర్యాటక శాఖ కలిసి పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దీనిద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఇమ్మర్సివ్ హెరిటేజ్ టూరిజంలో ప్రపంచ అగ్రగామిగా నిలబెడతామని, సృజనాత్మక వ్యవస్థాపకతకు కొత్త మార్గాలను ఈ ప్రాజెక్ట్ సుగమం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏరోస్ యూనివర్స్, ఏరో స్ నౌ సీఈఓ విక్రమ్ తన్నా, ఏరోస్ ఇన్నోవేషన్ గ్రూప్ చీఫ్ మార్కె టింగ్ ఆఫీసర్ పియూష్ భాటియా, ఏరోస్ వెల్నెస్ ఆర్ అండ్ డీ సీఈవో శిల్పా దేశాయ్ పాల్గొన్నారు. ప్రభుత్వం తరపున ఏపీ టూరిజం అథారిటీ డిప్యూటీ సీఈవో ఎ.శ్రీనివాస్, ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ సత్యప్రభ, మార్కెటింగ్ మేనేజర్ రఫీక్, సీనియర్ కన్సల్టెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాదాలు పరిష్కరించేందుకు చర్యలు

**నిషేధిత జాబితాలో ఉన్నవి ప్రకటించాలి: మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశం**




అమరావతి (చైతన్యరథం): భూ వివాదాలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్ శాఖల్లో స్పీడప్ డెలివరీపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరిగింది. ఏపీలో సుమారు నాలుగున్నర కోట్ల ఎకరాల భూమి ఉంటే..అందులో 22ఏ నిషేధిత జాబితాలో కోటి 95లక్షల ఎకరాల భూమి చేర్చారని ప్రస్తావించారు. గ్రామసభలు నిర్వహించి ప్రతి గ్రామంలోనూ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను అధికారులు ప్రకటించాలని సూచించారు. ప్రతి రైతుకు తన భూమి గురించి అవగాహన కల్పించేలా కలెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రపంచమంతా యుద్ధంతో విధ్వం సం జరుగుతుంటే.. ఏపీ మాత్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని వ్యాఖ్యానించారు. ఏపీని మరింత ముందుకు నడిపించేం దుకు స్పీడప్ డెలివరీ గవర్నెన్స్‌ను పెంచేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాలనలో వేగాన్ని పెంచుతూనే.. ప్రజలకు సర్కార్‌పై సంతృప్తిని కూడా పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు అన్ని శాఖల్లోనూ 90 శాతం ప్రజల సంతృప్తిని సాధించాలని.. రెవెన్యూ శాఖలో రిజిస్ట్రేషన్ సేవలపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని అన్నారు. భూ వివాదాలను సమర్థవంతంగా పరిష్కరిం చేందుకు కలెక్టర్లు కూడా తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలపాలని సూచించారు.

## 53 ప్రాజెక్టులకు రూ.1,106 కోట్లతో

# భారీ ప్రతిపాదనలు

- ఢిల్లీలో 'శాప్' చైర్మన్ రవినాయుడు పర్యటన
- కేంద్ర క్రీడా శాఖ ఉన్నతాధికారులను కలిసి సమర్పణ



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో క్రీడల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, యువ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ రవినాయుడు బుధవారం ఢిల్లీలో కీలక పర్యటన చేపట్టారు. కేంద్ర క్రీడా శాఖలోని ఉన్నతాధికారులను కలిసి రాష్ట్ర క్రీడా భవిష్యత్తుకు సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను సమర్పించారు. ఖేలో ఇండియా జాయింట్ సెక్రటరీ వినీల్ కృష్ణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ సాయి అశోక్‌లతో విడివిడిగా భేటీ అయ్యారు. రాష్ట్ర క్రీడా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, రానున్న ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు.

**కీలక ప్రతిపాదనలు-ముఖ్యాంశాలు:**

రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు మొత్తం 53 క్రీడా ప్రాజెక్టులను ప్రతిపాదిస్తూ వీటికి రూ.1,106 కోట్ల నిధులు మంజూరు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. తిరుపతిలోని దామినేడు ప్రాంతంలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో జల క్రీడల అభివృద్ధికి ప్రత్యేకంగా 9వాటర్ ప్రాజెక్టులను ప్రతిపాదిం చారు. ముఖ్యంగా మచిలీపట్నం (నాగయలంక), ఏలూరు (ఎర్ర కాలువ), తిరుపతి (రాయలచెరువు), విజయవాడ (పున్నమి ఘాట్), విజయనగరం (తాటిపూడి రిజర్వాయర్) ప్రాంతాల్లో డిస్ట్రిక్ట్ లెవెల్ వాటర్ స్పోర్ట్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

అరకు లోయలో '100 మైల్స్ అరకు వ్యాలీ ఇంటర్నేషనల్ ట్రయల్' పేరుతో అంతర్జాతీయ స్థాయి అడ్వెంచర్ స్పోర్ట్స్ ఈవెంట్ నిర్వహించేందుకు ప్రతిపాదనలు అందజేశారు.

ఏలూరు, విశాఖపట్నం, కుప్పం, కర్నూలు, మచిలీపట్నం, అమలాపురం తదితర ప్రాంతాల్లో ఖేలో ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పథకం కింద క్రీడా సదుపాయాల కల్పనకు నిధులు కోరారు.

ఈ ప్రతిపాదనలపై భారత క్రీడా ప్రాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి అశోక్ సానుకూలంగా స్పందించారని రవినాయుడు తెలిపారు. టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ సీఈవోను కూడా కలిసి ఏపీ క్రీడాకారులకు కేంద్రం నుంచి గరిష్ఠ సహాయ, సహకారాలు అందించాలని విన్నవించారు.

రవినాయుడు వెంట 'శాప్' మేనేజింగ్ డైరెక్టర్ భరణి ఉండి సాంకేతిక అంశాలను అధికారులకు వివరించారు. ఈ పర్యటనతో ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో కొత్త అధ్యాయం మొదలవుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

# అమరావతిలో భారీ అగ్నిప్రమాదం

*- విచారణకు హోంమంత్రి అనిత ఆదేశం*




అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డులో చోటు చేసుకున్న భారీ అగ్ని ప్రమాద ఘటనపై ఏపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా? లేక కుట్ర ఏమైనా ఉందా? అనే కోణంలో విచారణ జరపాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కాగా సమీప పొలంలో నుంచి మంటలు వచ్చాయని ఎల్ అండ్ టీ ప్రతినిధులు వెల్లడించారు. పొలం నుంచి పైపుల వరకు గడ్డి పేర్చి పైపులకు నిప్పు పెట్టినట్లు అనవాళ్లు ఉన్నాయని అంటున్నారు. ఈ ప్రమాద ఘటన స్థలానికి ఫోరెన్సిక్ బృందం ఇప్పటికే చేరుకుంది. మరో వైపు పొలాల వైపు నుంచి మంటలు అంటుకుంటూ వచ్చా యని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. అయితే ఈ ప్రమాదంపై పలు సందేహాలను స్థానికులు వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. ఏడు అగ్నిమాపక వాహ నాలు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొ చ్చే ప్రయత్నం చేస్తున్నాయి. మంటలు అదుపులోకి వచ్చాయని ఫైర్ డీజీ వెంకట రమణ వెల్లడించారు. అగ్నికి ఆహుతి అయిన పైప్ లైన్లు అన్ని ఏడు రకాల ఎమినిటీస్ కల్పించేందుకు ఉంచిన వని అధికారులు వెల్లడించారు. ఇవన్నీ పీవీసీ పైపులని.. చాలా ఖరీదైనవని అధికారులు వివరించారు.

# వివేకా హత్య కేసుపై విచారణ

**- నాలుగు వారాల్లో తీర్పు వెలువరించాలి**

**- సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశం**



ఢిల్లీ: మాజీ మంత్రి వివేకా హత్య కేసులో సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో మూడో సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు కోర్టుకు సీబీఐ తెలిపింది. తమ దర్యాప్తు పూర్తి చేసినట్లు సీబీఐ తరపు న్యాయవాది చెప్పారు. తాము లేవనెత్తిన అంశాలపై దర్యాప్తు జరగలేదని సునీత తరపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. దీంతో ఈ కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని జస్టిస్ ఎంఎం సుందరేశ్ ధర్మాసనం పేర్కొంది. ట్రయల్ కోర్టులో సెక్షన్ 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లపై నాలుగు వారాల్లో విచారణ ముగించి తీర్పు వెలువరించాలని ఆదేశించింది. చార్జిషీట్ దాఖలు పూర్తి అయినందున నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ జరపాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

# గేర్ మార్చాలి..మరింత గ్రోత్ సాధించాలి

- పది సూత్రాలు బెంచ్ మార్కుగా పరిగణించాలి
- బడ్జెట్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలి
- కలెక్టర్ల సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర స్థాయి జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడారు. మరో 20 రోజుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పూర్తి కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల తో 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఒక నూతన విధానం తో రూపొందించాం. సాధారణంగా బడ్జెట్ అనేది మార్చి 31వ తేదీకి పూర్తి అవుతుంది. అయితే 20 రోజుల ముందుగానే ఈ బడ్జెట్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. తద్వరా ఈ 20 రోజుల్లో ఈ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న నిధులను సకాలంలో వినియోగించే అవకాశం కలగడంతో పాటు సెంట్రల్లీ స్పాన్సర్డ్ పథకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఇంకా మిగిలిన నిధులను సద్వినియోగం చేసుకొనేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్లు మిగిలిన నిధులను వెచ్చించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. సెక్రటరీలు కేంద్ర ప్రభుత్వం దగ్గర మిగిలి ఉన్న నిధులను రాష్ట్రానికి తెచ్చేందుకు అవకాశం కలుగు తుందని వివరించారు. బడ్జెట్‌పై సామాన్యులకు కూడా అర్థం అయ్యే విధంగా క్షేత్రస్థాయిలో బడ్జెట్‌పై సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. కేంద్రం కూడా ఇదే తరహాలో కేంద్ర బడ్జెట్‌పై దేశ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విషయాన్ని గుర్తించాలి. ఒక ఫ్యామిలీ బడ్జెట్‌ను రూపొందించడం జరిగింది. ఈ ఫ్యామిలీ బడ్జెట్ ద్వారా కుటుంబాలు ఏ విధంగా లబ్ధి పొందు తున్నాయనే విషయాన్ని క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలి. క్షేత్రస్థాయిలో ఎప్పటినుంచి అవగాహనా సదస్సులు నిర్వహించాలి అనే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి త్వరలో ప్రకటించనున్నారు. జిల్లాల వారీగా బడ్జెట్లను వెంటనే సంబంధిత సెక్రటరీలు కేటాయించాలి. తద్వారా బడ్జెట్ కేటాయింపులపై అవగాహన సదస్సులు నిర్వహించే అవకాశం కలుగుతుందని తెలిపారు. పది సూత్రాలను బెంచ్ మార్కుగా అందరూ పరిగణించాలి. ఈ పది సూత్రాలపై జిల్లా కలెక్టర్లు అందరూ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గత 20 మాసాల్లో ఎన్నో సమస్యలను అధిగమించాం..అయితే ఈ సంవత్సరం రాష్ట్ర, జిల్లా స్థాయి యంత్రాంగం అంతా గేర్ అప్ కావాలి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అసాధారణమైన గ్రోత్‌ను సాధించే విధంగా సెక్రటరీలు, జిల్లా కలెక్టర్లు అందరూ కృషి చేయాలని సూచించారు.

## బుల్లెట్ వేగంతో డబుల్ ఇంజన్ సర్కార్

- దోచుకో..పంచుకో..తినుకో ఇదే వైసీపీ విధానం
- టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా



అమరావతి(చైతన్యరథం): వైసీపీ నేతలపై టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నిప్పులు చెరిగారు. బుధవారం రాజధాని అమరావతిలో దేవినేని ఉమా మాట్లాడుతూ.. దోచుకో.. పంచుకో.. తినుకో.. ఆ నినాదం వైసీపీ పేటెంట్ హక్కు అని స్పష్టం చేశారు. ఐదేళ్ళ ఆర్థిక విధ్వంసానికి పాల్పడి ఇప్పుడు కాగ్ నివేదకను వక్రీకరించి ప్రజలను మభ్యపెట్టే పనులు చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ శ్రీరంగ నీతులు చెప్పి.. ఢిల్లీలో తెల్లజెండా ఎత్తుతున్నా రంటూ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంతో పోల్చితే దాదాపు 45 శాతం వరకు సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం అదనంగా ఖర్చు చేస్తుందని వివరించారు. అభివృద్ధి - సంక్షేమంతో రాష్ట్రం లో కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కార్.. బుల్లెట్ వేగంతో నడు స్తుందని పేర్కొన్నారు. పరదాలు కట్టుకొని పరిపాలన చేయడం చేతగాక 11 సీట్లకు పరిమితమయ్యారంటూ వైసీపీ నేతలను ఎద్దేవా చేశారు. అన్న క్యాంటీన్, తల్లికి వందనం, ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్, అన్నదాత సుఖీభవ పథకాలతో కూటమి ప్రభు త్వం అగ్రస్థానం కల్పించిందని పేర్కొన్నారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసి..రూ.వేల కోట్ల పెండింగ్ బిల్లులు వదిలి నేడు రాష్ట్ర ఖజానా, మినిమమ్ బ్యాలెన్స్ గురించి మాట్లాడటం సిగ్గు చేటు అని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు విజన్ చూసి ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు.



## పట్టాలెక్కనున్న 8 ఎర్రరైళ్లు

- కడప, రామేశ్వరం స్టేషన్లలో తుది పరీక్షలు
- ఈ నెల 16 నుంచి అందుబాటులోకి
- వాటిలో అత్యాధునిక సౌకర్యాలు

*తిరుపతి(చైతన్యరథం): దాదాపు మూడు దశాబ్దాలుగా ప్రయాణికులకు సేవలందిస్తూ వచ్చిన ఎనిమిది పసుపురైళ్ల స్థానంలో సరికొత్త 'ఎర్రరైళ్లు' ఈ నెల్లోనే పట్టాలెక్కనున్నాయి. తిరుపతి-పూరి, బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్, అమరావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, కాకినాడ టౌన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఐసీఎఫ్ నుంచి ఎల్‌హెచ్‌బీకి రైల్వేశాఖ మార్చింది. ఈ నేపథ్యంలో తమిళనాడు పెరంబదూర్‌లో నూతన ఎర్ర బోగీలతో సహా 130 కిలోమీటర్ల వేగంతో నడిచే పచ్చరంగు ఇంజన్లు తయారయ్యాయి. మొత్తం ఎనిమిదిరైళ్లను ఇప్పటికే ప్రయోగాత్మకంగా పట్టాలెక్కించి విశాలంగా కడప జిల్లా ప్రొద్దుటూ రు రైల్వేయార్డ్‌కు, రామేశ్వరం రైల్వేస్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతానికి అక్కడ తుది పరీక్షలు జరుగుతున్నాయి. కాలానుగు ణంగా తయారుచేసిన ఈ రైళ్లలో మెరుగైన సదుపాయాలను పొందుపరిచారు. డోర్స్, ఏసీ, ఫ్యాన్స్, లైటింగ్, వాటర్, బాత్ రూమ్స్, బ్రేక్ సిస్టమ్, స్పీడు, కంట్రోల్, బెర్తు, సీటింగ్ కెపాసిటీ పెంచడం వంటి తాజా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అత్యాధు నిక సౌకర్యాలు కల్పించారు.*

- *తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (నెంబర్లు 17480-17479) సోమ, మంగళ, బుధ, శుక్ర, శనివారాలలో నడుస్తాయి. తిరుపతి - బిలాస్‌పూర్(నెంబర్లు 17482-17481) గురు, ఆదివారాల్లో మాత్రమే నడుస్తాయి. ఈ నాలుగు నూతన రైళ్లు 18 బోగీలతో ఈనెల 16న తిరుపతి నుంచి ఒకటి, అదే రోజున పూరి నుంచి మరొకటి బయల్దేరతాయి. 19న తిరుపతి నుంచి ఒకటి, అదే రోజున బిలాస్‌పూర్ నుంచి మరొకటి బయలుదేరుతాయి.*
- *తిరుపతి-అమరావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నెంబర్లు 12765-12766) మొత్తం 15 బోగీలతో ఈ నెల 21న తిరుపతి నుంచి బయలుదేరుతుంది. ఈ రైలు వారంలో రెండురోజులు అంటే మంగళ, శనివారాల్లో మాత్రమే నడుస్తుంది.*
- *తిరుపతి-కాకినాడ టౌన్ ఎక్స్‌ప్రెస్ (నెంబర్లు 17249-17250) మొత్తం 22 బోగీలతో ఈ నెల 22న తిరుపతి నుంచి ఒకటి అదేరోజున కాకినాడ నుంచి మరొకటి బయలుదేరతాయి.*
- *తిరుపతి-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్(నెంబర్లు 16780-16779) మొత్తం 17 బోగీలతో ఈనెల 26న రామేశ్వరంలో బయల్దేరి 27న తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైలు సోమ, బుధ, శుక్ర, శనివారాల్లో మాత్రమే నడుస్తుంది.*

# అంత సీన్ లేదు జగన్ రెడ్డీ!

- మీ పాలనకు 11 సీట్లే నిదర్శనం
- ప్యాలెస్‌లో డబ్బా కొట్టుకుంటే సరిపోదు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఫైర్



అమరావతి (చైతన్యరథం): తన హయాంలో ఆర్థిక నిర్వహణ ఎంతో భేషుగ్గా ఉందని, సంక్షేమ పథకాల అమలు సూపర్‌గా జరిగిందని సొంత డబ్బా కొట్టుకోవడానికి గురువారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేసిన ప్రయత్నాన్ని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా దుయ్యబట్టారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన పత్రికా సమావేశంలో జగన్‌రెడ్డి ప్రస్తావించిన పలు అంశాలు, చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను నిలదీశారు. సుదీర్ఘ అనుభవం, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల సమ దృష్టి, యువత భవిత పట్ల దార్శినికతతో వ్యవహరించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని విమర్శించేంత సీను జగన్ రెడ్డికి లేదన్నారు.

మీ పాలన అంత అద్భుతంగా ఉంటే 2024 ఎన్నికల్లో ప్రజలు మీకు కేవలం 11 సీట్లే ఎందుకు ఇచ్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలని ఎద్దేవా చేశారు. తన ఐదేళ్ల విధ్వంసాన్ని ప్రజలు అనుభవపూర్వకంగా గుర్తించడంతో కొన్ని దశాబ్దాల పాటు రాజకీయ మనుగడ లేదని తెలుసుకున్న జగన్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. 16 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగితే ప్రజా సమస్యలపై చర్చించకుండా కేవలం 11 నిమిషాలు మాత్రమే వచ్చి వెళ్లడం మీ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం కాదా అని మండిపడ్డారు.

తన దుష్ట పాలనలో పోలీసులతో ఎముకలు విరిగేలా కొట్టించిన రఘురామకృష్ణరాజును సభా నిర్వహణ సమయంలో ' అధ్యక్షా' అని సంబోధించాల్సి వస్తుందనే సభకు రావట్లేదని... ఇది సబబా అని నిలదీశారు.

హయాంలో ఆరోగ్య రంగానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ బకాయిలు రూ.2,400 కోట్లు, మందుల సరఫరా బకాయిలు రూ.600 కోట్లు. నిర్మాణ పనుల బకాయిలు రూ.1,000 కోట్లు ఉన్నాయన్నారు. జగన్ హయాంలో 14వేల పోస్టులు ఖాళీగా ఉంటే, కూటమి ప్రభుత్వం కేవలం 19 నెలల్లోనే 8,669 ఖాళీలను భర్తీ చేసిందని, మరో 863 మంది వైద్యుల నియామకం సాగుతోందని వెల్లడించారు.

మెడికల్ కాలేజీల అంకెల గారడీ: 17 కొత్త మెడికల్ కాలేజీలు కట్టామని జగన్ చెప్తున్నా... కేటాయించిన నిధుల్లో కేవలం 18 శాతం (రూపాయిలో 18 పైసలు) మాత్రమే ఖర్చు చేశారని, అరకొర నిధులతో కాలేజీలు ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

జగన్ హయాంలో కమీషన్ల కోసం పెట్టుబడిదారులను తరిమేయడం వల్లే రాష్ట్ర ఆదాయం పడిపోయిందని, ఆ ఆర్థిక భారాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం మోస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు సరైన వేదిక శాసనసభా లేక తాడేపల్లి ప్యాలెస్సా చెప్పాలన్నారు.

పరకామణి విషయంలో తన హయాంలో రూ.75వేలు దొంగతనం చేసిన వాడు రూ.15కోట్లు తిరుమల తిరుపతి దేవస్థానానికి చెల్లించి పునీతుడయ్యాడని మాజీ ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వేల కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడినట్టు సీబీఐ ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్‌రెడ్డి అదే రీతిలో భారీగా చెల్లింపులు చేసి పునీతుడవడానికి సమాయత్తమవుతున్నట్టు అనుమానం వస్తోందన్నారు.

# వైసీపీ సర్పంచ్ వేధింపులపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

- **పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా మార్చిన రెవెన్యూ అధికారులు.. న్యాయం చేయాలని విజ్ఞప్తి**
- **గత ప్రభుత్వంలో రాజకీయ అండతో వారసత్వ భూమి కబ్జా.. . చర్యలు తీసుకోవాలని వినతి**
- **అర్జీలు స్వీకరించిన ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి**



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వారు ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి వినతులు ఇచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన సరోజనమ్మ అర్జీ ఇది... 'నారాయణపురం అప్పలస్వామి అనే వ్యక్తి నాకు రూ.1.50 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తాన్ని కర్రి గోవిందనాయుడుకు అప్పగించగా ఆయన సదరు సొమ్ము ఇవ్వకుండా మోసం చేస్తున్నాడు. అంతే కాకుండా సుమారు రూ.20వేలు విలువైన వ్యవసాయ ఉత్పత్తుల తో పాటు కోళ్లను కూడా అక్రమంగా తీసుకున్నారు. వైసీపీ సర్పంచ్‌గా ఉన్న గోవిందనాయుడు గ్రామంలో భూములు లేని వారి వద్ద రూ.20వేలు చొప్పున వసూలు చేసి అక్రమంగా పట్టాలు చేయించాడు. నా డబ్బులు తిరిగి అడిగినందుకు కర్రి గోవిందనాయుడు, కర్రి ఉమా అనే వ్యక్తులు రౌడీలను ఇంటికి పంపి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.' వారిపై చర్యలు తీసుకోవాలి.

కడపకు చెందిన సాంబశివయ్య అర్జీ... నాకు చెన్నూరు మండల పరిధిలోని సర్వే నెం.1250/192లో 4.96 ఎకరాల భూమి ఉంది. (పట్టా నెం:193). దీనిని రిజిస్టర్ చేయడానికి తహసీల్దారు గతంలో నిరాకరించడంతో కడప మూడవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించాను. విచారణ అనంతరం కోర్టు నాకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కోర్టు ద్వారా రిజిస్ట్రేషన్ అయిన భూమిని చెన్నూరు తహసీల్దారు, సిబ్బంది కలిసి 19-9-2021న అడంగల్ నుంచి తొలగించారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండా 2022 మేలో ఫారం-10 రికార్డులను సృష్టించి పట్టా భూమిని రాత్రికి రాత్రే "ప్రభుత్వ భూమి"గా మార్చేశారు. దానిని ఆక్రమించుకోవాలనే ఉద్దేశంతోనే నిబంధనలకు విరుద్ధంగా రికార్డులను మార్చారు.

బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం కావూరు గ్రామానికి చెందిన నాగమారుతి అభ్యర్థన... నా తండ్రి మధుసూదనరావు వారసత్వంగా కొండపాటూరు గ్రామ పరిధిలోని సర్వే నెం. 328/ 14లో 1.00 ఎకరం మెట్ట భూమి సంక్రమించింది. దీనికి 1-బి, అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాలు నా పేరిటే ఉన్నాయి. గతంలో ఈ భూమిపై బ్యాంకు రుణాలు కూడా తీసుకున్నాం. పొలం పక్కనే ఉన్న కాకా సాంబయ్య వ్యక్తి గత ప్రభుత్వంలో రాజకీయ అండదండలతో ఈ భూమిని కబ్జా చేశాడు. గతంలో పలుమార్లు పోలీసులు హెచ్చరించినా అతడు మళ్లీ తమ పొలంలోకి వచ్చి బలవంతంగా మొక్కజొన్న పంట వేశాడు. భూమిని అడిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.

గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కారంపూడిపాడు గ్రామానికి చెందిన ప్రసాద్ ఏమన్నాడంటే... మా గ్రామంలో నాకు వున్న 0.46 సెంట్ల భూమికి అదనంగా వెలిచర్ల సరోజినికి చెందిన భూమిని కూడా కలిపి అడంగల్‌లో నమోదు చేశారు. దీనిపై చేబ్రోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివరణ ఇవ్వగా అక్కడ పనిచేస్తున్న సూపరింటెండెంట్ సత్యనారాయణ మమ్మల్ని ఖాళీ రూ.20 స్టాంపు పేపర్లపై సంతకాలు చేయమని ఒత్తిడి తెచ్చారు. నాకు లేని ఎకరం భూమిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లేని సమయంలో సూపరింటెండెంట్ స్వయంగా షేక్ మస్తాన్వలి అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు. కంప్యూటర్ పనిచేయట్లేదనే సాకుతో మమ్మల్ని తప్పుదోవ పట్టించి బలవంతంగా సంతకాలు సేకరించే ప్రయత్నం చేశారు.

అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన వేణుగోపాల్ అర్జీ... నాకు సర్వే నెం.431-(ఎ)లో 120 గజాల స్థలం ఉంది. దానికి దక్షిణాన దస్తావేజు ప్రకారం 'రస్తా' ఉండాలి. కానీ గతంలో పనిచేసిన తహసీల్దార్లు, ప్రస్తుత అధికారులు దానిని ఉద్దేశపూర్వకంగా పక్కనే ఉన్న షేక్ ముక్తార్ సాబ్ స్థలంగా చూపిస్తూ నివేదికలు మారుస్తున్నారు. గతంలో తప్పుడు సమాచారం ఇచ్చిన అప్పటి తహసీల్దారు (ప్రస్తుతం ఆర్డీవో) సి. హరిప్రసాద్‌కు రాష్ట్ర సమాచార కమిషన్ రూ.25వేలు జరిమానా విధించింది. ఆయన ప్రస్తుతం సీఐడీ కేసులో నిందితుడిగా ఉన్నారు. 2015లో ఒక తహసీల్దారు, 2022లో మరో తహసీల్దారు వేర్వేరు నివేదికలు ఇచ్చారు. ఒకరు రస్తా లేదనగా మరొకరు రస్తా ఉందని చెప్తూ గందరగోళం సృష్టిస్తున్నారు.

బాపట్లకు చెందిన సుభాషిణి మాటల్లో... కర్లపాలెం మండలం పేరలీ రెవెన్యూ పరిధిలోని సంపెటవారిపాలెంలో నాకు చెందిన 3.97 ఎకరాల పొలాన్ని... గతంలో ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు రెండు అన్-రిజిస్టర్డ్ వీలునామాలు సృష్టించి అక్రమంగా మ్యుటేషన్ చేయించుకున్నారు. 5-10-2018 నాటి అసలు వీలునామా ప్రస్తుతం బాపట్ల కోర్టు కస్టడీలో ఉంది. గత నెల 21న ఆర్డీవో, తహసీల్దారు సమక్షంలో జరిగిన విచారణలో.. లబ్ధిదారులుగా చూపిన వ్యక్తులు 18-10-2018 వీలునామా సమర్పించలేదని, మ్యుటేషన్ కోసం అసలు దరఖాస్తు చేయలేదని స్పష్టంగా ఒప్పుకున్నాం. విచారణలో అక్రమం జరిగిందని తేలినప్పటికీ రెవెన్యూ సిబ్బంది, అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోకుండా తమకు న్యాయం చేయకుండా "కోర్టులో తేల్చుకోండి" అని నివేదిక ఇచ్చారు. ఇదే అదనుగా భావించి సీలం పోలిరెడ్డి అనే వ్యక్తి అర ఎకరం పొలాన్ని అక్రమంగా ఆక్రమించి మమ్మల్ని పొలంలోకి రాకుండా రౌడీలతో బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోండి.

వీటితో పాటు పలువురు పింఛను, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని ఇంకొందరు అభ్యర్థించారు.

## ప్రోత్సాహకాలివ్వకుంటే పెట్టుబడులు ఎలా వస్తాయి?

- వైసీపీ ఎంపీపై హైకోర్టు ఫైర్
- భూ కేటాయింపుల రద్దు పిటిషన్‌పై విచారణ
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పరిశ్రమలకు భూములు కేటాయింపులు రద్దు చేయాలని కోరుతూ జగన్‌రెడ్డి సన్నిహితుడు, వైసీపీ నేత, తిరుపతి ఎంపీ గురుమూర్తి వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు ధర్మాసనం మండిపడింది. ఈ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాదికి హైకోర్టు పలు ప్రశ్నలు సంధించింది. ప్రోత్సాహకాలు ఇవ్వకుంటే పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు వస్తారని ప్రశ్నించింది. అలాగే ప్రపంచ దేశాలు, పక్క రాష్ట్రాలు పోటీని తట్టుకొని పెట్టుబడులు రాబట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కదా అంటూ సమర్థించింది. పోటీ ప్రపంచంలో మార్కెట్ ధరకు భూములు ఇస్తామంటే కంపెనీలు దండం పెట్టి వెళ్లిపోతాయని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఐటీ, పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు పాలసీలను రూపొందించి ఉండవచ్చని తెలిపింది. ప్రభుత్వ యంత్రాంగాన్ని అడ్డుకునేందుకు తాము ఇక్కడలేమని ఈ సందర్భంగా హైకోర్టు స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో అధిక శాతం మంది తెలుగు వారే ఉన్నారని హైకోర్టు గుర్తు చేసింది. అలాగే రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వివరించింది. దీని వల్ల కలిగే విస్తృత ప్రయోజనాలు భవిష్యత్తులో చూడవచ్చని పేర్కొంది. వేలంలో కంపెనీలకు భూములు కేటాయించడం వల్ల ఆశించిన ఫలితాలు రాకపోవచ్చని ఏపీ హైకోర్టు అభిప్రాయపడింది. ప్రభుత్వ పాలసీ వల్ల పెట్టుబడులు పెట్టలేకపోయామని ఏ కంపెనీ అయినా కోర్టు ముందుకు వచ్చిందా? అని పిటిషనర్ తరపున న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ పాలసీని సవాల్ చేస్తూ రాజకీయ నాయకుడు కోర్టును ఆశ్రయించారని తెలిపింది. ప్రభుత్వ విధాన పరమైన విషయాల్లో కోర్టులు జోక్యం చేసుకోవని తెలిపింది. ప్రచారం కోసమో.. మరే ఇతర కారణాలతో ఒకే అంశంపై ప్రజాహిత వ్యాజ్యాలు వేస్తున్నారని పేర్కొంది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## అసత్యాల విషజీవి జగన్

- **దోపిడీ బాగోతాలు బయటపడడంతో**
- **ప్రజలను మభ్యపెట్టేందుకు విష ప్రచారం**
- **అప్పులు చేసి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు**
- **కార్మిక శాఖ మంత్రి సుభాష్ ధ్వజం**



అమరావతి (చైతన్యరథం): జగన్‌రెడ్డి అబద్ధాలు, మోసాలు తెలు సుకున్న ప్రజలు..వైసీపీని పాతాళంలో పాతరేసినా ఆయన తీరు లో మార్పు రావడం లేదంటూ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ధ్వజమెత్తారు. అబద్ధాలు, అసత్యాలతో కూటమి ప్రభుత్వంపై జగన్‌రెడ్డి విషం కక్కుతున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో దోపిడీ చేసిన బాగోతాలు బయటపడడంతో సమాధానం చెప్పే దమ్ములేని దద్దమ్మ జగన్ అంటూ ఘాటుగా విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అప్పులు పెరిగిపోతున్నాయంటూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు జగన్ నానా యాగీ చేస్తున్నారని ధ్వజ మెత్తారు. అప్పులు ఎలా, ఎందుకు, ఎవరి పాలనలో ఎంత పెరిగా యో ప్రజలకు నిజాలు తెలియవనుకోవడం జగన్ అవివేకానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఆయన ఛిన్నాభిన్నం చేసిన ఉదంతం ఇంకా ప్రజలు మరచిపోలేదు. అభివృద్ధిని పక్కన పెట్టి తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉచిత పథకాలు, ప్రచారం పేరుతో అప్పులు చేసి రాష్ట్రాన్ని దోపిడీ చేశారని ఎద్దేవా చేశారు. నేడు రాష్ట్ర అప్పులు పెరిగిపోతున్నాయని సిగ్గు లేకుండా సుద్దపూస మాటలు చెబుతున్నారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ప్రధాని అవుతారంటూ మీడియాలో వస్తున్న కథనాలపై జగన్ అక్కసు వెళ్లగక్కడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. జగన్ రాజకీయాల్లోకి రాకముందే దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన రాజకీయ దురంధరుడు చంద్రబాబు. ప్రధాని అవకాశాలు వచ్చినా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ పదవిని త్యజించిన విషయం జగన్‌కు తెలియకపోవడం శోచనీయం. జగన్ సీఎంకు తక్కువ, ఎమ్మెల్యేకు ఎక్కువ..అలాంటి వ్యక్తికి చంద్రబాబుపై కామెంట్ చేసే హక్కు ఎక్కడదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై వాస్తవాలు తెలుసు కుని మాట్లాడాలని హితవు పలికారు.

## కావూరి సాంబశివరావు మృతి బాధాకరం

### నందమూరి బాలకృష్ణ సంతాపం





అమరావతి (చైతన్యరథం): మాజీ కేంద్రమంత్రి, ప్రముఖ పారిశ్రామికవేత్త కావూరి సాంబశివరావు మృతి పట్ల హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాను. ప్రజా జీవితంలో ఆయన చూపిన నిబద్ధత, పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమైనవన్నారు. అభివృద్ధి, పారిశ్రామిక రంగాల పురోగతికి ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తించదగినది. దీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగుతూ రాష్ట్ర అభ్యున్నతికి కృషి చేసిన ఆయన లాంటి సీనియర్ నాయకుడిని కోల్పోవడం తెలుగు ప్రజలకు తీరని లోటు. ప్రజల సమస్యలను ధైర్యంగా ప్రస్తావించే నాయకుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్‌గా రాజు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమి షన్‌కు చైర్మన్‌తో పాటు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమిం చింది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్‌గా వెటుకూరి ఏవీఎస్ఎస్ఎన్ రాజు నియమితు లయ్యారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులుగా చల్లా మధుసూదన్ రావు, కె.జి.వెంకట పద్మలత, దొని శ్రీనివాస మూర్తి, వుండవల్లి గాంధీ బాబు, మండల గంగా సూర్యనారాయణ, ఎం. భవరాజు పద్మావతిలను ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ చైర్మన్, సభ్యులు పదవీ స్వీకరణ చేసిన తేదీ నుంచి మూడు సంవత్సరాల పాటు లేదా చైర్మన్‌కు 65 ఏళ్లు, సభ్యులకు 60 ఏళ్లు వచ్చే వరకు పదవిలో కొనసాగుతారు.

# అమరావతిలో అగ్నిప్రయాదం ఏదైనా కుట్ర జరిగిందా అనే కోణంలో విచారణ



వెలగపూడి (చైతన్యరథం): రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రహదారి వద్ద అగ్ని ప్రమాదం జరిగింది. చీ9 రోడ్డు వెలగపూడి జంక్షన్ వద్ద ఉంచిన పైపులు అగ్నికి ఆహుతి అయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి వెంటనే మంటలను అదుపు చేశారు. సీడ్ యాక్సెస్ రహదారి పక్కన రాజధాని అవసరాల కోసం భారీగా పైపులు తీసుకొచ్చి ఎన్9 జంక్షన్ వద్ద ఉంచారు. వీటి విలువ సుమారు కోటి రూపాయలకు పైనే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రెండు రోజుల క్రితం పైపులు నిల్వ చేసిన ప్రాంతంలో అధికారులు చెత్తాచెదారాన్ని తొలగించారు. అగ్ని ప్రమాద ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని తుళ్లూరు పోలీసులు వెల్లడించారు.

**కుట్ర కోణం ఏమైనా దాగి ఉందా?:** కలెక్టర్ల సదస్సు జరుగుతున్న సమయంలో సచివాలయానికి కూత వేటు దూరంలో భారీ అగ్నిప్రమాదం జరగటం కలకలం రేపుతోంది. ఇది ప్రమాద వశాత్తు జరిగిందా? లేక కుట్ర కోణం ఏమైనా దాగి వుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజధాని పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపనకు గత ఏడాది ప్రధాని వచ్చిన సమయంలో ఇదే తరహాలో అగ్నిప్రమాదం జరిగి పైపులు తగలబడ్డాయి. మళ్లీ తిరిగి అదే రీతిలో కలెక్టర్ల సదస్సు జరుగుతున్న సమయంలో భారీ అగ్నిప్రమాదం జరగటం పలు అనుమానాలకు తావిస్తుంది. రాజధాని నిర్మాణ పనుల్లో భాగంగా విద్యుత్ తీగలు, ఇతర కేబుళ్లు అన్ని భూగర్భం నుంచి వెళ్లేలా ప్రణాళిక రచించారు. ఈ పనుల టెండర్ దక్కించుకున్న ఎల్?అండ్?టి సంస్థ అందుకు అవసరమైన ప్లాస్టిక్ పైపులను సీడ్ యాక్సిస్ రహదారి వెంబడి దిగుమతి చేసుకుని పనులు సాగిస్తుంది. ఉన్నట్లుండి పైపులు అంటుకోవటం నిజంగా ప్రమాదవశాత్తు జరిగిందా? లేక ఏదైనా కుట్ర దాగి ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

**విచారణకు ఆదేశించిన మంత్రి అనిత:** వెలగపూడి అగ్నిప్రమాదం ఘటనపై హోంమంత్రి అనిత విచారణకు ఆదేశించారు. ప్రమాదవశాత్తా? కుట్రా? అనే కోణంలో విచారణకు ఆదేశించినట్లు సమాచారం. అగ్నిప్రమాదంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో విచారణకు ఆదేశించడం గమనార్హం. పైపులకు మంట సమీప పొలంలో నుంచి వచ్చిందని ఎల్అండ్టీ ప్రతినిధులు అంటున్నారు. పొలంలో నుంచి పైపుల వరకూ గడ్డి పేర్చి నిప్పు పెట్టిన ఆనవాళ్లను సంస్థ ప్రతినిధులు చూపించారు. మంటలను ఆర్పేందుకు ఏడు అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఫైర్ సిబ్బంది ప్రస్తుతం అదుపు చేశారు.

# ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమ పోస్టర్ విడుదల చేసిన సీఎం చంద్రబాబునాయుడు



పెదకూరపాడు (చైతన్యరథం) : ప్రజల వద్దకు ప్రవీణ్... 100 రోజులు... 100 గ్రామాలు కార్యక్రమంలో 50వ రోజు పోస్టర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతలు మీదుగా ఆవిష్కరించారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేపట్టిన ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా 50వ రోజు పోస్టర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఇప్పటి వరకు నిర్వహించిన 49 రోజుల కార్యక్రమ వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. నియోజకవర్గంలోని గ్రామాలన్నింటిని సందర్శిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కల్పించడం, తక్షణ పరిష్కారం అవసరమైన అంశాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన పర్యటనల్లో గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా కలుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనల ఆధారంగా నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రశంసించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజలకు మరింత దగ్గర చేస్తాయని అభినందించారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు, 100 గ్రామాలు కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు.

# దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా జగన్ వ్యాఖ్యలు

## • మీడియా సమావేశంలో మండిపడ్డ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీరు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత పక్కన బెట్టి, కేవలం తాడేపల్లి ప్యాలెస్‌లో నాలుగు గోడల మధ్య ప్రెస్ మీట్‌లకే పరిమితం కావడంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసెంబ్లీకి రాకుండా ఆర్థిక వనరులు, ఆర్థిక వ్యవస్థ గురించి జగన్ మాట్లాడుతున్న మాటలు విడ్డూరంగా ఉన్నాయంటూ టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర విమర్శలు చేశారు. జగన్మోహన్ రెడ్డి బెంగళూరు నుంచి వచ్చి తాడేపల్లి ప్యాలెస్‌లో మీడియా సమావేశం నిర్వహించడంపై టీడీపీ ఎంపీ అప్పలనాయుడు తీవ్ర విమర్శలు చేశారు. ఆయన మాట్లాడుతూ..‘ ప్రజాస్వామ్యంలో శాసనసభ అనేది ప్రజల గొంతుక వినిపించే అత్యున్నత వేదిక. కానీ, పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి రాకుండా నాలుగు గోడల మధ్యలో పిల్లి లాగ కూర్చొని ప్రెస్ మీట్‌లు పెడుతున్నారు. ఆర్థిక వనరులు, ఆర్థిక వ్యవస్థ గురించి జగన్ మాట్లాడుతున్న మాటలు విడ్డూరంగా ఉన్నాయి. ఐదేళ్లలో ప్రజలకు ఏమి లేకుండా చేసిన జగన్మోహన్ రెడ్డి, ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుంది. జగన్ హయంలో మున్సిపల్ ఆఫీస్‌ని సైతం తాకట్టు పెట్టారు. దేశంలో ఎక్కడా లేని పాలసీని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ప్రవేశపెట్టి దివాలా తీశారు. కేంద్రానికి జగన్మోహన్ రెడ్డి లేఖ రాస్తానని అంటున్నారు, జగన్ చిట్టా మొత్తం కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉంది. మహిళలకు రక్షణ లేదని జగన్మోహన్ రెడ్డి అంటున్నాడు, కన్నతల్లికి చెల్లికి ఎంత రక్షణ కలిపించారో చెప్పాలి. సొంత చెల్లెలుపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించి ఇబ్బందుల గురి చేయించారు. జగన్ సొంత మద్యం బ్రాండ్ పెట్టి 30 వేలమంది మహిళల తాళిబొట్లు తెంపారు’అని అన్నారు.

# ఈ నెల 13న గన్నవరంలో సీఎం పర్యటన

## ●సూరంపల్లి వేదికగా ‘అన్నదాత సుఖీభవ’ మూడో విడత నిధులను విడుదల చేయనున్న సీఎం

## ●సభా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా అధికారులు



గన్నవరం (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 13వ తేదీన కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. అన్నదాత సుఖీభవ పథకం మూడో విడత నిధులను పీఎం – కిసాన్ నిధులతో కలిపి గన్నవరం మండలం సూరంపల్లి గ్రామం నుండి విడుదల చేయనున్నారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, కృష్ణా జిల్లా తెలుగుదేశంపార్టీ పార్లమెంట్ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, జాయింట్ కలెక్టర్ నవీన్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్, ఎంఆర్ఓ శివయ్య ఇతర జిల్లా అధికారులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు సమన్వయంతో పని చేసి ఎటువంటి లోటు జరగకుండా చూడాలని సూచించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో సభకు వచ్చే వారికీ మంచినీరు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అస్సాంలోని గౌహతిలో ప్రధానమంత్రి కిసాన్ నిధులను విడుదల చేసిన అనంతరం, ముఖ్యమంత్రి చంద్రబాబు గన్నవరం మండలం సూరంపల్లి వేదికగా రాష్ట్రంలోని 46.80 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 2,808 కోట్లు నేరుగా జమ చేస్తారని తెలిపారు. రైతులకు కేంద్రం ఇచ్చే రూ.2,000లకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.4,000 కలిపి మొత్తం రూ.6,000లను ఈ విడతలో అందజేస్తోందని వివరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గన్నవరం వేదికగానే చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసారని అన్నారు. గతంలో కేంద్ర మంత్రి అమిత్ షా తో కలిసి చంద్రబాబు ఎన్డీఆర్ఎఫ్ భవన ప్రారంభోత్సవానికి ఇక్కడికే వచ్చారని యార్లగడ్డ గుర్తుచేశారు. ఇప్పుడు మూడో విడత నిధుల విడుదల కోసం మళ్ళీ సూరంపల్లి గ్రామానికి రావడం యాదృచ్ఛికమని, ఇది నియోజకవర్గ ప్రజల అదృష్టమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ రైతుల సంక్షేమం కోసం భారీ నిధులు కేటాయించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలపడానికి రైతులందరూ భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# గోదావరి ప్రజలను వెంటాడుతున్న పెద్దపులి భయం

## • కాకినాడ జిల్లాలోకి ప్రవేశించిన పెద్దపులి... కదలికల్ని గమనిస్తున్న అధికారులు



కాకినాడ (చైతన్యరథం): ఏపీలోని గోదావరి తీర ప్రాంతాన్ని పెద్దపులి టెన్షన్ వెంటాడుతోంది. మొన్నటి వరకు పోలవరం జిల్లాలో సంచరించిన పులి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోకి ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం దారపల్లి అటవీ ప్రాంతం పరిసరాల్లో ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ పులి ఎటువైపు వెళు తుందనే టెన్షన్ అందరిలో మొదలైంది. పులి పయనం ప్రత్తిపాడు, శంకవరం వైపా.. అనకాపల్లి జిల్లా వైపు ఉంటుందా అనేది చూడాలి. పెద్దపులి సంచారంపై స్పెషల్ టీమ్స్ నిఘా పెంచారు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పులి సంచారంతో స్థానికులు ఆందోళనలో ఉన్నారు. ఫిబ్రవరిలో పెద్దపులి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజల్ని వణికించింది.. అటవీశాఖ అధికారులు చాకచక్యంగా పట్టుకుని విశాఖపట్నం జూకు తరలించారు. కొద్ది రోజుల తర్వాత పులిని తీసుకెళ్లి పాపికొండలు వైపు అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఆ తర్వాత మరికొన్ని రోజుల తర్వాత మళ్లీ పోలవరం జిల్లాలో ప్రత్యక్షమైంది. కొద్దిరోజులుగా పెద్దపులి పశువుల ప్రాణాలు తీస్తోంది. ఇటీవల జనావాసాల్లోకి వచ్చిన పెద్దపులి.. పొలంలో ఉన్న ఆవును, దాని దూడను చంపేసింది. అక్కడి నుంచి కంబాలపల్లి కొండల్లోకి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. మళ్లీ రాత్రి వేళలో పొలంలో చంపిన పశువుల్ని తినడానికి వచ్చింది. ఆ సమీప ప్రాంతంలో అటవీశాఖ అధికారలు పెద్దపులి పాదముద్రల్ని గుర్తించారు. ఇప్పుడు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో సంచరిస్తున్నట్లు చెబుతున్నారు. మరోసారి పులి సంచరిస్తుండటంతో అటవీశాఖ అధికారులు రంగంలోకి దిగారు. కాకినాడ, తూర్పుగోదావరి, పోలవరం జిల్లా ధికారులు కలిసి పులిని బంధించే పనిలో ఉన్నారు. వీరికి తోడు శ్రీశైలం – నాగార్జునసాగర్ టైగర్ ప్రాజెక్టుకు చెందిన స్పెషల్ టీమ్ కూడా రంగంలోకి దిగింది. పులి కదలికల్ని ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. అవసరమైనప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. ఈసారి పెద్దపులిని బోనులో బంధించే ప్రయత్నాల్లో ఉన్నారు అధికారులు. పులి సంచారంతో జనాలు వణికిపోతున్నారు.. పొలాల వైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పెద్దపులిని త్వరగా పట్టుకోవాలని కోరుతున్నారు.

# ఎన్నిసార్లు చెప్పినా... ఏలూరు జీజీహెచ్ సిబ్బంది తీరు మారదా?

- ఏలూరులో శిశువు మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోండి
- ఆర్.ఎం.ఓకు మంత్రి సారథి సీరియస్ వార్నింగ్
- ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై మంత్రి పార్థసారథి సీరియస్



ఏలూరు (చైతన్యరథం): ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి శిశువు మృతిచెందిన ఘటనపై రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార మరియు పౌరసంబంధాలశాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి సీరియస్ అయ్యారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్ల పట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగోలేదని అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో బిజీబిజీగా ఉన్న మంత్రికి ఏలూరు జీజీహెచ్‌లో జరిగిన విషయం తెలిసిన వెంటనే ఘటనపై ఆరాతీశారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన సందర్భంలో జాగ్రత్తగా ఉండాలని, పేషెంట్లను జాగ్రత్తగా చూసుకోవాలని ఎన్నిసార్లు చెప్పినా ఏలూరు జీజీహెచ్ సిబ్బంది తీరులో ఏమాత్రం మార్పు రాకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఏలూరు జీజీహెచ్ ఆర్.ఎం.ఓపై మండిపడ్డారు. తాజాగా నూజివీడు నియోజకవర్గం, ముసునూరు మండలం, గోపవరం గ్రామానికి చెందిన మహిళ నాగలక్ష్మి డెలివరీ నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌లో చేరారు. నాగలక్ష్మికి డెలివరీ చేయాల్సిన డాక్టర్ అథియా డెలివరీ డేట్ ఇంకా రాలేదనే కారణంతో డెలివరీ ఆలస్యం చేశారని, దీంతో శిశువు మృతిచెందిందని నాగలక్ష్మీ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై ఏలూరు జీజీహెచ్ ఆర్.ఎం.ఓకు మంత్రి కొలుసు పార్థసారథి ఫోన్ చేసి ఘటనపై ఆరా తీశారు. శిశువు చనిపోయిన విషయాన్ని నాగలక్ష్మి కుటుంబ సభ్యులకు చెప్పకుండా దాచి, బాధ్యత లేకుండా వెళ్లిపోవడం ఏంటని నిలదీశారు? గతంలోనూ నూజివీడు నియోజకవర్గానికి చెందిన వారి విషయంలోనూ ఏలూరు జీజీహెచ్ సిబ్బంది అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారని మంత్రి మండిపడ్డారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని, తనకు నివేదిక ఇచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్.ఎం.ఓను మంత్రి పార్థసారథి ఆదేశించారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృత్తం అయితే ఎవర్నీ సహించేది లేదని తేల్చిచెప్పారు.

# మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**●కాకినాడ టీడీపీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



కాకినాడ (చైతన్యరథం): మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపదన యోజన పథకం ద్వారా సముద్రంలో చేపల వేట చేయు మత్స్యకారులకు సబ్సిడీపై మంజూరి అయిన బోటు ఇంజన్లు మరియు గూడ్స్ ఆటోను బుధవారం జగన్నాధపురం శాసనసభ్యులు స్వగృహం నందు నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు, మత్స్యకార నాయకులు నాగిడి నాగేశ్వరరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ... సముద్రంలో చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్న మత్స్యకార కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక తోడ్పాటు అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, మత్స్యకారులు నూతన సాంకేతిక పరిజ్ఞానమును ఉపయోగించుకొని చేపల ఉత్పత్తిని పెంచి ఆర్థికంగా ఎదగాలనే దృఢ సంకల్పంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశ్యమని, దానిలో భాగంగానే నేడు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా 40% సబ్సిడీపై ఇంజన్లు మరియు మూడు చక్రాల వాహనం (ఆటో) అందించడం జరిగిందని, కోపనాతి దేవరాజు, వంక రంగరాజు, కోపనాతి రాజు, తెనాలి రమణ లకు సుమారు 1,33,280 రూపాయల విలువ చేసే ఇంజన్ మరియు 3,13,280 విలువచేసే ఆటో రాగిత ఈస్టర్ రాజీలకు అందజేయడం జరిగిందని తెలిపారు.

# తిరుమల తరహాలో వాడపల్లి ఆలయ అభివృద్ధి

**● రూ.1.35 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



వాడపల్లి (చైతన్యరథం): తిరుమల తరువాత మరో తిరుమల తరహాలో కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు తగినట్లుగా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు. బుధవారం ఆయన ఆలయం వద్ద జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో దేవస్థానం పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సభ్యులు, దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.రూ. 1.25 కోట్లతో నిర్మించనున్న స్టెయిన్ లెస్ స్టీల్ క్యూలైన్ల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఆలయంలో రూ. 10లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ను ప్రారంభించారు.కరూర్ వైశ్యా బ్యాంకు వారు దేవాలయానికి అందించిన దర్పనం, లడ్డూ టిక్కెట్లను జారీ చేసే టిక్కెట్ మిషన్ ను ప్రారంభించారు. పుష్కర ఘాట్‌ను, కోనేరు అభివృద్ధి పనులతో పాటు, వకుళమాత అన్నదాన భవన నిర్మాణ పనులను, ఆలయం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన గడువు లోపుగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు శనివారాలు, ఏడు ప్రదక్షిణలు ఏడేడు జన్మల పుణ్యఫలం అంటూ లక్షలాదిగా తరలి వస్తున్న భక్తులకు తగినట్లుగా సౌకర్యాలు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్యూలైన్లు పెంచడానికి క్యూలైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. పార్కింగ్ కేంద్రానికి వెళ్ళడానికి రూ.50లక్షల ఎమ్మీఎన్ఆర్జీఎస్ నిధులతో రహదారి నిర్మాణం జరిగిందని తెలిపారు. దానికి కొనసాగింపుగా పార్కింగ్ ఏరియా నుంచి ఏటిగట్టు వరకూ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టినట్లు తెలిపారు. వకుళమాత అన్నదాన భవనం త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కోనేరు పనులు, రథం షెడ్డు పనులు పూర్తవుతున్నాయని అన్నారు.8 ఎకరాలు పార్కింగ్ స్థలం శాండ్ ఫిల్లింగ్ పూర్తయిందని, త్వరలోనే గ్రావెల్ ఫిల్లింగ్ చేయనున్నట్లు తెలిపారు. రూ. 12 కోట్లతో శ్రీనివాసం పేరుతో 54 రూములు, 4 డార్మెటరీలు నిర్మాణానికి త్వరలో దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మరొక డార్మెటరీ నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. టూరిజం శాఖ సహకారంతో 18 టెన్సిల్ షెల్టర్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రసాద్ స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. శ్రీనివాసం 2 కోసం టీటీడీని సంప్రదిస్తున్నామని తెలిపారు.

# ప్రతి రంగంలోనూ సత్తా చాటుతున్న మహిళలు

**●తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు... పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రతి రంగంలోనూ మహిళలు సత్తా చాటుతున్నారని పలువురు వక్తలు అన్నారు. తెలుగు మహిళల ఆధ్వర్యంలో స్టేడియం రోడ్డులోని అల్యూమినియం అసోసియేషన్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నగర తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ అధ్యక్షతన పార్లమెంటరీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు కప్పల వెలుగు కుమారి, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ తురకల నిర్మల, నగర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ద్వారా పార్వతి సుందరి నేతృత్వంలో, నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు సారధ్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ... నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ సత్తా చాటుతున్నారని, ఆనాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు నాయుడు, లోకేష్ మహిళల అభ్యున్నతి కోసం ఎంతో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నామని అన్నారు. నగరంలో చీకట్ల వాతావరణం లేకుండా రూ.80 లక్షల రూపాయలతో 1300 విద్యుత్ లైట్లు వేయించామన్నారు.

**రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ...** రానున్న రోజుల్లో ఆడపిల్లలకే బంగారు భవిష్యత్తు ఉందని బాలికలను, మహిళలను ప్రోత్సహించాలన్నారు.

**మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ...** దేశం పార్టీలో ముఖ్యం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లోకేష్‌లు మహిళల పక్షపాతిగా వారి అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని, మహిళలందరూ మహిళలందరూ వారికి మద్దతుగా నిలవాలని కోరారు.

**గన్ని కృష్ణ మాట్లాడుతూ...** రానున్న రోజుల్లో ఎమ్మెల్యేలుగా నిలిచేందుకు సంసిద్ధం కావాలని మీ శక్తి యుక్తులు పెంపొందించుకోవాలని అన్నారు.

**కల్తీ పాల మృతులకు నివాళులు :**

కాగా ఇటీవల చోటు చేసుకున్న కల్తీ పాల ఘటనలో మృతి చెందిన 11 మంది ఆత్మకు శాంతి చేకూరాలంటూ వేడుకలు ప్రారంభానికి ముందుగా నివాళులర్పించారు. వారి కుటుంబాకు మనోధైర్యం ప్రసాదించాలని దేవుడిని వేడుకుని మృతుల కుటుంబాల సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా బాలికలు నువ్వు కోలాటం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నగరంలోని విద్యా సంస్థలకు చెందిన పలు క్రీడ అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ నగరానికి వన్నె తెచ్చిన బాలిక క్రీడాకారులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, నగర తొలి మహిళ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మతో పాటు పలువురు ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించి నగదు బహుమతి అందజేశారు.

# రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం



తుని (చైతన్యరథం): రైతాంగం అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, వైసీపీ పాలనలో దోపిడికి గురైన వేలాది ఎకరాలను కబ్జా కోరల నుంచి తొలగించి అర్హులైన రైతులకు అందిస్తున్నామని రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలు పంపిణీతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే యనమల దివ్య వ్యాఖ్యానించారు. బుధవారం తేటగుంట క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సిహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన 114 మందికి కవలపాడు గ్రామానికి చెందిన, 292 రైతులకు పాసుపుస్తకాలు అందజేశారు. రైతు శ్రేయస్సుకు పాసు పుస్తకాల్లో సర్వహక్కులు కల్పించడం జరిగిందని ఆమె రైతులకు వివరించారు. ఈసందర్భంగా యనమల దివ్య మాట్లాడుతూ... రైతుకు పూర్తి భద్రత కల్పించేందుకు డిజిటలైజేషన్ చేసి పాసుపుస్తకాలను రూపొందించడం జరిగిందన్నారు. రైతాంగం అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అవిరళ కృషి చేస్తుందని, భూములకు పూర్తి హక్కు కల్పించడంతో పాటు వ్యవసాయరంగానికి పూర్తి తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాదరావు, ఎస్ అన్నవరం సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి రామలింగేశ్వరరావు, అప్పన రమేష్, చిటికెల శ్రీనివాసరావు, సుర్ల బోడయ్య, జక్కాన రామునాయుడు, పోతల రాంబాబు, గంట్ల సత్యనారాయణ, తమరాన సత్యనారాయణ, తమరాన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్దాలుగా సేవా తత్పరుల నిలయం గుడివాడ

●ధార్మిక సంస్థల సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ



గుడివాడ (చైతన్యరథం): శతాబ్దాలుగా ప్రాముఖ్యత గాంచిన గుడులకే కాకుండా, సేవా తత్పరులకు నిలయం గుడివాడ అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మహనీయుల స్ఫూర్తితో మనందరం ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. గుడివాడ పట్టణంలోని దేవాదాయ శాఖ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం పాల్గొన్నారు. ముందుగా మార్కెట్ సెంటర్‌లోని శ్రీ ఘంటసాల నాగభూషణం అన్నదాన సత్రం ఆధ్వర్యంలో 50 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి 2000 చొప్పున.... లక్ష రూపాయల స్కాలర్‌షిప్ నగదును ఎమ్మెల్యే రాము పంపిణీ చేశారు. అనంతరం మెయిన్ రోడ్డులోని శ్రీ అహింసా సాంప్రదాయ సేవా హాస్పటల్ ఆధ్వర్యంలో 200 మంది గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం నిమిత్తం ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున... రెండు లక్షల సహాయ నగదును ఎమ్మెల్యే రాము పంపిణీ చేశారు.

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే రాము మాట్లాడారు.... గుడివాడలో దాతలకు కొదవలేదని, శతాబ్దాల నుండి ఎందరో సేవా తత్పరులు ప్రజలకు మంచి చేసే అనేక కార్యక్రమాలను నిర్వహించారని అన్నారు. నాడు వారు నెలకొల్పిన దారితీత సంస్థల ద్వారా ఏళ్ల గడుస్తున్నా ప్రజలకు సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి అంటే వారి ఈ ముందు చూపుకు నిదర్శనం అన్నారు.మంచి ఆలోచనలతో వారు చేసిన సేవలు స్ఫూర్తితో మనందరం ముందుకు సాగుదాం అన్నారు.నేడు స్కాలర్‌షిప్పు అందుకున్న విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, మంచి పౌరులుగా ఎదగాలన్నారు. భగవంతుని ఆశీస్సులతో గర్భిణీ సోదరీమణులు పండంటి బిడ్డలకు జన్మనివ్వాలని ఆకాంక్షిస్తూ, వారందరికీ ఎమ్మెల్యే రాము ఆశీస్సులు అందించారు. మంచి ప్రభుత్వం ఉంటే ప్రజలకు ఎంత మంచి కార్యక్రమాలు జరుగుతాయో నేడు రాష్ట్రంలో చూస్తున్నామన్నారు. జననాల రేటు తగ్గిన నేపథ్యంలో, మారుతున్న ప్రపంచీకరణ దృష్టిలో ఉంచుకొని సీఎం చంద్రబాబు ఇటీవల ప్రవేశపెట్టిన ఒకరు వద్దు.. ఇద్దరు ఒకే... ముగ్గురు ముద్దు అనే కొత్త పాలసీపై ప్రజలు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే రాము సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అహింసా సేవా హాస్పిటల్ ఈవో కందుల గోపాలరావు, దేవాదాయ శాఖ తనిఖీ అధికారి సుధాకర్, ఘంటసాల సత్రం చైర్మన్ గంటసాల అరవింద్, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, టీడీపీ నాయకులు గోకవరపు సునీల్, చేకూరు జగన్మోహన్రావు, పంద్రాజు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం

●అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణలో జాతీయస్థాయిలో ఏపీ ప్రతిష్ఠ పెంచారు

●సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీచేసి... మీడియాతో మాట్లాడిన మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): జగన్ ఐదేళ్ల విధ్వంసం నుంచి ప్రజలను, రాష్ట్రాన్ని గట్టెక్కించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, జాతీయస్థాయిలో ఏపీ ప్రతిష్ఠ పెంచడంతో పాటు, రాష్ట్రప్రజలకు ధైర్యం, నమ్మకం కల్పించారని, కూటమిప్రభుత్వంలో ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగా గుండెలపై చేయి వేసుకొని నిశ్చింతగా ఉన్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 44 మంది లబ్ధిదారులకు రూ.30.39 లక్షల విలువైన సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన అనంతరం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్యసేవలు కాకుండా ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా రూ.14.50 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం అర్హులకు అందచేసినట్టు ప్రత్తిపాటి చెప్పారు.

**జగన్ విధ్వంసం నుంచి ప్రజల్ని రాష్ట్రాన్ని చంద్రబాబు గట్టెక్కించారు**

పనిచేసే ప్రభుత్వం ఉంటే ప్రజలకు ఎలాంటి కష్టాలు రావనేందుకు ఇదే నిదర్శనమన్న ప్రత్తిపాటి, గత ఐదేళ్లలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ భయంగా జీవించారని, జగన్ విధ్వంసం నుంచి ప్రజల్ని, రాష్ట్రాన్ని గట్టెక్కించిన చంద్రబాబు, వారికి ధైర్యాన్నిచ్చి, తానున్నాన్న అనే నమ్మకం, భరోసా కల్పించారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. 20 నెలల్లోనే రాష్ట్రాన్ని వికాసం దిశగా, తిరుగులేని ప్రగతి వైపుగా నడిపిస్తున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు, పెట్టుబడుల ఆకర్షణలో ఏపీకి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకే దక్కుతుందన్నారు.

**కొండవీడు అభివృద్ధి, మైనారిటీ బాలికల పాఠశాల నిర్మాణం, ఎత్తిపోతల పథకాలపై సీఎంతో మాట్లాడాను**

మంగళవారం ముఖ్యమంత్రితో జరిగిన పల్నాడు జిల్లా అభివృద్ధి సమావేశంలో పలు నియోజకవర్గ అభివృద్ధి అంశాలు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రత్తిపాటి చెప్పారు. కొండవీడు అభివృద్ధి, మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, ప్రధాన లింకురోడ్ల నిర్మాణం సహా, పలు సమస్యలను ముఖ్యమంత్రికి విన్నవించగా, వచ్చే ఏడాది..రెండేళ్లలో అన్నీ ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేద్దామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చినట్టు ప్రత్తిపాటి తెలియచేశారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

●విజయవాడ 18వ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్



విజయవాడ (చైతన్యరథం): ప్రజా సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కరించడానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. యుద్ధ ప్రభావం రాష్ట్రంలోని ప్రజలపై పడకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. బుధవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 18వ డివిజన్, రాణిగారి తోట తమ్మిన పోతురాజు వీధి పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా కార్పొరేషన్‌లోని ఆయా విభాగాల అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి రోజూ నియోకవర్గంలో స్వయంగా పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకొని, వాటిని సంబంధింత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి వాటిని పరిష్కరించేలా చేస్తున్నామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ప్రతి శుక్రవారం తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతిప్రతాలను తీసుకుని పరిష్కరిస్తున్నానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యుద్ధ ప్రభావం రాష్ట్రంలోని ప్రజలపై పడకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని చెప్పారు. కేంద్రం నుంచి వస్తున్న సమాచారంపై అధికారులతో సమీక్షలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు ఏవిధమైన ఇబ్బంది కలగకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో గ్యాస్ వినియోగదారులకు ఏవిధమైన ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టామన్నారు. యుద్ధం జరుగుతున్న దేశాల్లో ఉన్న తెలుగు ప్రజలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో వారి స్వస్థలాలకు తీసుకురావడానికి కూడా అన్ని చర్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, డెప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.

# ఎంపీ కేశినేని శివనాథ్‌ను విమర్శించే నైతిక అర్హత దేవినేని అవినాష్‌కు లేదు

●టీఎన్‌టీయూసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్



విజయవాడ (చైతన్యరథం): అత్యంత ప్రజాదరణతో 2.80లక్షల ఓట్లకు పైగా మెజార్టీతో విజయవాడ పార్లమెంటు సభ్యునిగా గెలిచిన ప్రజా నాయకులు కేశినేని శివనాథ్ ( చిన్ని) అని టిఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్ అన్నారు. అటువంటి నాయకుడు ఎంపీ కేశినేని శివనాథ్ గురించి మాట్లాడే నైతిక అర్హత వైసిపి పేటీఎం బ్యాచ్ నాయకుడు దేవినేని అవినాష్‌కు లేదన్నారు. పరుచూరిప్రసాద్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.... ఎంపీ కేశినేని శివనాథ్‌పై అవినాష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. విజయవాడ నగరంలో దౌర్జన్యాలు, దోపిడీలు, కబ్జాలకు పేర్గాంచిన కుటుంబం దేవినేని అవినాష్ కుటుంబమన్నారు. దోచుకోవడానికి, దాచుకోవడానికి రాజకీయ భిక్ష పెట్టిన టిడిపిని వదిలి వైసిపిలో చేరిన అవినాష్ వైసిపి ప్రభుత్వ 5 ఏళ్ల కాలంలో చేయని అవినీతి లేదన్నారు. మట్టి తరలింపు మొదలుకుని సెటిల్‌మెంట్లు వరకు తన కార్యాలయంనే అడ్డాగా మార్చాడన్నారు. ఏలూరు రోడ్డులో ఎన్ని స్థలాలు దేవినేని అవినాష్ కుటుంబం కబ్జా చేసిందో వియవాడ వాసులందరికీ తెలుసు అని, దేవినేని అవినాష్ కుటుంబ రౌడీయిజానికి భయపడే మూడు సార్లు ఎన్నికల్లో పోటీ చేసినా అవినాష్‌ను ఒక్కసారి కూడా ప్రజలు గెలిపించలేదన్నారు. తన స్థాయిని మరిచి దేవినేని అవినాష్ మాట్లాడుతున్నాడని, జగన్ మోహన్‌రెడ్డి మెప్పుకోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ వచ్చినపుడు స్వాగతం పలకడం, వెళ్లేటప్పుడు సెండాఫ్ ఇవ్వడం డిపార్చర్, ఎరైవల్‌గా దేవినేని అవినాష్ (డీఏ) సరిపోతాడని, ఎన్నటికీ ప్రజా నాయకుడు కాలేడన్నారు. దేవినేని అవినాష్ ఇప్పటికైనా తన తప్పులు తెలుసుకుని నోరు అదుపులో పెట్టుకుని నడుచుకోవాలని హితవు పలికారు.

# పల్నాడు జిల్లా అభివృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష

●జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సహా ఏడుగురు ఎమ్మెల్యేలు హాజరు



పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల శాసనసభ్యులు, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తోపాటు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, ఎస్పీ బి కృష్ణారావులతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించారు. పల్నాడు జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షణ, జిల్లా సమగ్ర అభివృద్ధి, నియోజకవర్గాల వారీగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సీఎం సమీక్షించారు. ప్రధానంగా పల్నాడు జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచేందుకు ప్రజాప్రతినిధులు అధికారులు సంయుక్తంగా పనిచేసే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీఎం సూచించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఎమ్మెల్యేలు పనితీరును మరింత మెరుగుపరుచుకుని ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా వినుకొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై సీఎం చంద్రబాబుకు జీవి ఆంజనేయులు వివరించారు. సీఎం సమీక్ష అనంతరం జీవి ఆంజనేయులు మాట్లాడుతూ పల్నాడు జిల్లా అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయని, జిల్లా అభివృద్ధికి సీఎం సహకారాలు అండ దండలు అందిస్తున్నారని జీవీ ఆంజనేయులు తెలిపారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# జువ్వలదిన్నెకు నేడు మంత్రి నారా లోకేశ్

**ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కావ్య, ఎమ్మెల్సీ బీద, భూమిరెడ్డి కృష్ణపట్నం మత్స్యకార దంపతులకు రూ.1.20 కోట్ల డీప్ సీ ఫిషింగ్ బోటు అందజేత**




కావలి (చైతన్యరథం): బోగోలు మండలం జువ్వలదిన్నెలో గురువారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పర్యటనకు సంబంధించి నిర్వహించనున్న కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం ప్రజాప్రతినిధులు సమీక్షించారు. కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీర ప్రాంతాన్ని సందర్శించి వేదిక, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్, ప్రజల సౌకర్యాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మత్స్యకార యోజన కింద ముత్తుకూరు మండలం కృష్ణపట్నంకు చెందిన ఆవుల వరలక్ష్మి, బాబు దంపతులకు రూ.1 కోటి 20 లక్షల విలువైన ఆధునిక డీప్ సీ ఫిషింగ్ బోటును అందజేశారు. పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.48 లక్షల సబ్సిడీ లభించగా, మిగిలిన రూ.72 లక్షలను లబ్ధిదారులు స్వంతంగా సమకూర్చుకున్నారు. ఈ బోటులో 15 నుంచి 20 రోజులపాటు సముద్రంలోనే వేట సాగించేందుకు అవసరమైన వసతులు, చేపలను నిల్వ ఉంచేందుకు శీతలీకరణ సదుపాయం, జీపీఎస్, వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థ, ఆధునిక వేట పరికరాలు ఏర్పాటు చేయబడ్డాయి. దీని ద్వారా సుమారు 15, 20 కుటుంబాలకు ఉపాధి లభించనున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆదాయ వృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, సంక్షేమ పథకాల అమలులో ముందంజలో ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ శాంతి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, కొండూరు పోలిశెట్టి తదితరులు, స్థానిక నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.



# 240 అభివృద్ధి పనులకు 22న ప్రారంభోత్సవాలు

**సమీక్షించిన టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): ఎమ్మెల్యే కార్యాలయంలో 27 కోట్ల రూపాయలతో 240 పనుల ప్రారంభోత్సవాల పై కూటమి నాయకులు మరియు కార్యకర్తలతో ్నాహక సమావేశాన్ని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నిర్వహించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమన్నారు. కూటమి నాయకులు అందరూ కలసికట్టుగా పనిచేసి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కలిసిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కూటమి నాయకులను ప్రతి కార్యక్రమంలో భాగస్వాములుగా చేస్తున్నారు. జనసేన నాయకులు సయ్యద్ అజాద్ జమీర్. పై కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి

**హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**



కావలి (చైతన్యరథం): క్యాన్సర్ మహమ్మారి నుంచి భవిష్యత్ తరాలను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి గారు పేర్కొన్నారు. కావలి పట్టణంలోని రాజీవ్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు సంబంధించిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 సంవత్సరాలు పూర్తి చేసి 15 సంవత్సరాలు లోపు ఉన్న బాలికలకు మాత్రమే ఈ వ్యాక్సిన్ ఉచితంగా అందజేయబడుతుందని తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం ఒక్కొక్క వ్యాక్సిన్‌పై రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.4,000 వరకు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రతి ఆడబిడ్డ భవిష్యత్తు సురక్షితంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో జీవనశైలిలో మార్పులు, కలుషిత ఆహారం, గాలి, నీరు, శరీర రోగనిరోధక శక్తి తగ్గుదల వంటి కారణాలతో కొత్త కొత్త వ్యాధులు పెరుగుతున్నాయని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు అరుదుగా కనిపించిన హార్ట్ స్ట్రోక్‌లు, బ్రెయిన్ స్ట్రోక్‌లు, వైరల్ వ్యాధులు ఇప్పుడు సాధారణమయ్యాయని పేర్కొన్నారు. కరోనా వంటి మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం క్యాన్సర్ కేసులు కూడా పెరుగుతున్నాయని, ముఖ్యంగా మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ అధికంగా కనిపిస్తోందని అన్నారు. నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి అనేక రకాల క్యాన్సర్లు వైద్యరంగంలో నమోదవుతున్నాయని వివరించారు. దాదాపు 500 రకాల క్యాన్సర్లు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారని పేర్కొన్నారు. సర్వైకల్ క్యాన్సర్ ప్రధానంగా మహిళల గర్భాశయాన్ని ప్రభావితం చేస్తుందని, భవిష్యత్తులో తల్లితనానికి ఇబ్బందులు కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. ఆడబిడ్డల ఆరోగ్యం కాపాడడం సమాజ బాధ్యత అని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని వివరించారు. కావలి పట్టణంలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్ లలో, గ్రామీణ ప్రాంతాల ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్, సీహెచ్సీల లో ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి బాలిక తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని పిలుపునిచ్చారు. పాఠ్యపుస్తకాలతో పాటు జీవన నైపుణ్యాలపై కూడా అవగాహన అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని యజ్ఞంలా తీసుకుని ప్రతి ఆడబిడ్డ భవిష్యత్తు రక్షణగా ఉండేలా చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కావలి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేసి ప్రతి అర్హత కలిగిన బాలిక వ్యాక్సిన్ పొందేలా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ బ్రిజిత, అర్బన్ సెంటర్ వైద్యులు డాక్టర్ వివి మేఘనాథ్ చౌదరి, టీడీపీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, పలువురు వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక టీడీపీ, జనసేన నాయకులు, బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భూమన మద్దతుతోనే వైసీపీ మూకల దందా

**కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి టీడీపీ నేతల ఫిర్యాదు**



తిరుపతి (చైతన్యరథం): తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌కు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఫిర్యాదు చేశారు. టీటీడీ పరిపాలనా భవనం వద్ద నిబంధనలకు విరుద్ధంగా, ఉద్దేశపూర్వక దుష్ప్రచారంతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ధార్మిక సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించిన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవమైన వేంకటేశ్వరస్వామి వారి సేవలో ఉండే అత్యున్నత ధార్మిక సంస్థ పాంగణంలో బుధవారం జరిగిన ఘటన అత్యంత విచారకరమన్నారు. వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి ప్రోద్బలంతో ఆపార్టీ కార్యకర్తలు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కనిపించడం లేదంటూ నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. కేవలం రాజకీయ దురుద్దేశ్యంతో ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తితోపాటూ పవిత్రమైన సంస్థపై ఇటువంటి అసత్య ప్రచారాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. టీటీడీ చైర్మన్ ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరించిన వారిపై పరువు నష్టం సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని కోరారు. తక్షయ ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఆర్ పి శ్రీనివాసులు, గంజి సుధాకర్ రెడ్డి, జగ్గా వెంకట్ రెడ్డి, రవి శేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నాగ ప్రతాప్. ముని తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు

# పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి

**కేంద్రమంత్రికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి**



నెల్లూరు (చైతన్యరథం): అనేక వనరులు, అవకాశాలు ఉన్న నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక పురోగతికి సహాయ సహకారాలు అందించాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ మేరకు ఢిల్లీలోని కేంద్రమంత్రి ఛాంబర్‌లో ఆయనతో భేటీ అయిన సందర్భంగా జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికున్న అవకాశాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆయనతో మాట్లాడారు. నెల్లూరు జిల్లా సమగ్ర అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు. పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే లైన్లు అన్ని అందుబాటులో ఉన్న నేపథ్యంలో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత ఇచ్చి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

# 2027 మార్చి నాటికి మడకశిరలో రైలు కూతపెట్టాలి

## కాంట్రాక్టర్లకు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆదేశం



మడకశిర, (చైతన్యరథం): మడకశిరలో 2027 మార్చి నాటికి రైలు కూత వినిపించాలని, దీనికి అనుగుణంగా మడకశిర రైల్వే లైను పనులను శరవేగంగా పూర్తిచేయాలని రైల్వే కాంట్రాక్టర్లను మడకశిర ఎమ్మెల్యే టీటీడీ పాలకమండలి సభ్యుడు శ్రీసత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు రాజు ఆదేశించారు. రాయదుర్గం, తుముకూరు రైల్వే లైనును మడకశిరకు అనుసంధానించే ప్రక్రియ, దాని పనుల పురోగతిని మడకశిర ఎమ్మెల్యే పర్యవేక్షించారు. పనులు జరుగుతున్న తీరుపై కాంట్రాక్టర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మడకశిర నియోజకవర్గానికి రైల్వే లైను కల అని వివరించారు. మడకశిర నియోజకవర్గ ప్రజలకు రైలును 2027 మార్చి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మడకశిర రూరల్ కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవితను పలువురు సందర్శకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు కలిశారు. సందర్శకులు అందజేసిన వినతి పత్రాలను పరిశీలించారు. ఈ నెల 13న మొల్ల జయంత్యోత్సవంలో పాల్గొనాలని కోరుతూ రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ మంత్రి సవితకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

# హెచ్‌పీ వ్యాక్సిన్‌తో మహిళకు రక్షణ

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు (చైతన్యరథం): బుచ్చిరెడ్డి పాలెం మండలం జొన్నవాడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నివహించిన హెచ్పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యాధి వచ్చాక చికిత్స కోసం ఇబ్బంది పడటం కంటే.. రాకుండా ముందుగానే నివారించుకోవడం ఉత్తమమని సూచించారు. ముఖ్యంగా ఆడవారిని వేధించే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యాక్సిన్ ఒక గొప్ప రక్షణ కవచమని ఆమె పేర్కొన్నారు. మూడు నెలల పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఈ కార్యక్రమం జరుగుతుందని 14 ఏళ్లు పూర్తయిన ఆడపిల్లలందరూ హెచ్‌పీవీ టీకా తీసుకోవడానికి అర్హులని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్యాన్సర్ రహిత సమాజం కోసం అందరూ సహకరించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వి సుజాత, ఇూఎం వ్యాక్సినేజేషన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అమరేందర్ నాథ్ రెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, జొన్నవాడ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అహ్మద్ బాబు, డాక్టర్ వినయ్ కుమార్ లతో పాటు బుచ్చిరెడ్డి పాళెం మండల టీడీపీ, కూటమి నాయకులు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నూర్‌కు ప్రాణాపాయం లేదు

## ఆసుపత్రిలో పరామర్శించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురము (చైతన్యరథం): నూర్ మహమ్మద్ ఆత్మహత్యాయత్నం ఘటనపై ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందించారు. డివిజన్ లోని కొంతమంది పార్టీ నాయకులతో వ్యక్తిగత విషయాలపై గొడవలతో మనస్తానికి గురయ్యాడన్నారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్లి నూర్ ను పరామర్శించారు. నూర్‌కు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు ఎమ్మెల్యేకి తెలిపారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. నూర్ తనని ఇఫ్తార్ విందుకు ఆహ్వానించాడని సమయాభావం వల్ల వెళ్లలేకపోయానని ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. డివిజన్లో నాయకులు మధ్య గొడవ జరిగిందని, ఇది చిన్న విషయం అయినా నూర్ మనస్తాపంతో ఆత్మహత్యాయత్న చేసుకున్నాడని పేర్కొన్నారు. దీనిని కొందరు భూతద్దంలో చూపాలని చూస్తున్నారన్నారు. రాజకీయ నిరుద్యోగులు ఇలాంటి వాటిని రాజకీయం చేస్తున్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మండిపడ్డారు.



# సర్వేపల్లి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



ముత్తుకూరు (చైతన్యరథం): సర్వేపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం ముత్తుకూరులో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలిసి ఆయన విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు భారీగా సీఎస్ఆర్ నిధులను సమీకరించి నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, మంత్రి లోకేష్ చేపట్టిన 3132 కిలోమీటర్ల యువగళం పాదయాత్ర స్ఫూర్తితో, అదే సంఖ్యలో విద్యార్థులకు సైకిళ్లు అందించాలని సంకల్పించినట్లు తెలిపారు. సెయిల్ కంపెనీ సహకారంతో 1841 హీరో సైకిళ్లను సమకూర్చుకోగా, ప్రస్తుతం ముత్తుకూరు మండలంలోని 6 హైస్కూళ్లలో 8, 9 తరగతులు చదువుతున్న 351 మంది విద్యార్థినులకు వీటిని అందజేశామన్నారు. దూర భారాల వల్ల బాలికలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మరో 1300 సైకిళ్లను త్వరలోనే ఇతర విద్యార్థులకు పంపిణీ చేస్తామని ప్రకటించారు.

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు పరిశ్రమల వల్ల కలిగే కాలుష్యాన్ని భరిస్తున్న స్థానిక ప్రజల కోసం కంపెనీలు తమ లాభాల్లో 2 శాతం నిధులను ఇక్కడే ఖర్చు చేయాలని సోమిరెడ్డి కోరారు. బీపీసీఎల్ నిధులు రూ. 7 కోట్లతో ముత్తుకూరు హైస్కూల్‌ను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పవర్ గ్రిడ్ నిధులు రూ. 3.80 కోట్లతో వెంకటాచలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. అదానీ పోర్టు ద్వారా ముత్తుకూరులో స్టేడియం, శ్మశాన వాటిక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై ప్రశంసల వర్షం కురిపించారు. “రాజకీయాల కోసం ఆస్తులు అమ్ముకున్న అరుదైన కుటుంబం సోమిరెడ్డిదన్నారు. అల్లీపురంలోని వారి ఆస్తులు అమ్మకుండా ఉంటే వాటి విలువ రూ. 300 కోట్లు ఉండేది. పదవి ఉన్నా లేకున్నా రైతుల కోసం గొంతెత్తే ఏకైక నాయకుడు ఆయనే” అని కొనియాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులే మొదటి హీరోలని కోటంరెడ్డి పేర్కొన్నారు. ప్రతిరోజూ తల్లిదండ్రులకు పాదాభివందనం చేయడం వల్ల దైవదర్శనంతో సమానమైన ఫలితం ఉంటుందని హితవు పలికారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని గుర్తుచేశారు. కార్యక్రమానికి ముందు, నాబార్డు నిధులు రూ. 1 కోటితో నిర్మించిన కప్పలదొరువు, ఈదులవారిపాళెం రోడ్డును ఇరువురు ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు మండల టీడీపీ నేతలు, విద్యార్థినులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న మంత్రి డాక్టర్ నారాయణ

నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని 5వ డివిజన్ సత్యనారాయణపురం ప్రాంత ప్రజల ఏళ్ల నాటి భూ సమస్యకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ శాశ్వత పరిష్కారం చూపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో సర్వే నెంబర్ 308 భూములు 22 (నిషేధిత జాబితా) లో చిక్కుకుపోయి, రిజిస్ట్రేషన్లు కాక, బ్యాంకు రుణాలు అందక ఇబ్బంది పడుతున్న వందలాది కుటుంబాలకు మంత్రి గారు కొండంత అండగా నిలిచారు. ప్రత్యేక చొరవతో ఈ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించి, రిజిస్ట్రేషన్లకు అనుమతినిస్తూ ప్రభుత్వ జీవో తీసుకురావడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ ఇంటింటికీ వెళ్లి ఈ జీవో పత్రాలను అందజేసి, ప్రజల మొఖాల్లో చిరునవ్వులు నింపారు. చెప్పాడంటే చేస్తారంతే. మా మంత్రి నారాయణ మా కష్టాలను తీర్చారు అంటూ స్థానికులు జేజేలు పలుకుతుండగా, ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు కె. గంగాధర్, తాళ్లూరు శశికుమార్, హేమంత్, దర్శి ప్రసాద్, శ్రీరాములు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## చికాగోలో చిన్నారుల కోసం

# 'రామాయణ పెయింటింగ్' పోటీ

**చికాగో:** తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ చికాగో ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది, శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 6 నుంచి 13 ఏళ్లలోపు చిన్నారుల కోసం ప్రత్యేకంగా 'రామాయణ పెయింటింగ్' పోటీని ప్రకటించారు.

**వయో పరిమితి:** 6–9 ఏళ్లు, 10–13 ఏళ్లు విభాగాల్లో పోటీలు ఉంటాయి.

**నియమం:** రామాయణంలోని ఘట్టాలను ఆధారంగా చేసుకుని మాత్రమే చిత్రాలు గీయాలి. 11×14 అంగుళాల తెల్లని షీట్లపై కళాఖండాలను సిద్ధం చేయాలి.

**రిజిస్ట్రేషన్ గడువు:** మార్చి 15

**వీడియో సమర్పణ:** పెయింటింగ్ ప్రక్రియను వివరించే ఒక నిమిషం టైమ్–లాప్స్ వీడియోను మార్చి 30లోపు అందించాలి.

**తుది గడువు:** ఏప్రిల్ 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు పెయింటింగ్‌ను వేదిక వద్ద ఫ్రంట్ డెస్క్‌లో అందజేయాలి. ఆసక్తి గలవారు తమ సృజనాత్మకతను ప్రదర్శించేలా ఎలాంటి కాపీలు లేకుండా సొంతంగా చిత్రాన్ని రూపొందించాలని నిర్వాహకులు సూచించారు. https://www.tagc.org/upcoming-events వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. విజేతలను ఉగాది, శ్రీరామనవమి వేడుకల రోజున ప్రకటిస్తారు.

## 'టాటా' ఆధ్వర్యంలో దర్హామ్‌లో 15న

# మెగా క్రికెట్ టోర్నీ

**నార్త్ కరోలినా:** అమెరికాలోని నార్త్ కరోలినాలో ఉన్న తెలుగు వారి కోసం ట్రయాంగిల్ ఏరియా తెలుగు అసోసియేషన్ (TATA of NC) ఒక భారీ క్రికెట్ టోర్నమెంటును ప్రకటించింది. అసోసియేషన్ స్థాపించి 35ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 15న దర్హామ్ నగరంలో పోటీలు నిర్వహించనున్నారు. మెన్స్, ఉమెన్స్, 40+ విభాగాల్లో హార్డ్ టెన్నిస్‌బాల్‌తో పోటీలు జరుగుతాయి.

ప్రతి జట్టులో 8 మంది ఆటగాళ్లు ఉండాలి. మ్యాచ్‌లు 6 ఓవర్ల ఫార్మాట్‌లో జరుగుతాయి. ప్రతి జట్టుకు కనీసం రెండు మ్యాచ్‌లు ఆడే అవకాశం కల్పిస్తున్నారు. విజేతలకు ఆకర్షణీయమైన ట్రోఫీలతో పాటు భారీ నగదు బహుమతులు కూడా అందజేస్తారు.

మార్చి 15 ఉదయం 7 నుంచి రాత్రి ఏడు గంటల వరకు.

**వేదిక:** బెథెస్డా క్రికెట్ గ్రౌండ్స్ (Bethesda Cricket Grounds), 2009 S Miami Blvd, Durham, NC 27703.

పోటీలో పాల్గొనాలనుకునే జట్లు $120 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి గలవారు tinyurl.com/TATACricket2026 లింక్ ద్వారా (లేదా) పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేరు నమోదు చేసుకోవచ్చు. ఈ టోర్నీకి సన్‌టెక్ ప్రోస్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

# శంకరాభరణం... అజరామరం

- శ్రీ సాంస్కృతిక కళాసారథి ఆధ్వర్యంలో 'శంకరాభరణం-వెండితెర నవల' పుస్తకావిష్కరణ
- సింగపూర్‌లో వేడుక
- ముఖ్య అతిథిగా హాజరైన కె.విశ్వనాథ్ తనయుడు నాగేంద్రనాథ్



**సింగపూర్:** కళాతపస్వి కె.విశ్వనాథ్ అజరామర సృష్టి 'శంకరాభరణం' చిత్రం ఆధారంగా రూపొందించిన 'శంకరాభరణం–వెండితెర నవల' పుస్తకావిష్కరణ వేడుక సింగపూర్‌లో ఘనంగా జరిగింది. బర్గండీ క్రియేటివ్స్, సింగపూర్ తెలుగు సమాజం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కె.విశ్వనాథ్ తనయుడు నాగేంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. సుమారు 70 మందికి పైగా విశ్వనాథ్ అభిమానులు హాజరయ్యారు.

సంస్థ అధ్యక్షుడు రత్నకుమార్ కవుటూరు మాట్లాడుతూ... నాగేంద్రనాథ్‌తో తనకు దాదాపు పదేళ్లకు పైగా అనుబంధం ఉందని తెలిపారు. సామవేదం షణ్ముఖశర్మ 2017లో సింగపూర్ విచ్చేసిన సందర్భంగా నిర్వహించిన 'శివపదం' కార్యక్రమానికి ఆయన అందించిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని తక్కువ సమయంలో విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వీడియో సందేశాలు అందించిన పుస్తక రచయిత, ప్రముఖ దర్శకుడు, సీనియర్ డైరెక్టర్ వంశీకి, 'శంకరాభరణం' చిత్ర నిర్మాత ఏడిద నాగేశ్వరరావు తనయుడు ఏడిద రాజాకి ధన్యవాదాలు తెలిపారు.

ముఖ్య అతిథి కె.నాగేంద్రనాథ్ మాట్లాడుతూ... ఈ పుస్తకాన్ని సింగపూర్‌లో ఆవిష్కరించాలని రత్నకుమార్‌తో చెప్పగానే అతి తక్కువ సమయంలో ఇంత చక్కగా ఏర్పాట్లు చేశారంటూ అభినందించారు. 'శంకరాభరణం' చిత్రం విడుదల సమయంలో వచ్చిన ఈ పుస్తకం అప్పట్లో తెలుగు ప్రజల అభిమానాన్ని విశేషంగా పొందిందని తెలిపారు. ప్రస్తుతం పుస్తకం అందుబాటులో లేకపోవడంతో పుస్తక రచయిత, సీనియర్ డైరెక్టర్ వంశీని సంప్రదించి దీనిని పునర్ముద్రణ చేయించామని చెప్పారు. తన తండ్రి విశ్వనాథ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 19న హైదరాబాద్‌లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించగా విశేష స్పందన వచ్చిందన్నారు. 'శంకరాభరణం' గీతాలు ఆలపించడంతో పాటు చిత్రంలోని విశేషాలను చెప్పడంతో ఈ కార్యక్రమం ఆద్యంతం అచ్చ తెలుగు పండుగలా అనిపించిందని చెప్పారు.

ఈ సందర్భంగా తొలి పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి విచ్చేసిన సంస్కార భారతి అధ్యక్షుడు రమణమూర్తికి, తెలుగు సమాజం పూర్వ అధ్యక్షుడు బీవీఆర్ చౌదరి దంపతులకు, తంగిరాల రాజశేఖర్–సౌభాగ్యలక్ష్మి దంపతులకు నాగేంద్రనాథ్ మీదుగా అందజేశారు.

'శంకరాభరణం' చిత్రంలోని గీతాలను చంద్రహాస్ ఆనంద్, షర్మిల, కిరీటి దేశిరాజు, సౌభాగ్యలక్ష్మి, శేష యడవల్లి ఆలపించగా... శేషశ్రీ వీణపై ఒక గీతాన్ని వాయించి ప్రేక్షకులను అలరించారు. దర్శకుడు కె.విశ్వనాథ్‌తో ఉన్న వ్యక్తిగత పరిచయాలను పూజా కంద్రప, రామచంద్రరావు ప్రేక్షకులతో పంచుకున్నారు. చిత్రం, పుస్తక విశేషాలను వేణు రెడ్డి, రాధిక మంగిపూడి, రాంబాబు పాతూరి, శేష యడవల్లి, సుబ్బు పాలకుర్తి, కోనాల కాళీకృష్ణ తదితరులు వివరించారు.

కార్యక్రమానికి విచ్చేసిన అతిథుల కోసం రాజశేఖర్–సౌభాగ్యలక్ష్మి దంపతులు ప్రత్యేకంగా తెలుగు వంటకాలతో భోజనాన్ని సిద్ధం చేశారు. ఈ ఏర్పాట్లలో శ్రీలలిత, మాధవి పాలకుర్తి తదితరులు సహకారం అందించారు. సుబ్బు పాలకుర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించగా... రాంబాబు పాతూరి, శ్రీధర్ భరద్వాజ్, సత్య జాస్తి, రాజ్‌కుమార్ తదితరులు సహాయ, సహకారాలు అందించారు.





# ప్రవాస వనితలకు నీరాజనం

## ఎఫ్ఐఏ, ఇండియన్ కాన్సులేట్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూయార్క్‌లో మహిళా దినోత్సవ వేడుకలు






**న్యూయార్క్:** అమెరికాలో అత్యంత పురాతన, అతిపెద్ద ప్రవాస భారతీయ సంస్థ అయిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ (FIA), న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం (Indian Consulate) సంయుక్తంగా 8వ వార్షిక అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాయి. భారతీయ ప్రవాస సమాజంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మహిళా నాయకులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

**నివాళి:** కార్యక్రమం ప్రారంభంలో గతంలో అవార్డు గ్రహీత, ఇటీవలే కన్నుమూసిన రాధా సుబ్రమణ్యం జ్ఞాపకార్థం సభికులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

**మహిళా సాధికారత:** ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత కాన్సుల్ జనరల్ బినయ శ్రీకాంత ప్రధాన్ మాట్లాడుతూ... భారతదేశ పురోగతిలో మహిళా సాధికారత కీలకమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 'బేటీ బచావో–బేటీ పడావో', 'ఉజ్వల యోజన' వంటి పథకాలు మహిళల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాయని ఆయన గుర్తు చేశారు.



**ప్రముఖులకు సన్మానం:** వివిధ రంగాల్లో రాణిస్తున్న తానియా కిన్సెల్లా (NYPD ఫస్ట్ డిప్యూటీ కమిషనర్), డాక్టర్ బల్ప్రీత్ గ్రేవాల్–విర్క్ (RWJ బర్నబాస్ హెల్త్), నటి రేష్మా శెట్టి, జోడి లిన్ హెర్ష్కోజ్, మోనాలీసా శువదర్శినిలను గవర్నర్ క్యాథీ హోచుల్ పంపిన ప్రశంసా పత్రాలు, FIA సన్మాన పతకాలతో గౌరవించారు.

FIA అధ్యక్షుడు శ్రీకాంత్ అక్కపల్లి మాట్లాడుతూ... మహిళల నాయకత్వానికి, వారు సమాజంలో తెస్తున్న సానుకూల మార్పులకు తాము ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సుధీర్ పారిఖ్, FIA చైర్మన్ అంకుర్ వైద్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు. FIA ప్రధాన కార్యదర్శి సృష్టి కౌల్ నరులా వందన సమర్పణ చేశారు. పెద్ద ఎత్తున ప్రవాస భారతీయులు హాజరై వేడుకను విజయవంతం చేశారు.






# పశ్చిమాసియా ఉద్రిక్తతలపై కాంగ్రెస్ పరాచికాలు

## నిప్పులు చెరిగిన ప్రధాని నరేంద్ర మోదీ



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని ప్రధాని మోదీ మండిపడ్డారు. ఆ దేశాల్లోని ప్రవాస భారతీయుల పరిస్థితి మరింత దిగజారేలా రెచ్చగొట్టే, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేరళ పర్యటనలో భాగంగా బుధవారం ఎర్నాకుళంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "గల్ఫ్‌లోని పరిస్థితుల కారణంగా మనం ఆందోళన చెందడం సహజమే. అక్కడ లక్షలాది మంది మన భారతీయులు పనిచేస్తున్నారు. కానీ ఇక్కడ అధికారంలో ఉన్నది భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వమని మీరు గుర్తుంచుకోవాలి. మన పౌరులు విదేశాల్లో చిక్కుకున్నప్పుడల్లా వారి క్షేమం కోసం వనరులన్నీ ఉపయోగిస్తుంటాం. ఎప్పుడూ మన పౌరుల్ని ఒంటరిగా వదిలేయలేదు. ప్రస్తుత సంక్షోభంలో కూడా అవసరమైన సహాయం అందేలా చూస్తున్నాం. గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు అక్కడి మన పౌరులకు 24 గంటలూ అందుబాటులో ఉంటున్నాయి. పశ్చిమాసియాలోని మన మిత్రదేశాలు భారతీయులను జాగ్రత్తగా చూసుకుంటున్నాయి. ఈ సంక్షోభ సమయంలో కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించడం దురదృష్టకరం. ఆందోళనలు రేకెత్తించేలా హస్తంపార్టీ ఉద్దేశపూర్వకంగానే ప్రకటనలు చేస్తోంది. ఈ ప్రచారం కోసం వారు రీల్స్ కూడా చేస్తారేమో" అని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించేందుకు, మేకిన్ ఇండియాను బలోపేతం చేసేందుకు పెట్రోలియం రంగాన్ని విస్తరించడం ఎంతో కీలకమని మోదీ (ూవీ వీశీంఱ) అన్నారు. ఆ లక్ష్యంతోనే కొచ్చి రిఫైనరీ వద్ద పాలీప్రొపిలీన్ యూనిట్‌కు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. ఈ గల్ఫ్ వార్ స్వావలంబన ఆవశ్యకతను మరోసారి నొక్కి చెప్పిందన్నారు.




# కమ్ముకొస్తున్న చమురు కష్టాలు

## గ్యాస్ కొరతతో మూతపడుతున్న అన్నదాన కేంద్రాలు, హెూటళ్లు

ఇరాన్ యుద్ధం వల్ల ప్రపంచ వ్యాప్తంగా చమురు, గ్యాస్ సరఫరాకు అంతరాయం నెలకొన్న విషయం తెలిసిందే. దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని ఓవైపు కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో గ్యాస్ కొరత ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రభావం అయోధ్య ఆలయంపై కూడా పడింది. ఎల్పీజీ సిలిండర్ల కొరత కారణంగా అమావా ఆలయంలోని రామ్ రసోయీ (అన్నదాన కేంద్రం)ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ మేరకు అన్నదాన కేంద్రం వద్ద నోటీసులు అంటించారు. మరోవైపు వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబయి ఢిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. ఎల్పీజీ కొరత వల్ల ఢిల్లీ హైకోర్టులోని క్యాంటీన్ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరిణామాల నేపథ్యంలో బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు కేంద్రం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతమున్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది.

### మా హోటళ్లలో మధ్యాహ్న భోజనం నిలిపివేస్తున్నాం: ఐటీసీ

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా వంట గ్యాస్ కొరత ఏర్పడుతుండడంతో పలు ప్రాంతాల్లోని తమ హోటళ్లలో రేపటి నుంచి లంచ్, డిన్నర్ అందుబాటులో ఉండదని ప్రముఖ హోటల్ ఐటీసీ వెల్లడించింది. తాత్కాలికంగా ఈ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది.




# అమ్మా తిరిగొస్తానో లేదో!

## పశ్చిమాసియాలో యుద్ధం వేళ భారతీయులను తీసుకురావడానికి వెళ్ళిన యువ మహిళా పైలెట్

పశ్చిమాసియాలో యుద్ధం వేళ అక్కడ చిక్కుకున్న భారతీయులను తరలించేందుకు కేంద్రం ప్రత్యేక విమాన సర్వీసులు నడుపుతోంది. ఈ రెస్క్యూ మిషన్లో భాగమయ్యారు 23 ఏళ్ల యువ పైలట్ దీపికా అధానా, ఉద్రిక్తతల పరిస్థితుల్లో యూఏఈ నుంచి భారతీయులను క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చారు. ఈ మిషన్కు ముందు దీపిక తన తల్లితో మాట్లాడిన మాటలు తాజాగా బయటికొచ్చాయి. తాను మళ్లీ తిరిగొస్తానో లేదోనని ఆమె తన కుటుంబానికి చెప్పారట..! యూఏఈలో చిక్కుకున్న భారతీయులను తీసుకొచ్చేందుకు మార్చి 6న ఎయిరిండియా ఎక్స్ప్రెస్ విమానం అక్కడకు వెళ్లింది. ఆ విమానానికి పైలట్గా వ్యవహరించిన దీపికా అధానా నాటి అనుభవాన్ని మీడియాతో పంచుకున్నారు. "వాస్తవానికి ఆ రోజు విధుల్లో మా ఫ్రెండ్ ఉండాల్సింది. కొన్ని కారణాల వల్ల చివరి నిమిషంలో ఆమె స్థానంలో డ్యూటీకి వెళ్లాల్సి వచ్చింది. అప్పుడే ఇంటికి ఫోన్ చేసి అమ్మతో మాట్లాడా. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు.. మళ్లీ తిరిగొస్తానో రానో అని చెప్పా. కానీ, నా కుటుంబం అధైర్యపడలేదు. నన్ను ప్రోత్సహించి పంపించారు" అని ఆ పైలట్ గుర్తుచేసుకున్నారు.



# దేశంలోనే తొలి కారుణ్యమరణం



## వాస్తవ పరిస్థితుల దృష్ట్యా సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం

దాదాపు 13 ఏళ్లుగా కోమాలో ఉండి జీవచ్ఛవంలా మారిన 32 ఏళ్ల హరీశ్ రాణా కారుణ్య మరణం అంశంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. రాణాకు చికిత్స నిలిపివేయొచ్చని పేర్కొన్న న్యాయస్థానం.. అతడి కారుణ్య మరణానికి అనుమతి ఇచ్చింది. తన కుమారుడికి కారుణ్య మరణం ప్రసాదించాలంటూ హరీశ్ తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం తీర్పు వెలువరించింది. ఇలా దేశంలో ఓ వ్యక్తికి కారుణ్య మరణం ప్రసాదించడం ఇదే తొలిసారి. ఢిల్లీకి చెందిన 32 ఏళ్ల హరీశ్ రాణా 2013 ఆగస్టు 20న చండీగఢ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. నాలుగో అంతస్తు బాల్కనీ నుంచి కిందపడిపోవడంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. శరీరం కదలలేని స్థితికి చేరుకుంది. ప్రముఖ ఆసుపత్రుల్లో చికిత్స అందించినా, అతని ఆరోగ్యంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. అప్పటినుంచి అతడు కోమాలోనే ఉండిపోయాడు. ఇన్నేళ్లుగా అతడి తల్లిదండ్రులు ఇంట్లోనే ఉంచి హరీశ్ను చూసుకుంటున్నారు. కుమారుడి చికిత్స కోసం ఆర్థికంగా, మానసికంగా చితికిపోయిన ఆ తల్లిదండ్రులు అతడి కారుణ్య మరణానికి అనుమతించాలంటూ 2024లో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. వారి పిటిషన్ ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఆ తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లినా నిరాశే ఎదురైంది. అయితే, హరీశ్ కోలుకునే అవకాశం లేదని వైద్యులు మరోసారి నివేదికలు ఇవ్వడంతో అతడి కుటుంబం మళ్ళీ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మెడికల్ రిపోర్టను పరిశీలించిన కోర్టు.. హరీశ్ కేసును విచారించేందుకు అంగీకరించింది. ఈ ఏడాది జనవరి 13న అతడి తల్లిదండ్రులతో మాట్లాడిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మానవీయకోణంలో మర్యాదపూర్వక చావును (ఝతీఅంష్ట్ర ఞఖఋ జుబ్ష్ణుఋఖంఋ ఝుంవ) ప్రసాదించాలని అప్పుడు వారు కోర్టును వేడుకున్నారు. ఆ సందర్భంగా ఈ కేసులో ప్రాణాధార వైద్య చికిత్సను ఉపసంహరించే అంశాన్ని మాత్రం తాము పరిశీలిస్తామంటూ తీర్పు రిజర్వ్ చేసింది. తాజాగా కారుణ్య మరణానికి అనుమతి ఇచ్చింది. "వైద్య నివేదికల ప్రకారం.. గత 13 ఏళ్లుగా అతడిలో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. ఇతరులపై ఆధారపడి ఉన్నాడు. రోగిని కాపాడటమే వైద్యుడి విధి. అయితే రోగి కోలుకునే అవకాశం లేనప్పుడు.. ఆ విధి నిర్వర్తించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. ఆ వ్యక్తి గౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా ఈ ప్రాణాధార చికిత్సను ఉపసంహరించుకునేలా ఎయిమ్స్ చూసుకుంటుంది. రాణా కుటుంబం ఎప్పుడూ అతడి వెంటే ఉంది. ఒకరిని ప్రేమించడం అంటే కష్ట సమయంలో కూడా వారిని జాగ్రత్తగా చూసుకోవడమే. జీవితం, ప్రేమ, నష్టం ఇలా వీటన్నింటిని పక్కన పెడితే.. వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాం" అని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు సమయంలో వ్యాఖ్యలు చేసింది.

### ఇలా జరగాలని ఏ తల్లిదండ్రులు కోరుకోరు

ఈ తీర్పుపై హరీశ్ తండ్రి అశోక్ రాణా స్పందిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. తమ పిల్లల చావును ఏ తల్లిదండ్రులూ కోరుకోరని, కాని తమకు అలాంటి దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. "నా కొడుకు హరీశ్ చదువులో టాపర్. అనుకోని విధంగా ప్రమాదానికి గురయ్యాడు. 13 ఏళ్లుగా దగ్గరుండి చూసుకుంటున్నాం. వాడి పరిస్థితి చూడలేక రాష్ట్రపతి లేదా ప్రధానికి లేఖ రాద్దామని నాలుగేళ్ల కిందట నా భార్య అడిగింది. కారుణ్య మరణం సాధ్యం కాదని తొలుత భావించాం. ఈ తీర్పు కోసం మేం మూడేళ్లుగా పోరాడుతున్నాం. తమ కుమారుడికి ఇలా జరగాలని ఏ తల్లిదండ్రులు కోరుకుంటారు? కానీ మేమే వాడి కారుణ్య మరణం కోసం పోరాడాల్సి వచ్చింది. హరీశ్ లాంటి వాళ్లు ఇంకెంతమంది ఉన్నారో నాకు తెలియదు. కానీ, వాళ్లందరికీ ఈ తీర్పు ఉపయోగపడుతుందని భావిస్తున్నా. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు మేం రుణపడి ఉంటాం" అని అశోక్ రాణా ఉద్వేగభరితంగా తెలిపారు.

# సీమైన్స్‌ను దించిన ఇరాన్

## హర్మూజ్‌వైపు చూడాలంటేనే బెదురుతున్న నౌకలు - ట్రంప్‌ను కలవరపెడుతున్న ఇరాన్ వ్యూహాత్మక నిర్ణయం




హర్మూజ్ జలసంధిని నౌకలకు మృత్యుమార్గంగా మార్చింది ఇరాన్. అమెరికా–ఇజ్రాయెల్ దాడులు పెరిగేకొద్దీ తన సార్వభౌమత్వాన్ని కాపాడుకొనేందుకు ఇరాన్ తీవ్ర ప్రతిఘటన కొనసాగిస్తోంది. తన అధీనంలోవున్న హర్మూజ్ జలసంధిని శత్రునౌకల పాలిట మృత్యుమార్గంగా మార్చేసింది. ఇందుకోసం తాజాగా తన పాత ఆయుధాన్ని రంగంలోకి దించుతోంది.

ఈ ప్రాంతంలోకి అమెరికా మిత్ర దేశాల నౌకలు అడుగుపెడితే పేలిపోయేలా ఇరాన్ ఎక్కడికక్కడ ఉచ్చులు పరిచింది. ఈ చర్యలు ట్రంప్ సర్కారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రపంచాన్ని భయపెడుతున్న ఆ ఆయుధం పేరు ‘సీమైన్స్’ లేదా ‘నేవల్ మైన్స్’ (సముద్రపు మందుపాతరలు)..! సముద్రంలో ఒక్కసారి మైన్స్‌ను పరిచాక నౌకలు ఏమార్గంలో ప్రయాణిస్తే హర్మూజ్‌ను దాటగలవో ఒక్క ఇరాన్‌కు మాత్రమే తెలుసు.

### ఏమిటీ నేవల్ మైన్స్..?

సాధారణంగా శత్రువులు సరిహద్దులు దాటకుండా భూమిలో మందుపాతర్లు అమర్చినట్టే.. సముద్ర జలాల్లో అమర్చే వాటిని సీమైన్స్ అంటారు. నౌకలు, జలాంతర్గాములను ధ్వంసం చేయడానికి అవి ప్రయాణించే మార్గాల్లో ఏర్పాటుచేస్తారు. దీంతో శత్రువు ఆ మార్గంలోకి రాకుండా ఇవి భయపెడుతుంటాయి. సముద్రం అడుగున గొలుసులతో అమర్చేవి, ప్రొపల్షన్ వ్యవస్థలతో పనిచేసేవి ప్రమాదకరమైన సీమైన్స్‌లో ముఖ్యమైనవి. ఇక మైన్స్‌ను నౌకల కింది భాగాలు తాకినా, అయస్కాంత క్షేత్రం సమీపంలోకి వచ్చినా, నౌకల ప్రొపల్షన్ వ్యవస్థ చప్పుడుకు, నౌక నీటిపై సృష్టించే ఒత్తిడికి ఇవి పేలిపోయేలా వీటిని రూపొందిస్తారు. రిమోట్ సాయంతోనూ వీటిని పేల్చవచ్చు. వీటిల్లో మైన్‌స్థాయిని బట్టి 50నుంచి 1,000 కేజీల పేలుడు పదార్థాలుంటాయి. మిగిలిన ఆయుధాలతో పోలిస్తే ఇవి చౌక. ఇరాన్ వద్ద దాదాపు 2,000 నుంచి 6,000 వరకు సీమైన్స్ ఉన్నట్టు అంచనాలున్నాయి. వీటిని చైనా, రష్యానుంచి కొనుగోలు చేయడంతోపాటు.. సొంతంగానూ ఉత్పత్తి చేస్తోంది. ఇరాన్ నౌకాదళంలోని చిన్న నౌకలు ఒక్కోటి రెండు నుంచి మూడు మైన్స్‌ను సముద్రంలో అమర్చగలవు. ఇలాంటి నౌకలు వందల సంఖ్యలో ఇరాన్ వద్ద ఉన్నాయి. ఇక సబ్‌మెరైన్ల సాయంతో సముద్రంలో అమర్చే మైన్స్ కూడా టెహ్రాన్‌వద్ద ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు. వీటి సాయంతో సముద్రంలో మైన్స్‌ను పెట్టడం వల్ల హర్మూజ్ జలసంధిని దాటడం రవాణా నౌకలకు అసాధ్యంగా మారిపోతుంది. ఇదే ట్రంప్ సర్కారును కలవరపెడుతోంది. హర్మూజ్‌లో సీమైన్స్‌ను తొలగించాలని ట్రంప్ స్వయంగా ఆదేశాలు జారీ చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే నేడు అమెరికా దళాలు 16 ఇరానియన్ మైన్ లేయర్స్ నౌకలను ధ్వంసం చేశాయి. కాకపోతే ఇంకా పెద్దసంఖ్యలో ఇరాన్ వద్ద ఈ శ్రేణి నౌకలు ఉన్నాయి.

### క్లస్టర్ బాంబులతో దాడి

ఇప్పటి వరకు ఇజ్రాయెల్‌పై ఇరాన్ సుమారు 300 బాలిస్టిక్ క్షిపణులను రిలీజ్ చేసింది. దాంట్లో సగం వరకు క్లస్టర్ బాంబులతో కూడి వార్‌హెడ్స్ ఉన్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ పేర్కొంది. మంగళవారం కూడా ఇరాన్ తన క్షిపణులను ప్రయోగించింది. అయితే వాటిని తిప్పికొడుతున్నట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. భారీ వార్‌హెడ్‌తో వచ్చిన ఓ క్షిపణి.. బీట్ షెమేస్‌లో ఉన్న ఓ ఖాళీ స్థలంలో పడినట్లు అధికారులు చెప్పారు. ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. క్లస్టర్ బాంబుల్లో ఉన్న వార్‌హెడ్స్ అత్యంత ప్రమాదకరమైనవి. క్షిపణి పేలిన తర్వాత వాటినుంచి పేలుడు పదార్థాలు డజన్ల సంఖ్యలో వేరుపడుతాయి. సబ్‌మ్యునిషేన్స్‌లో కిలోల కొద్దీ పేలుడు పదార్థాలుంటాయి. అయితే అవి కనీసం పది కిలోమీటర్ల దూరం చెల్లాచెదురుగా పడే అవకాశాలున్నట్టు అంచనా వేస్తున్నారు. క్లస్టర్ బాంబులను వదిలే క్షిపణులను ప్రస్తుతానికి సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని, కానీ వాటివల్ల సవాళ్లున్నట్లు ఇజ్రాయెల్ మిలిటరీ పేర్కొన్నది. ఇజ్రాయెల్ వైమానిక క్షేత్రం సంపూర్ణంగా సురక్షితంగా లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.


# ఇరాన్ టార్గెట్‌లో అమెరికా టెక్ కంపెనీలు


ఇరాన్– ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమై 12వ రోజుకు చేరుకుంది. ఇదే సమయంలో యుద్ధాన్ని మరింత తీవ్రం చేసేందుకు సిద్ధమని ఇరాన్ ప్రకటించింది. ఇకపై అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ సెంట్రల్ ఆపరేషనల్ కమాండ్ ఖాటమ్ అల్ అన్బియా ఒక ప్రకటనలో తెలిపారు.

అమెరికా మిత్ర దేశాల్లోని కీలక స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో ఇజ్రాయెల్‌తో సంబంధమున్న అమెరికా టెక్ కంపెనీల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాలని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్జీసీ) నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. సైనిక చర్యల కోసం ఈ సంస్థల టెక్నాలజీని ఉపయోగిస్తున్నందున వీటిని లక్ష్యంగా చేసుకున్నట్టు ఐఆర్జీసీ అనుబంధ వార్తా సంస్థ తస్నిం న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. “ఈ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం మౌలిక సదుపాయాలకు విస్తరిస్తున్నకొద్దీ.. ఇరాన్ లక్ష్యాల పరిధి కూడా పెరుగుతోంది” అని తాజా కథనం పేర్కొంది. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఒక కీలక బ్యాంకుపై ఇజ్రాయెల్ అర్ధరాత్రి దాడి చేసింది. ఈ ఘటనలో చాలా మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై తాము కూడా ఇలాగే అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడి చేస్తామని, అక్కడి ప్రజలు ఆ ప్రదేశాలకు దూరంగా ఉండాలని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ తమ బ్యాంకులపై దాడి చేయడం ద్వారా తాము కూడా అలాంటి సంస్థలపై దాడులు చేసేందుకు తగిన కారణాన్ని ఇచ్చిందని ఇరాన్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ సహా గల్ఫ్ కంట్రీస్‌లోని అమెరికాకు చెందిన సంస్థలపై దాడులు చేసేందుకు ఇరాన్ సిద్ధమవుతోంది. ఈ దాడులకు సంబంధించి అమెరికన్ సంస్థల టార్గెట్ లిస్టును ఇరాన్ ప్రకటించింది. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఎన్విడియా, ఒరాకిల్, పాలంటిర్‌వంటి టెక్ సంస్థలతోపాటు ఇజ్రాయెల్ నగరాలు, గల్ఫ్ దేశాల్లో క్లౌడ్ ఆధారిత సేవలు అందిస్తున్న కొన్ని కార్యాలయాలు ఈ జాబితాలో ఉన్నట్టు తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు సంబంధించిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలనూ లక్ష్యంగా చేసుకుంటామని.. ఇందుకోసం శత్రువులు తమకు స్వేచ్ఛ కల్పించారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రదేశాలకు ఒక కిలోమీటరు పరిధిలో ప్రజలు ఉండవద్దని ఇరాన్ హెచ్చరించింది.

# హర్మూజ్‌లో థాయ్ నౌకపై దాడి

### ముగ్గురి గల్లంతు.. భారత్ దిశగా వస్తున్న నౌక





భారత్ దిశగా వస్తోన్న నౌకపై దాడి జరిగింది. దాంతో ముగ్గురు గల్లంతయ్యారు. థాయ్ జెండాతో ఆ కార్గో నౌక యూఏఈలోని పోర్టు నుంచి బయల్దేరి.. హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు దాడి జరిగిందని రాయల్ థాయ్ నేవీ వెల్లడించింది. ఈ నౌక థాయిలాండ్‌లోని షిప్పింగ్ కంపెనీకి చెందిన మయూరీ నారీ. అది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఖలిఫా పోర్ట్‌నుంచి గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు బయల్దేరింది. హర్మూజ్ మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు దాడికి గురైంది. దాంతో నౌకనుంచి దట్టమైన పొగ వెలువడుతోన్న దృశ్యాలను రాయల్ థాయ్ నేవీ విడుదల చేసింది. “ఈ దాడికిగల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నాం” అని వెల్లడించింది. ఒమన్ నౌకాదళం ఆ కార్గోషిప్‌లోని 20మంది నావికుల్ని రక్షించిందని పేర్కొంది. ముగ్గురు గల్లంతయ్యారని, వారి ఆచూకీ గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంది. ఇప్పటివరకు ఏ గ్రూప్ బాధ్యత ప్రకటించుకోలేదు. అయితే ఈ దాడి ఇరాన్ చేసినట్టుగా అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. నిన్న పర్షియన్ గల్ఫ్‌లో మూడు వాణిజ్య నౌకలపై దాడి జరిగిందని యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ వెల్లడించింది. అందులో మయూరీ నారీ ఉందోలేదో మాత్రం తెలియరాలేదు. ఫిబ్రవరి 28నుంచి ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా దళాల మధ్య జరుగుతోన్న ఘర్షణలతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. దాంతో హర్మూజ్ జలసంధిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దానిమీదుగా నౌకలు వెళ్తే దాడులు చేస్తామని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. దాంతో అంతర్జాతీయ ఇంధన భయాలు నెలకొన్నాయి. చమురు ధరలను అదుపులోనికి తెచ్చేందుకు, ఆంక్షల తొలగింపును పరిశీలిస్తున్నామని.. హర్మూజ్ జలసంధి ద్వారా ప్రయాణించే చమురు ట్యాంకర్లకు రక్షణగా అమెరికా నౌకాదళాన్ని పంపిస్తామని ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

### హర్మూజ్ మూతపడితే ముప్పే: ఐరాస

పశ్చిమాసియా ఘర్షణలతో హర్మూజ్ జలసంధి మూతపడితే.. ప్రపంచవాణిజ్యం, అభివృద్ధిపై పెను ప్రభావం ఉంటుందని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. దానివల్ల ఆహార ధరలు, జీవన వ్యయాలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఈమేరకు ఐరాస అనుబంధ సంస్థ యూఎన్‌టీఏడీ తన నివేదికలో పేర్కొంది. అమెరికా–ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ ప్రతిదాడులతో ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. “సైనిక ఘర్షణల ప్రభావాలు పశ్చిమాసియాకే పరిమితం కావు. ప్రపంచ ఇంధన మార్కెట్లు, సముద్ర రవాణా, అంతర్జాతీయ సరఫరా గొలుసులపైనా ప్రభావం పడుతుంది. ఇంధనం, ఎరువుల ధరలతోపాటు రవాణా ఛార్జీలు, బీమా ప్రీమియంలు పెరిగిపోతే.. ఆహార ధరలు, జీవన వ్యయాలకు రెక్కలొస్తాయి. ఈ పరిణామాలవల్ల ప్రత్యేకించి పేదవర్గాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుంది” అని ఐరాస హెచ్చరించింది. ఇప్పటికే పలు దేశాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచిన సంగతి తెలిసిందే. యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి నుంచి చమురు రవాణా నిలిచిపోవడంతో ఇండియా, చైనావంటి పలు ఆసియా దేశాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

# ఇరాన్ సుప్రీం లీడర్ క్షేమం



ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా నియమితులైన మొజ్తాబా ఖమేనీ గాయపడినట్టు ఇటీవల వార్తలు వచ్చాయి. వీటిని తాజాగా ఇరాన్ ఖండించింది. ఆయన ఆరోగ్యంగా, సురక్షితంగానే ఉన్నారని స్పష్టం చేసింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కుమారుడు యూసఫ్ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. మొజ్తాబా గాయపడినట్టు వస్తున్న వార్తలు తన దృష్టికి వచ్చాయన్నారు. ఆయనతో టచ్ ఉన్న తన స్నేహితులతో దీనిపై ఆరా తీసినట్టు వెల్లడించారు. అయితే, ఆయన క్షేమంగా, ఆరోగ్యంగానే ఉన్నారని చెప్పినట్లు పేర్కొన్నారు. కాగా.. అమెరికా– ఇజ్రాయెల్ ఆపరేషన్ చేపట్టిన తొలి రోజులోనే మొజ్తాబా తన భార్య, తండ్రి ఖమేనీతో సహా పలువురు కుటుంబీకులను కోల్పోయారు. ఈ దాడుల్లో ఆయన కూడా గాయపడినట్టు ఆ దేశ మీడియా పేర్కొంది. అయితే, ఆయన ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఇదే క్రమంలో పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతోన్న క్రమంలో ఆయన బహిరంగంగా ఎక్కడా కన్పించలేదు. ప్రజలను ఉద్దేశిస్తూ వీడియో సందేశాన్ని కూడా విడుదల చేయలేదు. ఇటీవల సుప్రీం నేతగా ఎన్నిక అయినప్పటికీ.. మొజ్తాబా నుంచిగాని, ఆయన కార్యాలయం నుంచిగాని ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో ఆయన ఆరోగ్యంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. తాజాగా ఇరాన్ అధ్యక్షుడి కుమారుడి ప్రకటనతో వాటన్నింటికీ చెక్ పెట్టినట్లయ్యింది.

# ఐపీఎల్‌కు యుద్ధ భయం!

## షెడ్యూల్ ప్రకటనలో ఆలస్యం - గగనతలం మూసేయడంతో ప్లేయర్స్ రావడం సవాలే

న్యూఢిల్లీ: ఐపీఎల్‌కు మరో మూడువారాల సమయమే ఉన్నా ఇంకా షెడ్యూల్ విడుదల కాలేదు. ఇందుకు పలు రాష్ట్రాల ఎన్నిక లతో పాటు మరో సమస్య కూడా వెంటాడుతోంది. పశ్చిమాసి యాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం లీగ్‌పై గట్టిగానే పడనుంది. ఎందుకంటే దేశంలో చమురు, గ్యాస్ కొరతకు ఆస్కారం ఏర్పడే అవకాశం ఉంది. సోమవారం పెట్రోలియం, సహజ వాయువుల శాఖ ఎల్పీజీ కొరతపై ఓ ప్రకటన కూడా విడుదల చేసింది. ఐపీఎల్ ఫ్రాంచైజీల నగరాలు చెన్నై, బెంగళూ రుకు చెందిన హోటళ్లలో రెండురోజులుగా గ్యాస్ లేక ఇబ్బంది పడుతున్నాయి. దీంతో తమ హోటళ్లను మూసివేస్తున్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి. ఇప్పుడిదే లీగ్‌కు ప్రధాన అడ్డంకిగా మారనుంది. ఎందుకంటే గ్యాస్ కొరత ఉన్నప్పుడు ముందు ఆస్పత్రులు, విద్యా సంస్థలకు ప్రాధాన్యం ఇస్తారే కానీ.. క్రికెట్‌కు ఇవ్వడం కుదరదు. 'పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ప్రస్తుతానికైతే ఏమీ చెప్పలేం. కానీ త్వరలోనే ఏదో ఒక నిర్ణయం తీసుకుంటాం' అని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధూమల్ తెలిపాడు. దీనికితోడు ఐపీఎల్ కోసం వివిధ దేశాల నుంచి భారత్‌కు ఆటగాళ్లు రావాల్సి ఉంది. కానీ గల్ఫ్ దేశాల్లో గగనతలాలు మూసివేయడంతో వారంతా ఇక్కడికి రావడం సవాల్‌గా మారింది. ఇప్పటికే సూపర్-8లో ఓడిన దక్షిణాఫ్రికా, విండీస్ ఆటగాళ్లు వారంరోజులుగా భారత్‌లోనే ఇరుక్కుపోయారు. కరీబియన్, ఆఫ్రికాల నుంచి భారత్‌కు నేరుగా విమానాలు లేకపోవడం సవాల్‌గా మారింది. అయితే ఆసీస్, కివీస్ ఆటగాళ్లకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

### కోచ్‌గా హేడెన్

అహ్మదాబాద్: ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హేడెన్ ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టు బ్యాటింగ్ కోచ్‌గా నియమితుడ య్యాడు. ఈ మేరకు హేడెన్ నియామకాన్ని టైటాన్స్ మంగళవా రం ప్రకటించింది. ఇప్పటికే బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న పార్థివ్ పటేల్ తో కలిసి హేడెన్ పనిచేస్తాడని తెలిపింది. ఆశిష్ నెహ్రా టైటాన్స్ చీఫ్ కోచ్‌గా ఉన్నాడు.

### రెండు, మూడు రోజుల్లో షెడ్యూల్..

ఈ ఏడాది జరిగే ఐపీఎల్ 19వ సీజన్ షెడ్యూల్‌పై అనిశ్చితి కొనసాగుతోంది. గత శనివారమే ఈ వివరాలను ప్రకటిస్తారని అంతా ఎదురుచూసినా వాయిదా పడింది. తాజాగా మరో రెండు, మూడు రోజుల్లో.. అంటే ఈనెల 13లోగా ఐపీఎల్‌కు సంబంధిం చి మొదటి 20 రోజుల షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్టు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మంగళవారం వెల్లడించాడు. మిగతా టోర్నీ షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామన్నాడు. ఈనెల 28న ప్రారంభం కానున్న ఐపీఎల్.. మే 31న ముగియనుంది. మరోవైపు ఈ లీగ్ సమయంలోనే అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. అందుకే ఈసారి పూర్తి షెడ్యూల్‌ను ఒకేసారి ప్రకటించడం కష్టంగా మారింది. కాగా, ఐపీఎల్‌లో పోటీపడుతోన్న జట్లన్నీ ఇప్పటికే సన్నాహకాల్లో బిజీగా ఉన్నాయి.

# కోచ్ స్థాయిలో ఉండి నవ్వలేను



టీ20 ప్రపంచకప్ 2026ను టీమిండియా ఘనంగా ముగించింది. వరుసగా రెండోసారి, ఓవరాల్‌గా మూడోసారి పొట్టి ప్రపంచ కప్ ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించింది. అయితే టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పై సోషల్ మీడియాలో పలు రకాల విమర్శలు వస్తూనే ఉంటాయి. దాంట్లో ముఖ్యంగా గౌతీ ముఖంలో నవ్వు ఉండదని అభిమానులు నెట్టింట కామెంట్లు పెడుతుంటారు. అతడు నవ్వితే చూడాలం టూ సెటైరికల్‌గా మాట్లాడుతుంటారు. అయితే వీటన్నింటిపై గౌతమ్ గంభీర్ స్పందించాడు. ఎందుకు తాను ఎక్కువగా డగౌట్‌లో సీరియస్‌గా ఉంటాడనే దానిపై వివరణ ఇచ్చాడు. 'నా నవ్వుపై కామెంట్లు చేసేవారు ఎప్పుడూ ఇలాంటి బాధ్యతల్లో ఉండి ఉండరు. కఠిన పరిస్థితులు ఉన్నప్పుడు డగౌట్‌లో కోచ్‌గా నేను నవ్వుతూ ఉండలేను. భారత జట్టుపై ఎప్పుడైనా భారీ అంచనాలు ఉంటాయి. ఇక్కడ ఓటమి అనేది ఆప్షన్ కాకూడదు. ప్రతి వరల్డ్ కప్‌ను టీమిండియానే నెగ్గాలని కోరుకుంటారు. ప్రతిసారీ ఎలా వర్కౌట్ అవుతుంది? ఇది స్పోర్ట్స్. మీ జీవితమంతా వెచ్చించినా సత్ఫలితాలు వస్తాయని గ్యారంటీ లేదు. ఇదేమీ షేర్ మార్కెట్ కాదు కదా' అని గౌతమ్ గంభీర్ వెల్లడించాడు. అయితే టీ20 ప్రపంచ కప్ 2024 తర్వాత రాహుల్ ద్రవిడ్ స్థానంలో కోచ్‌గా గంభీర్ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. స్వదేశంలోనే టెస్ట్ సిరీస్ కోల్పో తుండటంతో అతడిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. కోచ్‌గా తప్పించాలనే డిమాండ్లు వినిపించాయి. అయితే టీ20 ఫార్మాట్లో మాత్రం గంభీర్ కోచ్‌గా అజేయంగా నిలిచాడు. అతడి నేతృత్వం లోనే టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ, తాజాగా టీ20 ప్రపంచ కప్‌ను ముద్దాడిన సంగతి తెలిసిందే.

## ఫ్యాన్స్ కంట పడకుండా

# దూబే రైలు ప్రయాణం




టీ20 ప్రపంచ కప్ 2026 విజేతగా టీమిండియా నిలిచిన సంగతి తెలిసిందే. ప్లేయర్లకు ఎయిర్‌పోర్టుల్లో ఘన స్వాగతాలు లభించాయి. అయితే టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ శివం దూబే చేసిన పని మాత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. విమానాలు అందుబాటులో లేకపోవడంతో త్వరగా ఇంటికెళ్లాలన్న ఉద్దేశంతో రైలులో ముంబైకి చేరుకున్నాడు. అది కూడా అభిమానుల దృష్టిలో పడకుండా సాఫీగా వెళ్లిపోయాడు. అహ్మదాబాద్ నుంచి ముంబైకి ఎలా చేరుకున్నా డో దూబే వివరించాడు. 'నా భార్య అంజుమ్, నా ఫ్రెండ్, నేను కలిసి అహ్మదాబాద్ నుంచి ముంబైకి రైలులో వెళ్లాం. మేం బుక్ చేసుకునే సమయానికి విమానాలు అందుబాటులో లేవు. దీంతో ఎలాగైనా ముంబైకి వెంటనే వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నా. అందుకోసం అహ్మదాబాద్ నుంచి ఉదయాన్నే ముంబైకి రైలులో చేరుకోవాలని భావించాం. రోడ్డు మార్గంలోనూ వెళ్లొచ్చు కానీ రైలు అయితే చాలా త్వరగా చేరుకునే అవకాశం ఉంది. నేను, నా భార్య, నా స్నేహితుడు థర్డ్ ఏసీ బుక్ చేసుకున్నాం. అవి మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అయితే స్టేషన్‌లో ఎవరైనా తనను గుర్తుపట్టి చుట్టుముడితే పరిస్థితి ఏంటని కాస్త కంగారు పడ్డాం. అయితే అందుకోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నా. తలకు క్యాప్, ముఖానికి ఓ మాస్క్ పట్టుకున్నా. ఫుల్ స్లీవ్ ఉన్న టీ షర్ట్ వేసుకున్నా. మా ట్రైన్ ఉదయం 5.10 గంటలక బయలు దేరనుండటంతో అప్పుడు ఎక్కువ మంది స్టేషన్‌లో లేరు. కానీ అప్పటికే అహ్మదాబాద్ మొత్తం అభిమానులు జెండాలు, జెర్సీలు ధరించి సంబరాలు చేసుకుంటున్నారు. మేం రైల్వే స్టేషన్‌కు చేరుకునేసరికి ట్రైన్ బయలుదేరేందుకు ఇంకా సమయం ఉంది. అప్పుడు ప్లాట్‌ఫాం మీద నడుచుకుం టూ వెళ్తే ఎవరైనా గుర్తుపట్టే అవకాశం ఉంది. దీంతో రైలు మరో ఐదు నిమిషాల్లో స్టార్ట్ అవుతుందనగా వచ్చేస్తానని నా భార్యకు చెప్పా. ఎలాంటి ఇబ్బంది లేకుండా రైలు ఎక్కేశాం. అప్పర్ బెర్తులో పడుకున్నా. అయితే అప్పటికీ టీసీ చూసి గుర్తు పట్టినంత పని చేశాడు. 'శివం దూబే ఎవరు.. క్రికెటరా?'అని అడిగాడు. నా భార్య చాకచక్యంగా వ్యవహరించి ఇతడు వేరే వ్యక్తి అని చెప్పింది. వాష్ రూమ్‌కు వెళ్లేటప్పుడు ఎవరైనా గుర్తుపడతారేమోనని కాస్త కంగారు పడ్డా. కానీ అలాంటిదేమీ జరగలేదు. సాఫీగా ప్రయాణించి ముంబై చేరుకున్నా. అక్కడ దిగే సమయానికి పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందా. మధ్యాహ్న సమయంలో అక్కడ అభిమానులను తప్పిం చుకుని వెళ్లడం కష్టమే. దీంతో పోలీసులను సంప్రదిం చాం. వారంతా నేను విమానంలో వస్తున్నా అనుకున్నారు. రైలు ప్రయాణం అని చెప్పగానే సర్‌ప్రైజ్ అయ్యారు. పోలీస్ ఎస్కార్ట్ వాహనంలో రైల్వే స్టేషన్ నుంచి ఇబ్బంది లేకుండా బయటకు వచ్చేశా. ఇదంతా నా భార్య అంజుమ్ ప్రణాళిక. త్వరగా నా కుమారుడు, కుమార్తెను చూడాలనే ఇలా చేశాం' అని దూబే వెల్లడించాడు.

# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. అగ్రస్థానంలోనే అభిషేక్ శర్మ

## - సత్తా చాటిన ఇషాన్ కిషన్



టీ20 ప్రపంచకప్ 2026ను టీమిండియా ఘనంగా ముగిం చింది. వరుసగా రెండోసారి కప్‌ను ముద్దాడిన జట్టుగా చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్ జాబితాను ప్రకటించింది. ఇందులో భారత బ్యాటర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ సత్తా చాటారు. అభిషేక్ శర్మ తన స్థానాన్ని పదిలపర్చుకుని అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. కాగా టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శనలు చేసిన ఇషాన్ కిషన్ రెండో స్థానా నికి దూసుకొచ్చాడు. టీ20 ప్రపంచకప్‌లో అభిషేక్ శర్మ ఆరంభంలో ఫామ్ లేమితో తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. అతడి ప్రదర్శనతో టీ20 ర్యాంకింగ్స్‌లో అతడి స్థానాన్ని కోల్పోవచ్చనే చర్చ కూడా జరిగింది. ఎట్టకేలకు ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాం డ్‌పై 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి అదరగొట్టాడు. దీంతో అతడి స్థానంలో పదిలం అయింది. 875 పాయింట్లతో అభిషేక్ శర్మ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు గత రెండేళ్లు జట్టులోనే లేని ఇషాన్ కిషన్.. దేశవాళీలో సత్తా చాటి తుది జట్టు లోకి రీఎంట్రీ ఇచ్చాడు. అద్భుత ప్రదర్శనలతో ఔరా అనిపించా డు. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 871 పాయింట్లతో రెండో స్థానంలోకి దూసుకొచ్చాడు. 742 పాయింట్లతో తిలక్ వర్మ ఏడో స్థానంలో ఉండగా.. టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(722) తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నాడు.

### బౌలింగ్ విభాగంలో..

ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన స్థానాన్ని కోల్పోయాడు. పొట్టి ప్రపంచ కప్ టోర్నీలో వికెట్లు తీసినప్పటికీ ధారాళంగా పరుగులు సమర్పించు కున్న సంగతి తెలిసిందే. దీంతో అఫ్గానిస్తాన్ బౌలర్ రషీద్ ఖాన్ 753 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. కాగా వరుణ్ చక్రవర్తి 740 పాయింట్లతో రెండోస్థానానికి పడిపోయాడు. స్టార్ పేసర్ బుమ్రా 702 పాయింట్లతో ఆరో స్థానానికి ఎగబాకాడు. ఐసీసీ ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్ జాబితాలో తొలి స్థానంలో సికందర్ రజా(328), రెండో స్థానంలో హార్దిక్ పాండ్య(299), మూడో స్థానంలో సయామ్ ఆయూబ్(275) ఉన్నారు. న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్(201) తొమ్మిదో స్థానానికి ఎగబాకాడు.

## వెస్టిండీస్‌పై వివక్ష.. క్లారిటీ ఇచ్చిన ఐసీసీ

ఇటీవల టీ20 ప్రపంచకప్ ముగిసిన సంగతి తెలిసిందే. శ్రీలంకతో కలిసి ఈ ఈవెంట్‌కు ఆతిథ్యం ఇచ్చిన భారత్.. ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించి విశ్వవిజేతగా అవతరించింది. ఇదిలా ఉంటే.. సూపర్-8 దశలోనే నిష్క్రమించిన వెస్టిండీస్ మ్యాచ్‌లు అయిపోయి పది రోజులు దాటిపోయింది. సెమీస్‌లో వెనుదిరిగిన దక్షిణాఫ్రికా ఆట ముగిసి వారం రోజులకు పైనే అయింది. ఇరాన్ లో యుద్ధం కారణంగా ఇన్ని రోజులైనా ఈ రెండు జట్లు భారత్ లోనే గడపాల్సి వచ్చింది. చార్టర్ విమానాల్ని ఏర్పాటు చేయాలను కున్న ఐసీసీ ప్రయత్నాలు కూడా విఫలమవడంతో గల్ఫ్ మీదుగా వెళ్లాల్సిన విండీస్, సఫారీ జట్లు ఇక్కడే చిక్కుకుపోయాయి. చివరకు మంగళవారం రెగ్యులర్ కమర్షియల్ ఫ్లైట్‌లలో పంపించ డంతో క్రికెటర్లు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే.. భారత్ చేతిలో ఓడిన ఇంగ్లండ్ సెమీస్‌లోనే వెనుదిరగగా.. మరుసటిరోజే స్వదేశానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో తాము భారత్‌లోనే చిక్కుకుపోవడం పట్ల వెస్టిండీస హెడ్ కోచ్ డారెన్ సామీ, ప్లేయర్ ఆకీల్ హొసేన్ తదితరులు ఐసీసీ తీరును విమర్శించారు. ఇంగ్లండ్‌కు ఇచ్చిన ప్రాధాన్యత.. విండీస్, సౌతాఫ్రికా జట్లకు ఇవ్వలేదని.. ఇది వివక్షే అంటూ ఐసీసీపై ఆరోపణలు చేశాడు. ఈ ఆరోపణలపై ఐసీసీ తాజాగా స్పందించింది. 'వెస్టిండీస్, సౌతాఫ్రి కా ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, వారి కుటుంబాలు ప్రపంచ కప్‌లో వారి ప్రయాణం ముగిసిన తర్వాత కూడా స్వదేశానికి చేరుకోకపోవడం పట్ల అసంతృప్తి చెందిన తీరును మేము అర్థం చేసుకోగలం. వారు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేయడంలో అర్థం ఉంది. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధం వల్లే ఈ పరిస్థితి. అంతర్జాతీయ గగనతల ప్రయాణా లకు ఇబ్బంది కలిగిం ది. చార్టర్ ఫ్లైట్లు ఏర్పాటు చేయడంలోనూ ఆలస్యం జరిగింది' అని ఓ ప్రకటనలో ఐసీసీ పేర్కొంది. అలానే మైకేల్ వాన్ విమర్శలపై కూడా ఐసీసీ స్పందిస్తూ.. గగనతలంలో ఉన్న పరిస్థితులను బట్టే ఇంగ్లండ్ జట్టును ముందుగా స్వదేశానికి పంపించా మని, మిగతా జట్ల ప్రయాణం గల్ఫ్ దేశాల గుండా సాగాల్సినందునే ఆలస్యం అయిందని ఐసీసీ స్పష్టం చేశాయి.

చైతన్య రథం
సినిమా
గురువారం 12 మార్చి 2026 X

# ఆకట్టుకుంటున్న 'వదలా' గ్లింప్స్

జగపతి బాబు, లయ, హృతిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వదలా'. వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతున్న చిత్రానికి ఆకెళ్ల వి కృష్ణ దర్శకుడు. సీనియర్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్‌తోపాటు కిశోర్ నాయుడు కలిసి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తుండగా.. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే తాజాగా చిత్రబృందం ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేయగా ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఒక వ్యక్తి జీవితం, అతని చుట్టూ అల్లుకున్న రహస్యాల నేపథ్యంలో సాగే గ్రిప్పింగ్ డ్రామాగా గ్లిప్స్ స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా జగపతిబాబు నటన, ఆయన పాత్ర తీరుతెన్నులు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. చాలాకాలం తర్వాత లయ ఈ చిత్రంలో




ఒక కీలక పాత్రలో కనిపించబోతుండటం విశేషం. గ్లింప్స్‌లోని విజువల్స్, నేపథ్య సంగీతం సినిమాలోని తీవ్రతను, ఉత్కంఠను చెప్పకనే చెబుతున్నాయి. ఒక విభిన్నమైన పాయింట్‌తో, ఎమోషనల్ అండ్ సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో చిత్రం రూపొందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుపుకుంటున్న సినిమా విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

# జునైద్‌తో సాయిపల్లవి 'ఏక్ దిన్'



బాలీవుడ్ స్టార్ ఆమిర్‌ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ మరియు సౌత్ సెన్సేషన్ సాయిపల్లవి జంటగా నటించిన క్రేజీ చిత్రం 'ఏక్ దిన్'. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం నేడు విడుదల చేసింది. సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. హీరోయిన్ కేవలం ఒకే ఒకరోజు హీరోతో ప్రేమలో గడపాలనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రంద్వారా సాయిపల్లవి హిందీ తెరకు పరిచయం కాబోతోంది. రామ్ సంపత్ సంగీతం, అరిజిత్ సింగ్ గాత్రం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.

# 26న రానున్న 'గోట్'



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం జీఓఏటీ (గోట్) గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్ అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రానికి చంద్రశేఖర్‌రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న చిత్రం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. మార్చి 26న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయబోతున్నట్టు తెలిపింది. త్వరలోనే చిత్రంనుంచి ట్రైలర్‌ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ.. ప్రస్తుతం గోట్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా తెరకెక్కించాం. టెక్నికల్‌గానూ చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఇది మైల్‌స్టోన్. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు. సుడిగాలి సుధీర్, దివ్యభారతి, సర్వదమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, బ్రహ్మాజీ, పృథ్వీ, ఆదుకాలం నరేష్, రాజేంద్రన్, ఆనంద్ రామరాజ్, చమ్మక్ చంద్ర, పమ్మీ సాయి, నవీన్ నేని తదితరులు నటిస్తున్న చిత్రానికి సంగీతం లియోన్ జేమ్స్ సమకూరుస్తున్నారు.

# నటి హన్సికకు విడాకులు మంజూరు



తెలుగులో ఒకప్పుడు మెరుపులు మెరిపించిన నటి హన్సికా మోత్వానీ. దేశముదురు సినిమాతో హీరోయిన్‌గా సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ భామ తెలుగు, తమిళంతోపాటు పలు భాషల్లో స్టార్ హీరోలతో కలిసి నటించి బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంది. హన్సిక ప్రొఫెషనల్ లైఫ్‌లో సక్సెస్‌ఫుల్ జర్నీ కొనసాగిస్తూనే 2022 డిసెంబర్ 4న జైపూర్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగిన వివాహ వేడుకలో సొహైల్ ఖటురియాతో కలిసి ఏడడుగులు వేసింది. కాగా పరస్పర అంగీకారంతో తాను భర్త నుంచి విడిపోవాలని కోరుతూ హన్సిక కోర్టును ఆశ్రయించింది. ఈమేరకు ముంబైలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టు హన్సికకు విడాకులు మంజూరు చేసింది. సొహైల్ ఖటురియా, హన్సికా మధ్య అభిప్రాయపరంగా, జీవనశైలి పరంగా చాలా వ్యత్యాసాలున్నాయి. ఇద్దరూ తరచూ గొడవలు పడుతూ ఇక కలిసి ఉండలేమని చెబుతూ వచ్చారు. వారి బంధువులు, తల్లిదండ్రులు ఇద్దరినీ కలిపేందుకు చాలా ప్రయత్నాలు చేశారు. కానీ ఫలించలేదు. హన్సిక-సొహైల్ జులై 2024నుంచి విడివిడిగా ఉంటున్నారు. కోర్టు వారికి విడాకులు మంజూరు చేసిందని హన్సిక తరపు లాయర్ అద్నాన్ షేక్ వెల్లడించారు. హన్సిక భర్తనుంచి ఎలాంటి భరణం డిమాండ్ చేయలేదని సమాచారం.

# టాప్ ట్రెండ్‌లో 'ధురంధర్'!

ఇప్పటికే 'ధురంధర్ మొదటి భాగం సంచలనం సృష్టించి రికార్డులు క్రియేట్ చేయగా.. ఇప్పుడు పార్ట్ 2 ఆ రికార్డులను తిరగరాసేందుకు సిద్ధమైంది. రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2: ది రివెంజ్. మార్చి 19న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి భాగం నెట్‌ఫ్లిక్స్‌లో హవా చూపిస్తోంది. పార్ట్-2 విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో మొదటి భాగాన్ని మరోసారి చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కొన్ని రోజుల క్రితం నెట్‌ఫ్లిక్స్‌లో ఇండియాలో టాప్ 5 జాబితాలో ఉన్న 'ధురంధర్.. ఇప్పుడు ఏకంగా మూడో స్థానానికి చేరుకుంది. ఇప్పటివరకు ఈ సినిమాకు నెట్‌ఫ్లిక్స్‌లో 2.2 కోట్లకు పైగా వ్యూస్ లభించాయి. కేవలం భారత్‌లోనే కాకుండా పాకిస్థాన్, బంగ్లాదేశ్, యూఏఈవంటి దేశాల్లో కూడా ఈ చిత్రం టాప్ 10లో ట్రెండ్




అవుతోంది. మార్చి 19న 'ధురంధర్-2' రిలీజ్ కానుంది. ఉగాది, ఈద్ పండుగల రోజుల్లో విడుదల కానుండడంతో దీని కలెక్షన్లపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్ కూడా యూట్యూబ్‌లో అన్ని భాషల్లో కలిపి 312 మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

# రవితేజ ప్రాజెక్టులో తమన్నా?

కాస్త విరామం వచ్చేసిందనే అభిప్రాయం కలిగేలోపే తెలుగులో మరో కీలకమైన అవకాశాన్ని సొంతం చేసుకుని రేసులోకి వచ్చేస్తుంటుంది తమన్నా. దాదాపు రెండు దశాబ్దాలుగా ఆమె తెలుగు చిత్ర పరిశ్రమలో తరచూ అవకాశాల్ని అందిపుచ్చుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తోంది. ఈ మధ్య హిందీలోనే ఎక్కువగా నటిస్తున్న ఆమె... త్వరలోనే రవితేజతో కలిసి సందడి చేయనుందని తెలుస్తోంది. రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఇరుముడి' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న చిత్రంలో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తోంది.



ఇందులో మరో కీలక పాత్ర ఉంటుందని, ఆ పాత్ర కోసం తమన్నాని ఎంపిక చేశారని సమాచారం. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. తండ్రీ కూతురు మధ్య అనుబంధం, భక్తి మేళవింపుగా రూపొందుతున్న చిత్రమిది.

# ప్రభాస్‌తో ఎకో డైరెక్టర్ ప్రాజెక్టు?



ప్రభాస్‌ను మలయాళ సెన్సేషనల్ డైరెక్టర్ దిన్‌జిత్ అయ్యతాన్ కలిసిన ఫోటో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఫోటో వీరిద్దరి కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కబోతుందనే వార్తలకు బలం చేకూరుస్తుంది. ఇటీవల 'కిష్కింధ కాండం' మరియు 'ఎకో'వంటి విభిన్నమైన సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దిన్‌జిత్, స్వయంగా ప్రభాస్‌ను కలిసిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని, ముఖ్యంగా ఆయన వడ్డించిన రుచికరమైన 'ప్రాన్స్ బిర్యానీ'ని ప్రశంసిస్తూ దిన్‌జిత్ పెట్టిన ఇన్‌స్టా పోస్ట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. ముఖ్యంగా ఈ సమావేశం వెనుక హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరగందూర్ ఉండటం గమనార్హం. గతంలోనే హోంబలే సంస్థ ప్రభాస్‌తో మూడు సినిమాల భారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో 'సలార్-2' కాకుండా, మిగిలిన రెండు చిత్రాల్లో ఒకటి దిన్‌జిత్ దర్శకత్వంలో ఉండే అవకాశం ఉందని ఫిల్మ్‌నగర్ టాక్ నడుస్తుంది. విలక్షణమైన థ్రిల్లర్లను తెరకెక్కించడంలో దిన్‌జిత్ సిద్ధహస్తుడు కావడంతో, ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఒక సరికొత్త తరహా కథను ఆయన సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ', 'స్పిరిట్' మరియు 'కల్కి-2'వంటి భారీ ప్రాజెక్టులతో ఎంతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబో ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ ఇద్దరి కలయికతో ఒక డిఫరెంట్ సినిమాను చూడవచ్చని అభిమానులు ఆశిస్తున్నారు.